# అనగనగా ఓ మంచికథ

2017




శ్రీ

కౌముది

మీ మునివేళ్ళ్లో సాహితీ వెన్నెల

www.koumudi.net

కౌముది ప్రచురణలు - 184

| సంఖ్య | కథ పేరు | రచయిత(త్రి)పేరు | పేజి |
|---|---|---|---|
| 1 | వాళ్లుపాడిన భూపాలరాగం | పి. శ్రీదేవి | 3 |
| 2 | ధనదాహము యుద్ధోన్మాదము | రంధి సోమరాజు | 14 |
| 3 | టులెట్ .. | అంగర వెంకట శివ ప్రసాదరావు | 18 |
| 4 | గ్రహబలం | టి.వి.శంకరం | 25 |
| 5 | ఎదురు దెబ్బ | తాళ్ళూరు నాగేశ్వరరావు | 32 |
| 6 | కరుణకము | వేటూరి ప్రభాకరశాస్త్రిగారు | 37 |
| 7 | సమస్య | వి.ఎస్.అవధాని | 43 |
| 8 | దివ్యదృష్టి | చక్రపాణి | 48 |
| 9 | డామిట్! కథ అడ్డం తిరిగింది | చంద్ర చిత్ర | 52 |
| 10 | రోజులు మారిపోయేయి | దేశిరాజు | 57 |
| 11 | చెప్పు తెగింది | కె.గోదావరి శర్మ | 59 |
| 12 | కదిలే నీడలు | బాలగంగాధర తిలక్ | 63 |

# వాళ్లుపాడిన భూపాలరాగం

— పి. శ్రీదేవి

(జయంతి - 1959 జులై సంచికనుంచి పునర్ముద్రితం)

రామారావు అడుగులు జాగ్రత్తగా వేస్తూ నడుస్తున్నాడు. సిమెంటురోడ్డుమీద నడవడం అతనికి కొత్త. అప్పడే వర్షాలు పడుతున్నాయి. అయినా ఎండలు తీవ్రంగానే ఉన్నాయి. అంతవరకూ వర్షం పడి వెలిసింది. ఎండ తీవ్రంగా వచ్చేసింది. సాయంత్రమైనా కాదు. మిట్టమధ్యాహ్నం, సిమెంటురోడ్డు మీద తడి యింకా ఆరలేదు. రామారావుకి జారి పడతానేమో అని భయం. అందుకే అతడు అడుగులు జాగ్రత్తగా వేస్తున్నాడు. ముక్కుకు సూటిగానే నడుస్తున్నా పక్కనించి దూసుకుపోతూన్న సిటీబస్సులు, కార్లు, అంబులెన్సులు– అన్నిటినీ తప్పుకుంటూ రోడ్డుకు ఎడం పక్కనే నడుస్తున్నాడు రామారావు, నడుస్తున్నకొద్దీ కొండెక్కినట్టు రోడ్డు ఎక్కడికో ఎక్కిపోతూంది. యువకుడు అనికూడా యింకా అనడానికి వీల్లేని అర్భకుడు రామారావు. అతనికి ఆయాసం వస్తూంది. నెత్తి మాడిపోతూంది. పరిక్షా అయినా చేయించుకుందామా అనుకున్నాడొకసారి. హాస్పిటల్ గేటు కనిపిస్తూనే ఉంది. అది దాటితే మరో ఫర్లాంగుకంటె ఎక్కువుండదుట కలెక్టరాఫీసు. ఎలాగో నడిచేస్తే... "ఒరేయ్ రామం ! రామం......" పరిచితమైన కంఠ మేదో తనని వెంట తరుముతూంది. రామారావు వెనక్కి తిరిగిచూశాడు. సైకిలూ, దానికొక క్యారియరూ. దాని నానుకునే శ్రీనివాసులూ– అవతల పేవుమెంట్ మీద నిల్చుని పెడబొబ్బలు పెడుతున్నాడు. అతనక్కడే నిల్చుని చెయ్యూపేడు, రామారావే రోడ్డుదాటి అవతల పేవ్ మెంటు చేరుకున్నాడు.

"ఏంరోయ్! ఎప్పుడువచ్చావూ ఎక్కడ దిగావు? ఏమిటి విశేషం ? అన్నట్లు పరీక్ష పాసయావా?"

రామారావు శ్రీనివాసులు నెరుగకపోడు, కాని యింత వ్యవధిలేకుండా ప్రశ్నలు– రోడ్డమీద ఆ కేకలూ _ రామారావుకి చిరాకు వేసింది. అయినా ఏం చెయ్యగలడు శ్రీనివాసులు తనకంటే పది, పన్నెండేళ్లయినా పెద్ద, రామారావు అన్నిటికీ సమాధానం చెప్పక తప్పలేదు.

"పొద్దుటే వచ్చాను బావా! సూర్యం బాబాయి గారింట్లో దిగాను, పరీక్ష పాసయానులే. అందుకే ఈ తిప్పటంతా" అన్నాడు,

"అంటే"

"మరేముంది? ఉద్యోగ ప్రయత్నం" అన్నాడు రామారావు.

"ఓరి భడవా ! నిండా పదహారేళ్ళున్నాయో లేదో నీకెవడిస్తాడురా ఉద్యోగం ! స్కూలుఫైనలు పాసయానంటున్నావు కాని శుద్ధ తెలివితక్కువ వాడిలా ఉన్నావే. మీనాన్నే పంపించాడా నిన్ను? ఇంట్లోంచి పారిపోయొచ్చావా ?" శ్రీనివాసులు ఆగకుండా యింకా ఏదో అనేయబోతున్నాడు. అసలతని ధోరణే అది. అవతల వాళ్ళు చెప్పబోయేది కూడా తానే ఊహించేసుకుని ఆపైన తన వ్యాఖ్యానాన్ని కూడా వినిపించేస్తాడు. కాని రామారావు మధ్యలోనే మరోలా సమాధానం చెప్పాడు : "అదేమిటి బావా ! అలాగంటావూ ! నాన్నే నన్నిక్కడికి పంపించారు. ఆమధ్య ఆయనా వచ్చా రిక్కడకి, చాలా అప్లికేషన్లు పెట్టించారు. ఏవో చిన్న చిన్న ఉద్యోగాలేలే వాటి విషయం తేల్చు కుందుకే నన్ను పంపించారు" అని ఆగబోయి మళ్లీ శ్రీనివాసులు ఏం మొదలు పెడతాడోనని" అవును కాని నువ్వెక్కడికి ? ఆఫీసుకా ?" అన్నాడు.

శ్రీనివాసులు ఫకాలుననవ్వి "ఇప్పుడాఫీసేమిట్రా నీ తలకాయ గానీ! అయినా క్యారియరూ అన్నమూ పట్టుకుని ఆఫీసు కెవడైనా వెళతాడా! నాజన్మలో నేను ఉద్యోగం చెయ్యలేదు. ఇంక చెయ్యను. ఆ వెధవలు మహా యిస్తే అరవై యిచ్చేరు, తొంభై యిచ్చేరు. దానితో సంసారం గడిచిపోతుందంటావా ?" అన్నాడు. రామారావుకి నిజంగా అతననేది బోధపడలేదు. బోధపరుచుకునే లోపునే "మనం యిలా మాటాడుతూ కూచుంటే ఆసుపత్రి వాడు టైమయిందని గెంటేస్తాడు. పదపద, మా ఆవిడ ఆవురావురంటూంటుంది ఆకలితో!" అంటూ రామం చెయ్యిపట్టుకుని హాస్పిటల్ వైపు లాక్కెళ్లాడు.

శ్రీనివాసులు చెప్పాడు. వాళ్ళావిడ ప్రసవించి పదిరోజులయిందట. రేపు డిశ్చార్జి చేస్తారట. ఆవిడకి అన్నం పట్టుకోచ్చేడట. గేటుదాకా వెళ్ళాక "ఇక్కడే ఉండు. నిన్నిప్పుడు లోపలికి రానీయరు, నేను లోపలికి వెళ్ళి క్యారియర్ యిచ్చేసి నిముషంలో వచ్చేస్తాను." అంటూ రామారావుని నిలవేశాడు. "కాదు, నాకు పనుంది. వెళ్ళాలి." అనలేక పోయాడు రామారావు.

క్యారియరిచ్చేసివచ్చి శ్రీనివాసులు రామారావుని తనతో యింటికి బలవంతంగా తీసుకుపోయాడు. పట్నం వచ్చేటప్పుడు నాన్న చెప్పిన మాటలన్నీ బాగా జ్ఞాపకం ఉన్నాయి. "ఒరేయ్ ! నువ్విక్కడా అక్కడా దిగి అవస్థపడకు. తిన్నగా మనవాళ్ళ వీధికెళ్ళు. ఆ వీధిలో మనవాళ్ళెవరింట్లో దిగినా నీకు బాగానే జరిగిపోతుంది. సూర్యం బాబాయి ఉన్నాడు. లేదా ఆవీధి చివర డాబా యింట్లో ముందు వాటాలోనే సుబ్బారావూ సీతా కాపురం. వాళ్ళదింకా కొత్త కాపురంలే. అయినా వాడికి మనవాళ్ళంటే ప్రాణం అనుకో. ఆ వీధి మలుపు తిరగగానే కుళాయీ బాదంచెట్టు ఉన్న యిల్లే వెంకటేశ్వర్లు అద్దెకుంటున్నది. నీయిష్టం ఎక్కడ దిగినా అంతా కావలసినవాళ్ళే. అసలందరి యిళ్ళల్లోనూ ఒక్క పూటైనా భోజనం చెయ్యనిదే వదలరులే వాళ్ళు. కాని ఒక్క విషయం జాగ్రత్త, ఆ ప్రక్క వీధిలోనే ఉంటున్నాడట మీ అత్తకొడుకు శ్రీనివాసులు. వాడు మనిషి మంచివాడే. దాన్నెవర్తెనో తెచ్చి కాపురం పెట్టకపోతే నేనిలా అనేవాడిని కాను. లోకులు కాకులన్నారు. అటువైపుపోక నీ పనులేవో నువ్వు చూసుకో..." తాను పట్నం వస్తాననగా నాన్న యింకా ఎన్నెన్నో చెప్పాడు. ఒకటికి రెండురోజులైనా ఉండమన్నాడు. తానిచ్చిన అడ్రసుల వాళ్ళ నందరినీ కలవమన్నాడు; వినయంగా విధేయంగా వాళ్ళను మెప్పించేలా మెలగమన్నాడు. కొందరిని తాను రికమెండేషన్ కోసం కలవాలి, మరికొందరిని ఉద్యోగ మిప్పించమని ప్రాధేయపడటానికి కలవాలి.

నాన్న యిన్ని విధాల యిన్ని చెప్పినా తనకు శ్రీనివాసులుతో వాళ్ళింటికి వెళ్ళక తప్పలేదు. శ్రీనివాసులుది చిన్న యిల్లు, రెండు గదులు, ముందర వరండా, పెరట్లో వంటకి స్నానానికీ రెండు కొట్లు. అయినా వాటాలు, మరొకరితో సంపర్కం లేకుండా హాయిగా ఉంది. వీధి వరండాలో బల్ల మంచంమీద చతికిలబడ్డాడు రామారావు. శ్రీనివాసులు సైకిలు ఆ పక్కనే పెట్టి "ఉండు; కాసిని మంచినీళ్ళు తెస్తాను. మరీ ఎండ పడిపోయావు" అంటూ లోపలికి వెళ్లాడు. అతను మరి రెండు నిముషాలకే మంచినీళ్ళతోనేకాక మరొక స్త్రీమూర్తితోసహా బయటికి వచ్చి

"ఇదిగో వీడు మా రామం. అంటే మా రామచంద్రం మామయ్య కొడుకు. వేలెడంత ఉన్నాడు. స్కూలు ఫైనలు పాసయిపోయి ఉద్యోగంకోసం ఈ ఊరొచ్చాడు." అంటూ రామాన్ని చూసి చిరునవ్వుతో "ఈవిడ మీ ఇంకో అక్కయ్య రామం! ఈవిడ పేరు వరలక్ష్మి." అన్నాడు.

రామాన్ని ద్వైధీ భావంతోకూడిన ఎన్నో ఆలోచనలు ఊపిరాడ నియ్యకుండా చేసినా అతనిలో ఏమూలో ఉన్న సంస్కారం అతనిచేత "నమస్కారం" అనిపింప చేసింది.

ఆవిడ మల్లెపూవులా విడిన ముఖంతో "భోజనమైందా తమ్ముడూ ?" అన్నది.

రామం ఆ పలకరింపునకు నిర్ఘాంతపోతూనే "అయిందండీ ! పదిగంటలకే బాబాయిగారింట్లో చేసేశాను." అన్నాడు.

"లోపలి గదిలో కూర్చోబెట్టండీ_ అరగంటలో టిఫిను కాఫీ తయారయిపోతుంది." అంటూ అదే ప్రసన్నవదనంతో ఆమె ఇంట్లోకి వెళ్ళిపోయింది.

"రా రామం! లోపల కాస్త చల్లగానైనా ఉంటుంది. వెధవ వర్షంపడి మరింత ఉడకబెడుతూంది" అంటూ శ్రీనివాసులు లోపలికిదారితీశాడు. ఇంటి నాల్గుమూలలూ పరిశీలిస్తూ రామం అతనికూడానే వెళ్ళాడు.

★ ★ ★ ★

మూడు నాలుగేళ్ళక్రితం రామం వాళ్ళ ఊరికి ఏవో భూముల తగాయిదాల్లో తరుచూ వెళ్ళేవాడు శ్రీనివాసులు. అసలు ఆ వీధిలో ఈనాడు స్థిరపడిన ఈ శ్రీనివాసులు, సూర్యం, సుబ్బారావు, వెంకటేశ్వర్లు– వీరందరూ రెండు తరాలకు పూర్వం సమిష్టి కుటుంబంగా బ్రతికే ఒక కుటుంబపు సంతానమే.

ఫలానా ఊరు కిష్టయ్యగారు అంటే బోలెడు ఆస్తి, గంపెడు సంసారము. ఆ కిష్టయ్యగారి ఆడపిల్లలకు పిల్లలు, మొగపిల్లలకు మనుమలు పుట్టగా, తలొక తోవ పట్టగా, కొందరుమాత్రం పట్నం చేరుకున్నారు. కొత్తగా పట్నం చేరినవాడికి ఇది వరకు పట్నం చేరినవాడు ఇంటివాటా చూసి పెట్టడం, అవసరాలకి ఆదుకోవడం జరుగుతూండేది. ఈ విధంగా ఆ అయిదారు కుటుంబాలు ఆ వీధిలోనే స్థిరపడ్డారు.

మూడు నాలుగేళ్ళ కిందటిదాకా శ్రీనివాసులు సూర్యం బాబాయితోనే ఉండేవాడు, సూర్యం మొదటి కళత్రం ఒక్క ఆడపిల్లని కని చనిపోయింది. ఆ పిల్లే శ్రీనివాసులు భార్య సుశీల. ఆమే యిప్పుడాస్పత్రిలో ఆరో శిశువును ప్రసవించి రేపింటికి రాబోతూంది. సూర్యం మొదటి భార్య పోయాక మళ్లీ పెళ్లి చేసుకొన్నాడు. శ్రీనివాసులికి పదహారవ యేటే పెళ్లయింది, అతని తండ్రి అంతకు ముందే చనిపోయాడు. తరువాత ఏడాదిలోపునే తల్లి పోయింది. అప్పటినుంచీ మామగారి యిల్లే అతనికి శరణ్యం. శ్రీనివాసులుది కాస్తో కూస్తో ఆస్తికాదు. ఏభై యకరాల మాగాణి. మామగారి రెండో భార్యకు ఏటేటా సంతానం, అతని భార్యకు రెండేళ్ల కొక శిశువు తప్పనిసరి. పుట్టిన ప్రతి పిల్లకీ బాలసారెలు, పండుగలూ పబ్బాలూ, పట్నం వచ్చిన వాళ్లందరికీ ఆ యిల్లొక ధర్మసత్రం. ఆ ఉమ్మడి సంసారం ఖర్చులన్ని పాపం శ్రీనివాసులు పొలమే భరించింది, పొలం మీద డబ్బుతినేవాడే కాని దాని బాగోగులు చూచుకొనే నాధుడు లేక, రాబడికి మించిన ఖర్చుచేత కొంత హరించుకు పోయింది. మరికొంత కొత్త చట్టాల ధర్మమా అని రైతుల హస్తగతమయింది. ఇంత జరిగేక అందులోంచి మరి దమ్మిడీ పుట్టదని స్పష్టమయేక మామగారు అల్లుడితో రభసకు దిగేరు. అందులోంచి బయట పడ్డాకనే శ్రీనివాసులు వేరింట కాపురం పెట్టడం, కొత్త హంగులు కూర్చుకోవడం అన్నీ జరిగాయి. ఇప్పుడు అల్లుడికీ మామకీ మాటలు లేవు.

రామారావుకి ఈ జరిగిన సంగతులన్నీ చూచాయగా తెలుసును, మామతో వేరుపడినప్పుడే శ్రీనివాసులు వాళ్ల ఊరువచ్చి ఉన్న భూమిలో వీలైనంత అమ్మేసి ఆడబ్బు పట్టుకుని వేరింట కాపురం పెట్టాడు. అయితే రామానికి బోధపడని దల్లా ఒక్కటే. అసలే ఇంత బెడదగా ఉంటే ఆ ఎవర్తెనో ఎందుకు తెచ్చుకున్నాడు? అనవసరంగా ఎందుకు చెడిపోయాడా అని.

★ ★ ★ ★

మధ్యాహ్నం పన్నెండుగంటలకి తారసపడిన శ్రీనివాసులు సాయంత్రం ఆరైనదాకా రామాన్ని విడిచిపెట్టలేదు. ఎలాగో ఆరుగంటలకి అతి ప్రయత్నం మీద బయటపడ్డాడు రామం. అతనికి మనస్సు కలగాపులగంగా వుంది, ఇప్పుడింక చేయ వలసినదేమిటి? సూర్యం బాబాయి యింటికి వెళ్లాలా ? ఇప్పటినుండి ఎందుకు. భోజనం వేళకు వెళితే సరిపోతుంది, అయినా ఆ యింట్లో మహా చీదర. వాళ్ల పిల్లలు – బాబోయ్ యమకింకరుల్లాంటివాళ్లు. ఇంటికెవడో కొత్తవాడు వచ్చేడనే గౌరవం లేదుకదా నెత్కెక్కి పిండి కొడతారు. జేబులు తడిమే వాడొకడు. భుజమెక్కే దొకతే. పొద్దుట రెండు గంటల అనుభవంతోటి తలవాచి పోయింది రామానికి, దానికితోడు సూర్యం బాబాయి భార్య దాసీదానితో పోట్లాట ఒకటి. ఆసీను సినిమా తియ్యాలిసిందే. ఆ కోపంలో తనకి కాఫీ తెచ్చియ్యబోయి భడాలున గ్లాసు కింద పడేసింది. మళ్ళీ కాఫీ తయారయేసరికి ఒక గంట పట్టింది కాని మళ్ళీ వచ్చిన కాఫీ అది కాఫీ కాదు. రంగూ రుచీ వాసనా లేని ఏవో కషాయం నీళ్ళు.

వచ్చినతోవనే రోడ్డెక్కి బీచి వైపునడుస్తున్నాడు రామం. సూర్యంబాబాయి యింటికి శ్రీనివాసులు యింటికీ ఎంత తేడా ! ఇల్లు చిన్నదే కాని శుభ్రంగా ఉంది. లోపలిగదిలో కొద్దిగా ఫర్నీచరూ చిన్న రేడియో కూడా ఉన్నాయి. వాళ్ళకీ అయిదుగురు పిల్లలున్నారు. అంతమంది పిల్లలున్న సంసారం లానే లేదు. పెద్దపిల్లలు బడికిపోయేరట. చిన్న వాళ్లు నిద్రపోతున్నారు. అందరిలో పెద్దదానికి పదకొండేళ్ళుట. అప్పుడే ధర్డుఫారమ్ చదువుతూందట.

"అది చాలా తెలివైనదిరా–దానిని ఎం బి. బి. యస్. చదివిస్తాను," అన్నాడు శ్రీనివాసులు.

అదృష్టమంటే అలా ఉండాలి, తనూ చదివేదు చాలా చురుకుగా, స్కూలుఫైనలులో స్కూలుకి తనదే ఫస్టుమార్కు. చిన్నప్పటినుండీ ప్రతి క్లాసు లోనూ తనదే పైచెయ్యి. అయినా తనతండ్రి రామచంద్రయ్య ఒక్క నాడైనా "నిన్ను పై చదువులు చదివిస్తాను"అనలేదు. రామచంద్రయ్యకు సమస్యల నిట్టే పరిష్కారం చేసే తెలివితేటలున్నాయి. పెద్దకూతురు మీనాక్షికి పదహారో యేడు వచ్చీరాగానే సంబంధాలకోసం ఎక్కువ బాధపడకుండానే రెండో సంబంధం చేసి వదిలించుకున్నాడు. రెండో సంబంధమైతేనేం వాళ్ళాస్తి పరులు – పిల్ల సుఖపడుతుంది అంటాడతను. ఇక కొడుకు రామారావు స్కూలుఫైనలు పరీక్ష వ్రాసి రాగానే రామచంద్రయ్య బయలుదేరి పట్నం వచ్చి ఏ యే ఆఫీసుల్లో ఏ యే ఖాళీలున్నాయో వాకబు చేసి నలభై రూపాయిల జీతం మొదలుకొని అరవై దాకా యిచ్చే అన్ని ఉద్యోగాలకీ అప్లికేషన్ ఫారాలు తెచ్చి కొడుకుచేత సంతకాలు పెట్టించాడు.

రామం చేతిలో ఇరవై రూపాయిలు పెట్టి పట్నం పంపించినది ఆ ఫలితం తేల్చుకుందుక–ఒక వేళ ఏ ఉద్యోగమైనా దొరికి వెంటనే చేరిపొమ్మంటే సందేహించక అలాగే చేయమన్నాడు. నిజానికి శ్రీనివాసులు కున్న స్తోమత ఏమిటి? ఆ మాత్రం రామచంద్రయ్యకూ ఉంది. ఒక్కగానొక్క కొడుకు చదువును స్కూలు ఫైనలుతో ఆపేయవలసిన అవసరం లేదు. అయినా రామచంద్రయ్యకి కొడుకు పెద్ద చదువులు చదవాలనే దురాశలేదు. ఎలాగో అందరూ బతికుంటేచాలు – అంతే.

బీచిలో కూర్చుని ఇసుకతవ్వుతూ బాగా చీకటి పడేదాకా రామం ఒకటే ఆలోచిస్తున్నాడు. వీళ్ళందరూ ఎందుకు బతికున్నట్లు? తనుమాత్రం చేయబోయేదేమిటి ? ఇలాంటి బరువైన ఆలోచన అతని కాయా పండూ కాని మెదడులో ప్రవేశించినపుడు రామాని కనిపించింది. "నేనప్పడే అంత పెద్దవాడినయిపోయానా – నా యీడు వాళ్ళు ఆ వెంకటస్వామి చిన్నకొడుకు, మిల్లు మేనేజరుగారి పెద్దకొడుకు వీధుల్లో గోలాడుకుంటూ హాయిగా గడపడం లేదా ! ..."

రామం వయస్సుకంటే అతని మెదడు ముందుకు పోతూంది. అందుకే రామానికి భయంగా ఉంది.

మళ్ళీ వరలక్ష్మీ గురించిన ఆలోచన, అసలెవ రావిడ ? ఎవరైతేనేం? మనిషి మంచిది. ఎంత ఆప్యాయంగా ఉంటుంది! మనిషిలో ఎక్కడా అల్పత్వం కనబడదు. అలా అనుకునేసరికి మళ్ళీ రామానికి భయం వేసింది.

సూర్యం బాబాయి ప్రొద్దుటే అన్నాడు–"ఓరే మీ సుశీలక్క, మొగుడు శ్రీనివాసులు లేడూ వాడీ ప్రక్కవీధిలోనే ఉన్నాడు. బాగా చెడిపోయాడు. వినే ఉంటావు. వాడి గుమ్మంమాత్రం తొక్కకు. నీ కసలే అభమూ శుభమూ తెలియదు. నిన్ను కూడా చెడిపేయ గలడు." అంటూ – క్లాసులో ఫస్టుమార్కులు తెచ్చుకోవడం తప్ప మరొక పరిజ్ఞానంలేని రామాని కిదంతా ఏం బోధపడుతుంది? ఏది చెడిపోవడమో ఏది కాదో కూడా అతనికి బోధపడటం లేదు. మధ్యాహ్నంనుండి సాయంత్రం దాకా అక్కడుంటే అది చెడిపోవడమేనా అని అతని మనస్సు పదేపదే ప్రశ్నిస్తూంది. అయినా వరలక్ష్మి పట్ల అతనికి గౌరవమే కలిగింది. అందువల్ల శ్రీనివాసులంటే మరింత అభిమానం వచ్చింది. ఆ సంగతి ఎవరికి తెలిసినా ప్రమాదం. అందుకని ఆలోచనల నన్నిటిని గుప్తంగా దాచుకుని యమలోకంలాంటి తన బస చేరుకున్నాడు రామం.

మర్నాడంతా రామం తన పనిమీద ఎక్కడెక్కడో తిరిగాడు. ఒక్కచోట కూడా ఉద్యోగం వచ్చే ఆశ కనబడలేదు. రాత్రి యింటికి చేరుకునే సరికి పొద్దుపోయింది. గుమ్మంలో అడుగుపెడుతూ యింట్లో మనుష్యులు లేరేమో అనుకున్నాడు, ఇల్లంతా చీకటి గుయ్యారంలా ఉంది. ఇంతలో ఉన్నామండోయ్ అని చెప్పడానికే అన్నట్లు చంటి వాడి కాకిగోల మొదలుపెట్టాడు. ఇంటావిడ ఆ చీకట్లో ఏ మూలో ఓ గోరంత ఆముదం దీపం వెలిగించి "ఏడవకురా బాబు! యిదిగో దీపం వెలిగించాను" అంటూంది ఆ ఆరునెలల పసివాడితో.

అంత చీకటిలో ఒక్కడుగు ముందుకు వెయ్యటానికి కూడా భయం వేసింది రామానికి, ఏపోకిరీ పిల్లో కాళ్ళకింద కసుక్కుమంటుందేమో అనిపించింది, "హరికేన్ లాంతరూ అగ్గిపెట్టె యిలా పడెయ్యండి పిన్నిగారూ! నేను వెలిగిస్తాను" అన్నాడు వీధరుగుమీదనుండే.

వీధిలోనుంచే వస్తూ గడపలో కాలు పెట్టిన సూర్యం "వచ్చావా రామం ! నీకోసమే ఎదురుచూస్తున్నా, చూడూ ! కిరసనాయిలు అయిపోయింది. సమయానికి అగ్గిపెట్టికూడా అయిపోయిందిట. మీ పిన్ని వట్టి అపసంతి మనిషనుకో – వెలుగుండగానే ఇలాంటివన్నీ చూసుకోవద్దూ. ఆ వెంకటేశం గాడింటికి వెళ్ళాను. ఇంత కిరసనాయిలు పోసి ముట్టిస్తాడేమోనని. వాళ్ళంతా సినిమా కెళ్లిపోయారుట. ఒక్క అర్ధరూపాయుంటే యిలా పడెయ్యి యిప్పడే ఒక్క అంగలో ఒక బుడ్డి కిరసనాయిలూ ఒక అగ్గిపెట్టి తెచ్చుకొస్తాను" అంటూ చెయ్యిచాచాడు.

రామానికివ్వక తప్పలేదు. అర్ధ రూపాయ తీసికుంటూనే "మరోలా అనుకోకు నాయనా ! సమయానికి ఆ పర్సు ఎక్కడ పెట్టేశానో గుర్తు లేదు. ఈ చీకటిలో ఎలా వెతకను చెప్ప. రేపిచ్చేస్తానులే!" అంటూ వీధిలోకి వెళ్ళిపోయాడు.

తరువాత మూడురోజులలో రామానికి మరి కొన్ని చిత్రమైన అనుభవాలు కలిగాయి. ఒకరోజు మధ్యాహ్నం పప్పన్నంపెట్టి పిన్నిగారు

"ఈ పట్నంలో కూరగాయలు సరిగా దొరకవు నాయనా! బోలెడు డబ్బుపోసినా కూరన్నదే కంటికి కనబడదు" అంటూ మజ్జిగ వడ్డించేసింది.

అది ఆ ఒక్కపూట సంగతి కాదు. రాత్రి కందిపచ్చడి పగలు నీళ్ల చారు– ఎప్పటికప్పుడే పట్నాన్ని తిట్టిపొయ్యటం. ఆ యింట్లో ఏదీ ఏప్పుడూ ఉండదు. ఉన్నదల్లా ఒక్కటే – లేమి, అయినా అందరూ బతికేస్తున్నారు. బతకడంలోనూ అతి నిబ్బరంగాను ఒక్కరూ దానిని లేమి అనరు. భార్య అపసంతితనం అంటాడాయన. భర్త మతిమరుపు అంటుందావిడ. ఒకనాడు

"బియ్యం నిండుకున్నాయి. ఒక బస్తా పంపించమని ఆ కొట్టు వాడితో నిన్ననగా చెప్పాను. వాడొక మతిమరుపు ముండా కొడుకు. ఒక రూపాయి యిలా యియ్యి నాయనా! పక్క కొట్లో తెస్తాను" అన్నాడు సూర్యం. రామం యివ్వకుండా ఉండలేకపోయాడు. నాన్న ఇచ్చిన ఇరవై రూపాయిలలో ఆరు రూపాయిలు సూర్యం బాబాయే కాజేశాడు. తిరిగి యిస్తాడన్న ఆశ తనకు లేదు. అతనికి అంతుచిక్కని విషయమల్లా ఒక్కటే. ఈ యింట్లో ఇద్దరు పెద్దవాళ్ళు ఏడుగురు పిల్లలూ కానీ సంపాదన లేకుండా ఎలాగ బతుకుతున్నారా అని. లేని డబ్బు ఎలాగూ లేదు, శుచీశుభ్రమూ అయినా లేదు. వాళ్ళభాష, వాళ్ళప్రవర్తన, వాళ్ళ అలవాట్లు అన్నీ రామానికి అసహ్యమే కలిగించాయి.

ఆ మూడురోజుల్లో అతనికి మళ్ళీ శ్రీనివాసులుని కలవటం పడలేదు కాని తక్కిన బంధువులను సందర్శించక తప్పలేదు. ఒక్కొక్క కుటుంబం ఒక విచిత్రమైన సంస్కారంతో బతుకుతూంది. తన తండ్రి రామచంద్రయ్య ఈ వంశవృక్షంలో వాడే అయినా అతని తరహా వేరు, అతడు చేసేది శుద్ధమేష్టరీ ఉద్యోగమే అయినా అతడు లేమితో బాధపడడు. అశుచితో బాధపడడు. అనారోగ్యం వాళ్ళింట్లో ఎరుగరు. వాళ్లది ఒక కుదురైన చిన్న సంసారం, జీవితావసరాలైన తిండి బట్ట సమపాళ్ళలో ఉంటాయి. అంతకుమించి మరేమీ అక్కరలేదు కూడా, రేడియోలు, గ్రామఫోనులు, సినిమాలు వీటిలో బొత్తిగా నమ్మకంలేదు రామచంద్రయ్యకు, ఏదైనా కథా, కార్యమూ జరిగినా, పొదుపుగా, మళ్ళీశాస్త్రోక్తంగా జరిపిస్తాడు. శాస్త్రం ముఖ్యం కాని ఆడంబరాలెందుకురా అంటాడతను, బతికున్న ప్రతివాడికీ తిండీ బట్ట; తినడానికి కట్టుకుందుకూ బతికుండడం. ఇదే జీవిత పరమావధి అని రామచంద్రయ్య అనుభవం. ఆ సంస్కారంలోనే పెరిగి, ఆ తిండి బట్టా సమకూర్చుకునే జీవనోపాధికోసం వచ్చిన రామానికి, జీవితం పొదువును చాలా తక్కువ చూసిన రామానికి; ఇటు సూర్యం అటు వెంకటేశ్వర్లు, మరొక భ్రాతృసమానుడు సుబ్బారావూ. అందరూ వింతగా కన్పించారు.

వెంకటేశ్వర్లు వారానికి మూడుసినిమాలయినా చూస్తాడు. వచ్చిన సినిమానల్లా కనీసం రెండు మార్లయినా చూస్తాడు. భార్యతో సహా వెళతాడు. అతనికి డెబ్భయిరూపాయల ఉద్యోగంట. ఇద్దరు పిల్లలున్నారు. పిల్లల్ని పక్క వాటా వాళ్ళింట్లో వదిలేసి భార్యాభర్తలు సినిమాలు చూస్తారట. అతనిదగ్గర విశేషమేమిటంటే డబ్బులేదని భోజనం మానేయగలడు, ఆవిడా అంతే. పిల్లలికి ఆ పూటకి ఒక పకోడీల పొట్లం కొనిచ్చి యిన్ని మంచినీళ్లు తాగిస్తారు. సినిమా మాత్రం విధిగా చూడాలిసిందే. అయితే మాత్రం ఇరవై రూపాయిలు ఇంటద్దెకే అవుతుందిట. డబ్బుకట్టలేదని వాళ్ళ వాటాకి ఎలక్ట్రిసిటీ కనెక్షన్ పీకేశారుట. ఆ పకోడీలకయినా ఆ సినిమాలకైనా అతనికొచ్చే డెబ్భయి రూపాయలు ఎలా చాలుతాయన్నది రామం స్కూలుఫైనలు మెదడు లెక్క కట్టలేకపోయింది.

సుబ్బారావు తండ్రి వ్యాపారంలో లక్షలు గడించేడంటారు, కాని ప్రస్తుతం ఆస్తి ఎంతో అప్పు అంతా ఉందని అనుకుంటారు. ఏదయినా లక్షాధికారి కొడుకు గనుక సుబ్బారావు ఫోర్తు ఫారమ్ దాటి ఇంటర్మీడియట్ ఫెయిలవడానికి పన్నెండేళ్లు తీసుకున్నాడు. అంటే అతనికి దగ్గరగా ముప్పయి యేళ్ళున్నాయి. వాళ్లహోదాకు తగిన సంబంధం దొరకక పెళ్లి చాలా కాలంగా వాయిదా పడి ఈ మధ్యనే జరిగింది, దానితో చదువు పూర్తిగా సున్న చుట్టేసింది. చిన్న ఉద్యోగాలు చెయ్యడం వాళ్లకు పరువునష్టం. పెద్ద ఉద్యోగానికి ఆర్డరు అతనికింతవరకూ రాలేదు. అందుచేత నాన్న యింటినుండి లెక్కపెట్టి డబ్బు పంపిస్తాడు. అది వాళ్ళ కొత్త కాపురానికి వారంరోజులకే చాలదు. సినిమాలు, బోటు షికార్లు, హోటళ్లు, ఐస్క్రీములు. వీటికే ఎక్కడ లేని డబ్బు చాలదు. ఆ తరువాత ఎలా గడుస్తూంది వీళ్ళకి – రామానికదీ ప్రశ్నే.

★ ★ ★ ★

రామారావు తాను వచ్చిన ఐదో రోజున కాబోలు మళ్ళీ శ్రీనివాసులు యింటికి వెళ్ళాడు. అప్పటికి సుశీల హాస్పిటల్ నుండి యింటికి వచ్చేసింది. సుశీలక్కయ్యని తను బాగా చిన్నప్పుడు చూచాడు, అయినా ఆవిడ వెంటనే పోల్చి పలకరించింది. శ్రీనివాసులు యింట్లోలేదు.

"మళ్ళీవస్తా" అని తిరిగి వెళ్ళ బోతూంటే సుశీల

"అదేమిటి రామం ! మీ బావ పావు గంటలో రానే వస్తారు. మే మేం కొత్తవాళ్ళం కనుక నా ! ఇలా కూర్చో నే నాసుపత్రిలో ఉండగా వచ్చేవట కదూ !" అంటూ మాటల్లో దింపింది.

వరలక్ష్మి తన రాకనెప్పుడు గమనించిందో కాఫీ తెచ్చిఇచ్చింది.

కాఫీ పుచ్చుకుంటూనే రామం వాళ్ళిద్దరి వంకా తీక్షణంగా చూచాడు, అతని మనస్సులో కొన్ని పరిచితమైన అభిప్రాయాలేవో ముందు మెరిశాయి.

"వీళ్ళిద్దరూ ఒక్క యింట్లో! ఎంత అన్యాయం ! వెంకటేశ్వర్లు మొన్న అన్నట్లు సుశీల అక్కయ్య ఎంత కుమిలి పోతుందో!" ఒక క్షణమాత్రం అతని సానుభూతి అంతా సుశీలవైపు ఒరిగింది.

"అయ్యయ్యో! అదేమిటమ్మా పచ్చిబాలింతవు నన్నడిగితే నేనివ్వనూ !" పిల్లబట్టలకోసం మంచం దిగి వెళుతూన్న సుశీలను వారిస్తూ అంది వరలక్ష్మి .

"బాగుంది తొలి కాన్పునాడే లేని సుకుమారమీవాళ దేనికి లక్ష్మీ" సుశీలకంఠంలో ఎత్తిపొడుపు లేదు. ఆదరం ధ్వనిస్తూంది.

ఏమిటి వీళ్ళిద్దరూ! నటనా ! అని విస్తుపోయాడు

ఆ విస్మయం అట్టేసేపు లేదు రామానికి, పావు గంటలో వస్తాడన్న శ్రీనివాసులు అరగంట దాటాక గాని రాలేదు. ఈ మధ్యలో సవతు లనిపించుకునే ఆ యిద్దరు స్త్రీలు రామారావు అభిప్రాయాలెన్నో మార్చేశారు. వట్టిది. సుశీల ఏమీ కుమిలిపోడం లేదు. కుమిలిపోయే మనిషిలో ప్రశాంతత ఎలా ఉంటుంది? వరలక్ష్మి కి ఆమెకీ మధ్య పొరపొచ్చా లున్నాయనడం శుద్ధ పొరపాటు. వాళ్ళమట్టుకి వాళ్ళు హాయిగా ఉన్నారు. లోకం ఎందుకింత ఆడిపోసుకుంటూందో!

శ్రీనివాసులు వచ్చాడు. రామారావు అంత వరకూ ఎవరెవరిని కలుసుకున్నాడో ఫలితాలెలా ఉన్నాయో అన్నీ చెప్పాడు. శ్రీనివాసులుతో రామం మాట్లాడుతుండగానే వేంకటేశ్వర్లు వచ్చాడు. రామాన్ని చూసి గతుక్కుమని

"ఇదేమిటి మకాం మార్చేశావూ !" అన్నాడు,

"అబ్బే లేదు ఊరికనే వచ్చాను" అన్నాడు రామం.

వేంకటేశ్వర్లు శ్రీనివాసులుని పక్కకి పిలిచి ఏదో అన్నాడు. శ్రీనివాసులు లోపలికి వెళ్ళి ఏదో అన్నాడు. మరో రెండు నిముషాల్లో వరలక్ష్మీ వాకిట్లోకి వచ్చి శ్రీనివాసులు చేతిలో అయిదు రూపాయిలు కాబోలు పెట్టింది. అతని చేతిలోంచి ఆ నోటు వేంకటేశ్వర్లు జేబులోకి వెళ్ళడం అతను వెంటనే వీధిలోకి దాటెయ్యడం జరిగాయి.

మరొక పావుగంటా గడిచాక సూర్యం పెద్ద కొడుకు సంచీ చేతపట్టుకుని వచ్చి "అక్కాయ్ ఒక శేరు బియ్యమియ్యమంది అమ్మ" అన్నాడు సుశీలతో,

"వరలక్ష్మక్కయ్య నడుగు" అన్నదామె.

ఆ అబ్బాయి లోపలికి వెళ్ళడం సంచి నింపుకుని బయటికి వెళ్ళడం గమనిస్తూనే ఉన్నాడు రామం.

రామానికి నిజంగా ఆశ్చర్యం వేసింది, ఏమిటి వీళ్ళంతా? వాళ్ళగడపలో కూర్చుని ఈ శ్రీనివాసులునే నానాతిట్లూ తిడతారు. అవసరాలన్నిటికీ ఇతనిగడప తొక్కటాని కెవరికీ సంశయం లేదు. వింతమనుష్యులు! అనుకున్నాడు.

ఉండబట్టలేక "ఏమిటి బావా! వీళ్ళందరూ మీయింటికి వస్తారన్నమాట" అన్నాడు గొణుగుతున్నట్టుగా. శ్రీనివాసులు గట్టిగా సిగరెట్టు ఊది పారేసి

"అదా! అదొక చిదంబర రహస్యంలే. వాళ్లంతా నన్ను వెలివేశారు. కాని డబ్బులికీ బియ్యానికీ వెలిలేదుగా" అని

"ఆ గొడవంతా దేనికి గాని రేపు నీ ప్రోగ్రాం ఏమిటి రామం ? సినిమాకి వెళదాం రా రాదూ?" అన్నాడు.

"ఏం సినిమాలో లే బావా ! ముందు వచ్చిన పని అయితే కదా ! నాన్న చెప్పిన లిస్టంతా చాల వరకూ పూర్తయింది. ఒక్క పెద్దమనిషి మాత్రం కనపడ్డం లేదు. అతను రేపు ఊరునుండి వస్తాడట. అతన్ని కలుసుకుంటే ఏ సంగత తేలిపోతుంది."

"ఎవరతను ?"

"శేషగిరి అని కలెక్టరాఫీసులో ఉంటాడట..."

"ఆరి నీ యిల్లు బంగారంగానూ! వాడా ! చెప్పావ్ కాదూ వాడిని నాకు బాగా తెలుసు. వాడి ద్వారా నీకేం కావాల్సినా చేయించే భారం నాది. అతనెవరో తెలుసా ! వరలక్ష్మి కి వరుసకి అన్నయ్యవుతాడు. నాకు క్లాసుమేటు కూడాను"

ఆ మాటన్నప్పుడు శ్రీనివాసులు రామంవైపు అదోలా చూశాడు. ఆ చూపులో రామానికి ఎన్నో అనిపించాయి. నీకు కావలసినది నేను చెయ్యగలను తెలుసా అన్నట్లు, చేస్తే నేనే ఎవరికైనా ఇలాంటి సహాయం చెయ్యాలి అన్నట్లు. ఏమని జవాబు చెప్పాలో తెలియని సందిగ్ధావస్థలో పడ్డాడు రామం. శ్రీనివాసులు అతని భుజం మీద చరిచి. "ఏమిటలా బిత్తర పోతావు ? నువ్వేదో అడగాలనుకుంటున్నావు. కాని భయపడుతున్నావు. నాకు తెలుసులే. నువ్వింకా పసివాడివి. తెలిసీ తెలియని జ్ఞానం. అయినా చూడు నువ్వు తెలివైన వాడివి. ప్రపంచ పోకడలను కొంత చూస్తున్నావు. వాటి లోతేమిటో నీకు తెలియదు. ఈ వయస్సులోనే ప్రపంచాన్ని కొంచెం అర్థం చేసికవడం అవసరం. నాగురించి చాలా వినుంటావు. ఈ వరలక్ష్మి మాటెత్తినప్పుడల్లా ఎవరీమె? ఏమా కథ అని నీ మనస్సులో కుతూహలపడతావు." అని నిజమేకదూ అన్నట్లు చూశాడు శ్రీనివాసులు రామం కళ్ళలోకి.

రామానికి నిజంలాగా తోచింది. అబద్ధం లాగా తోచింది. తనకు తానై ఆ ప్రశ్నకు శ్రీనివాసుల్ని జవాబివ్వమనడు. కాని అతనే ఏదో ఉపోద్ఘాతం మొదలు పెట్టేసరికి ఆసక్తీ పెరిగింది. "ఊ" అన్నాడు చివరికి.

"ఇక్కడ మనవాళ్ళందరూ నా గురించి చాలా చెప్పేరు నీకు కదూ ! ఇక నా గురించి నేను చెప్పేది విను. నువ్వు నిజంగా చిన్నవాడివే. అయినా మీనాన్న నిన్ను జీవితంలోకి నెట్టేస్తున్నాడు. అందుచేత పెద్దవాడిలా విను. వాళ్ళందరూ అన్నట్టు చిన్నవాడిని చేసి నిన్ను చెడుత్రోవ పట్టిస్తున్నానని భయపడకు. ఈ మహా ప్రపంచంలో ఎవరిత్రోవ వాళ్ళది. ఒకళ్ళవల్ల మరొకరు చెడిపోవడమనేది కేవలం పొరపాటు అభిప్రాయమనుకో. మానవుడు తెలివి తక్కువవల్ల చెడిపోతాడు. లేదా చవటతనం వల్ల చెడిపోతాడు. బ్రతుకు తెరువు తెలిసిన వాడెవ్వడూ చెడిపోడు." శ్రీనివాసులు మళ్ళీ రామాన్ని పరక్షగా చూశాడు. తను చెప్పేవి ఆసక్తిగానే వింటున్నాడు రామం.

శ్రీనివాసులు మళ్ళీ ప్రారంభించాడు. "నా సంగతి క్లుప్తంగా చెప్తాను విను. విని ఈ మనుష్యుల మూలతత్వమేమిటో, ఆ తత్వాన్ని గుడ్డిగా అనుసరిస్తే మనకొరిగేదేమిటో అన్నది నీ తెలివితేటలనన్నీ కరగించి ఆలోచించు. మీ నాన్నా మా నాన్నాలాంటివాడే వరలక్ష్మి కొకనాన్న. ఒక్కతే కూతురు. కొడుకులు చాలమంది. మీ అక్కలందరికిలాగేనే ఆమెకి పదకొండో యేటో పన్నెండో యేటో పెళ్ళిచేశారు. డబ్బున్న సంబంధం. కాని ఏం లాభం ఏడాది తిరగక ముందే ఆ మహనీయుడు చచ్చిపోయాడట. అప్పటికీమెకైతే డబ్బు విలువా తెలియదు. భర్త విలువా తెలియదు.

ఆమె నాన్నకి డబ్బు విలువ బాగా తెలుసు. వియ్యాలవారి ముక్కుపిండి పాతిక వేల రూపాయిల ఆస్తి సంపాదించాడు. ఆమె బాల్యం నుండి యౌవనం దాకా ఆ ఆస్తిని వడ్డీలకు వడ్డీలై పెరుగుతూ వచ్చింది. ఈ కాలపు మనుష్యులు కొందరు మళ్ళీ పెళ్ళి చెయ్యండి పాపం అన్నారుట. 'చస్తే అలా జరగదు' అనేశాడు చచ్చి స్వర్గాన ఉన్న తండ్రి. తెలివిగా చదువుకుంది. స్కూలు ఫైనలు దాకా వచ్చేసరికి ఆ పైన చదువు సాగనియ్యకుండా చేశారు బతికున్న అన్నదమ్ములు. ఆమె గట్టిగా చదువుకుంటే ఎక్కడి కెగిరిపోతుందో — అప్పుడంత ఆస్తీ వాళ్ళకి దూరమైపోతుందని వాళ్ళ బెంగ. కాని స్వేచ్ఛ, మెలకువ, ఆమె రక్తంలోనే ఉన్నాయి. ఇరవై సంవత్సరాల వయస్సు వచ్చేసరికి ఆవిడకీ కోరికలు పెరిగాయి. ఆవిడ ఆస్తిమీద చూట్టూ ఉన్న మనుష్యులకూ మోజు పెరిగింది. ఆ సమయంలో ఈ శేషగిరి ద్వారానే నాకామె పరిచయం కలిగింది. కళ్ళకేదో జబ్బుచేసి కె.జి. ఆసుపత్రిలో వైద్యానికి వచ్చింది. తననీ తన ఆస్తినీ జాగ్రత్తగా వాడుకోగలిగే మనిషి కావాలని అన్వేషించిందావిడ. వఠి లాటరీయే అను రామం ! ఆవిడకి నేను సరియైన మగాడుగా అనిపించానెందుకో– నిన్ను నేను నమ్మకున్నా నన్నది. భేష్ నీ నమ్మకాన్ని వమ్ము చెయ్యనన్నాను నేను, చెయ్యలేను కూడా ! ఏమంటావా? ఆస్తితోపాటు అందమైన ఆడది వచ్చి నిన్నే వెతుక్కుంటున్నా అంటే కాదనేటంత నపుంసకుడను కానుగా! మేం పెళ్ళిచేసుకోలేదు నిజమే. తెలివితక్కువచేతకాదు. ధైర్యంలేక కాదు. తెలివైనవాళ్లమూ గడుసువాళ్లమూ కనుక. పెళ్ళి అనేది తలపెడితే ఆవిడ ఆస్తికీ గొడవ వస్తుంది. బహు భార్యాత్వం చట్టవిరుద్ధం. రెండు విధాలా నష్టం." మళ్ళీ శ్రీనివాసులు రామం వంక చూచాడు. రామం నిశ్చలంగా ప్రసన్నంగా వింటున్నాడు.

"మరి సుశీలక్కయ్యని అన్యాయం చెయ్యలేదా! ఆవిడ ఉసూరుమనదూ అంటావు నువ్వు" అని తిరిగి ప్రారంభించాడు శ్రీనివాసులు తన కథనం, నిజానికి రామం ఆ మాట అనడు. అది అన్యాయం ఎంత మాత్రం కాదని అతనికప్పుడే స్ఫురించింది. అయినా శ్రీనివాసులు చెప్పనే చెప్పాడు. "మా

సంసారం హాయిగా గడిచిపోయే కీలకం ఇదని అర్థంచేసికోగలిగింది సుశీల. అందులో పెద్ద ఔదార్యం, సహనశీలత ఉందనుకోకు. డబ్బు పెట్టుబడిపెట్టేవాడెవరైనా అడుగులకుమడుగులోత్తేరకం వాళ్ళ తరహా సూర్యం కూతురు కదా ! నిజానికి వాళ్ళ నాన్న మూలంగా నా ఆస్తి అంతా తగులబడిందని నా కంటె ఎక్కువ అదే ఏడ్చింది. భూమి అమ్మి "తెచ్చిన డబ్బు యిట్టే హరించుకుపోయింది. వరలక్ష్మి ఈ సంసారంలో ప్రవేశించకపోతే మేమూ మీ సూర్యం బాబాయి లానే ఉండేవాళ్ళం. ఇప్పడా సుశీలకు గాని పిల్లలకుగాని ఏకొరతా లేదు, ఇంటి బరువంతా వరలక్ష్మి చేతిమీదుగానే తొలగింపబడుతూంది.

మనలో మనమాట. ఆడదికదా అసూయపడకుండా ఉంటుందా అని అందరి అనుమానం– సుశీలను గురించి. అసంతృప్తి వలన అసూయ ఏర్పడుతుంది. సుశీలకలాంటి అసంతృప్తి లేదు. ఆవిడ స్త్రీత్వం పద్నాలుగేళ్ళ వయస్సునాటినుండీ సఫలమవుతూంది. వరలక్ష్మి ఈ ఇంటికి వచ్చేసరికి సుశీలకు నలుగురు పిల్లలు. ఇప్పుడు సుశీలకు తన పిల్లలు హాయిగా తిని తిరిగి బాగుపడటం కావాలి కాని అసూయతో అర్థాన్ని నెట్టి వేయడం కాదు. అందుకొక సుగమమైన మార్గం ఏర్పడిందని లోలోపల సుశీల ఎంతో సంతోషిస్తూంది.

ఈ స్వీయచరిత్ర నింత విప్పిచెబుతున్నాడేమిటి? ఇందులో తనుచేసిన ఘన కార్యమేమిటి? డబ్బున్న మనిషి దొరికింది వాడుకుంటున్నాడు అనుకుంటా వేమో! ఇందులో నాప్రయోజకత్వం ఉందని కాదు. రామం, ఒక అవకాశాన్ని ఎవ్వరినీ బాధపెట్టకుండా స్వార్థానికి వినియోగించుకున్నా గిలగిలలాడుతుంది లోకం. నన్ను తిట్టి నా గురించి దుష్ప్రచారంచేసే వాళ్ళందరి ఆంతర్యం నాకు తెలుసు. వాళ్ళకీ అలాంటి సదవకాశం రాలేదని వాళ్లేడుస్తున్నారని నాకే కాదు మీ సుశీలక్కయ్యకీ తెలుసు. నిజానికి ఆవిడకున్న పరిజ్ఞానమెంత? ఊళ్ళో అమ్మలక్క లందరు ఎక్కడ కనిపించినా మీ అక్కయ్యను తెగ ఓదార్చేస్తూంటారు. అంతగా వాళ్లు వాపోతూంటే "ఆగండి నా భర్త చెడ్డపని చెయ్యలేదు. ధీరుడు, వీరుడు" అని ఎలుగెత్తి చాటే శక్తి ఆవిడ సంస్కారంలో లేదు కాబట్టి వాళ్ళతో తానూ కలిసినట్టే "ఏదో లెండి ఇదొక కర్మ. ఈనాటి కాయన కలాంటి బుద్ధి పుట్టింది" అని నిట్టూరుస్తుంది. మళ్ళీ ఆవిడే యింటికొచ్చి "వెధవలు మనం బాగుంటే కళ్లల్లో నిప్పులు పోసుకుంటున్నారు" అంటుంది.

నేనొక లాటరీలో గెలిచాను. వాళ్ళంతా లాటరీ వేసి వేసి నష్టపోయారు. నా సమస్తమూ వరలక్ష్మి అదుపులోనే పెట్టాను. తెల్లవారి ఉప్పకో పప్పుకో అణాకో రూపాయకో ఈ నాలుగు కుటుంబాలలోని మనుష్యులు రాక మానరు, అది అప్పుకాదు. కేవలం ముష్టి. వాళ్లు తినే ప్రతి కానీ 'ఆవెవర్తెదో' అనే సంగతి వాళ్ళ కందరికీ తెలుసు. శ్రీనివాసులు తెచ్చుకున్న ఎవర్తె దగ్గరో వీళ్ళందరూ గడియగడియకీ చెయ్యి చాచుతారు. అలా జరగాలనే నా దగ్గర ఎప్పుడూ దమ్మిడీఉంచను. నేనూ మొన్న పుట్టిన నా పిల్లాడుతో సహా మేమందరం ఆమె పెంపుడు చిలకలం.

బహుశా నీకు ఆశ్చర్యంగా ఉందో లేక మరేమనుకుంటున్నావో. ఇదీ మా కథ" అని ఊరు కున్నాడు శ్రీనివాసులు

ఇంతకథ వర్ణించి చెప్పినా శ్రీనివాసులు ఎక్కడా ఉద్రేకపడలేదు. ప్రశాంతంగా హాయిగా ఎవరిదో కథ చెప్పినట్లు చెప్పేశాడు.

భూమిమీద జరిగే ప్రతి విషయంగురించీ తెలుసుకోవాలని తహతహ పడే కొందరు మరీ ఆసక్తి పరులైన విద్యార్థులుంటారు. అలాంటి విద్యార్థికి మాష్టారు ఒక కొత్తపాఠం చెప్పగానే చెప్పలేని ఆనందం కలుగుతుంది. "నేనేం ! ఇవ్వాళ ఎంచక్కటి పాఠం నేర్చుకున్నాను" అని కనిపించిన అందరితోనూ చెపుతాడు. సరిగ్గా ఆ పసివాడి ఆనందం లాంటిదే ఒక అనుభూతి రామానికి కలిగింది. అదీగాక రామానికి యింతవరకూ వ్యక్తులూ ప్రపంచం గురించి లోతుగా చెప్పినవారేలేరు. కుటుంబాల్లో జరిగే చిల్లర చిల్లర సంఘటనలేవైనా అతనికి కుతూహలం కలిగించి "ఏమిటదీ !" అని అడిగితే "నీకెందుకులే ఈ గొడవలన్నీ" అని కసిరేశారు అమ్మా నాన్నాను. ఉద్యోగంలోచేరి డబ్బు సంపాదించడానికీ, పెళ్ళిచేసికుని సంతానం ఉత్పత్తి చేయడానికీ, "ఇంకా చిన్నవాడివిటరా" అని తొందర చేయగలరు. లౌకిక జగత్తులోని తమాషాలను తెలుసుకోవాలంటే మాత్రం అందుకు "చిన్న వాడికి నీకెందుకు ?" అంటారు. అలాంటిది శ్రీనివాసులు తన కథనంతటినీ దాపరికం లేకుండా రామానికి చెప్పేసరికి తనకూ ఒక ఆధిక్యాన్నిచ్చినట్లు తననొక ఆత్మీయునిగా సంబోధించినట్లూ తోచింది రామానికి. విడని మొగ్గను మంచి వాతావరణంలో పెడితే విచ్చుకున్నట్లు నిన్నటిదాకా పుస్తకంలో విజ్ఞానం తప్ప మరొకటెరుగని రామారావుకి ఇవాళ ప్రపంచం గురించి ఎంతో తెలిసినట్లయింది.

ఆ అనుభూతితో అతను ఉక్కిరి బిక్కిరి అయ్యాడు. శ్రీనివాసులుమీద విపరీతమైన భక్తి భావం కలిగింది. అతనేమీ మాట్లాడలేకపోయాడు. "మళ్ళీ రేపు కనిపిస్తా, నేను వెడతాను బావా!" అని లేచాడు.

"కనబడడమేమిటి ? రేపు ఉదయంరా ! శేషగిరి దగ్గరకు వెళ్ళి సాయంత్రంలోగా ఉద్యోగం ఆర్డరే పట్టుకొద్దాం. ఇంక నుండి ఇక్కడున్న ఐదు కుటుంబాలకూ నువ్వొక ప్లస్ (+). త్వరలోనే వీళ్ళందరూ కలిసి నీకో చిన్నదానిని కట్టబెడతారు. 'ఇంకా నయం – ఇంతవరకు చదివించాను, ఇక ఉద్యోగం చెయ్యి.' అంటే చెయ్యబోతున్నావా లేదా. అలాగే 'పెళ్ళిచేసుకో' అని మీనాన్న అంటాడు. నువ్వు చేసుకుంటావు. ఈ శ్రేయో రాజ్యంలో స్కూలుఫైనలుగాడికి అరవైయో డెబ్బయ్యో కంటె ఎక్కువిచ్చే బుద్ధి ఎవడికీ లేదు, శుభం ! అదేమీ కాదనను. కాని రామం ! గతంలో నువ్వొక పొర పాటు చేశావు. ఇప్పుడు నువ్వు తలదూర్చబోయే గూడుకోసం స్కూలుఫైనలు ఫస్టుమార్కులో పాసవడం అనవసరం. స్కూలులోకల్లా మేధావి కుర్రాడు అనిపించుకోవడం అనవసరం. ఆ ఛాన్సు మరొక ఇంగ్లండో, అమెరికాయో పోయేవారికి వదిలేసెయ్యాలిసింది. పోనీలే గతం గతః. ఉద్యోగంలో చేరు. కాని వేంకటేశ్వర్లులా అయిదులూ పదులూ అడగకు. పెళ్ళిచేస్తే చేసేసుకో కాని సుబ్బారావులాంటి కాపురం చెయ్యొద్దు. సరే మీ సూర్యంబాబాయిలా ఎవరిమీదోపడి బతికేయడం మరీ ఘోరం. నీ అరవై రూపాయిలలో నువ్వెంత తింటావో రాబోయే నీ రాణీకెంత పెడతావో, ముందే వాటా వేసేసుకో. అలా బతకలేవూ ! శ్రీనివాసుల్లా చెడిపోయి బ్రతికేసే మార్గం చూసుకో. అంతే కాని వాళ్లందరిలా పవిత్రంగా చచ్చిపోకు.... పొద్దుట వస్తావుకదూ !" అంటూ సాగనంపాడు శ్రీనివాసులు రామాన్ని.

శ్రీనివాసులు చివరన చెప్పిన మాటలతో రామాని కిందాకటి ఉత్సాహం పొంగు తగ్గిపోయింది. ఒక్కసారిగా తనకేం కాబోతూందో తెలిసినట్లయింది. సూర్యం బాబాయి — చీకటియిల్లూ – ఆ పిల్లలూ కిందటేడు టైఫాయిడు పడి శల్యపంజరంలా తయారయిన ఐదేళ్ళ అమ్మాయి మరి కోలుకోక అలాగే వాడిపోయిన ఆ దైన్యస్థితే – గుర్తుకొచ్చాయి.

మొన్న భోజనాలప్పుడు కాబోలు పిన్నిగారు చెప్పుకొచ్చింది. ఆ అమ్మాయికి టైఫాయిడు వచ్చినప్పుడు నలభై ఎనిమిది రోజులు జ్వరం కాసిందట. ఎంతమంది డాక్టర్లను పిలిచారో ఎంత డబ్బు ఖర్చు పెట్టేరో ఆవిడ వర్ణించలేకపోయింది. ఆమధ్య తన చెల్లెలికీ వచ్చింది టైఫాయిడు. కొత్తగా వచ్చిన గొట్టాల మందు వాడేసరికి పది రోజులకి తగ్గిపోయింది.

లేమివల్ల ఆకుటుంబములో ఉన్న హీనస్థితి, దానిని కప్పిపుచ్చుకుంటూ వాళ్ళు బతికే నీచమైన బతుకూ–రామారావుకు భయంకరంగా తోచాయి. అతననుకుంటున్నాడు — లేమివల్ల అందరూ అలాగే తయారవుతారా? అయితే తను? తనగతేమిటి? నాన్న తనకు చూపించే అరవై రూపాయల ఉద్యోగంలో తానెన్నాళ్ళు నిండుగా బ్రతకగలడు? శ్రీనివాసులు చెప్పినట్లు వీళ్లంతా కలిసి తనకెవరినో కట్టబెడితే వద్దనగలడా! అసలు ఉండనే ఉంది మేనమామ కూతురు, వద్దనడానికి తనకి ధైర్యమెక్కడుంది? ఉద్యోగం చేస్తూ నాన్నమీద ఆధారపడడం ఎంత హీనం. శ్రీనివాసులు అన్నట్లు మహా యిస్తే అరవై యిస్తారు. దానితో సంసారం గడుస్తుందా? సూర్యం బాబాయి అంత హీనంగా కాకపోయినా డెభై రూపాయలు తెచ్చుకుంటున్న వెంకటేశ్వర్లు మాత్రం ఎలా బతుకుతున్నాడు? వాళ్ళలా తను సినిమాలకని డబ్బు దుబారా చెయ్యడు కాని ఇంటద్దె సంవత్సరాల కొద్దీ ఎగగొట్ట లేదు, ఎలక్ట్రిసిటీ బిల్లు కట్టకుండా ఉండలేడు. జీతం కాస్తా వాటికే అయిపోతే తను కూడా పకోడీలు తిని నీళ్ళు తాగి పడుకోవలసిందే. కాని లోకంలో ఎంతమంది అరవైలూ డెభైలూ వచ్చే జీతగాళ్ళు లేరు, వాళ్ళు బతకకేంచేస్తున్నారు? బతుకుతున్నారు. ఇలాగే కాబోలు, కొందరు బతకలేక చస్తున్నారు. కొందరు ఛస్తూ బతుకుతున్నారు. మరికొందరు ఇతరులను చంపి బతుకుతున్నారు. బతుకూ–చావూ–అప్పులూ–లంచాలూ–దగా–మోసం–అబద్ధం–ఏమిటిదంతా? ఇదే బతుకు, అమ్మో బతుకెంత భయంకరం!

మెరుపులూ ఉరుములూలా ప్రశ్నలూ జవాబులూ రామం బుర్రలో తుఫాను లేవదీస్తున్నాయి, ఆ వెలుగుచీకట్లమధ్య భవిష్యత్తునంతా ఒక పటం గీసి పెట్టుకుని అటువైపు చూడటానికే భయపడి పోతున్నాడు రామం. అతనిలో తీవ్రమైన సంచలనం భయం పదేళ్ళ అనుభవంలాంటి ఊహ ఒక్కసారిగా కలిగాయి.

రామం సూర్యంగారింటి గుమ్మం ఎక్కబోతూంటే సందుమలుపు తిరుగుతూ సుబ్బారావు కన్పించాడు. "రారా మాయింటికొకసారి రా ! అంటూ పిల్చుకెళ్ళాడు. రామానికేమీ యిష్టంలేక పోయినా తప్పలేదు. వాళ్ళున్న రెండు గదుల వాటాలో వీధి గదిలో తాతలనాటిదొక రోజ్ వుడ్ కుర్చీ, దానికి రెండు ప్రక్కల దంతపుసింహం బుర్రలూ, ఒక మూల ఒక నిలువుటద్దాల బీరువా, నేలమీదొక చిరిగిపోయిన ఖరీదైన తివాసీ ఉన్నాయి. గోడలనిండా రెండు వరసల ఫోటోలున్నాయి. ఇంకా కాళీ ఉన్నచోట రెండు మూడేళ్ళ నాటి కేలండర్లన్ని ఉన్నాయి. రాజకీయ నాయకులవీ, దేవుళ్ళవీ, కొన్ని సీనరీలవీ ఫోటోలు

సమపాళ్లలో ఉన్నాయా గదిలో. క్రిందటిసారి వచ్చినపుడు వీధరుగు మీదే  బాతాఖానీ వేసి వెళ్ళాడు రామం. అందుచేత గదిలోపలి పూర్వవైభవాన్ని పరిశీలించే అవకాశం లేకపోయింది.

"రా ! మా యిల్లు చూద్దువుగాని" అంటూ ఆ రెండోగదిలోనికికూడా తీసుకువెళ్లాడు రామాన్ని సుబ్బారావు. ఆ గదిలో ఆధునికమైన ఒక డ్రెస్సింగ్ టేబిలూ – అదీ రోజ్ వుడ్ దే – దానిమీద స్నోలు పౌడర్లు, సెంటు బుడ్లూ, అగరువత్తులకు వెండి ఏనుగులు ఉన్నాయి. మరొకపక్క ఒక పెద్ద పట్టెమంచం, గోడలకు ఎన్ లార్జి చేసిన సినిమా తారల ఫోటోలు ఉన్నాయి. మొత్తంమీద పాత కొత్తల మేలుకలయిక తో వెలిసిన పడకగది అది. రామానికి అందులోని యింపు సొంపుల గురించి తెలియదు కాని సుబ్బారావు జీవితం ఎంత ఖరీదైనదో కొంచెం అర్థం చేసికోడానికి ప్రయత్నించాడు. వంటిల్లు అనబడే చిన్నకొట్లో వంటచేస్తున్న చిన్నదానిని పిలిచి సుబ్బారావు "టిఫినూ కాఫీ యియ్యవే" అన్నాడు. ఆవిడ వయ్యారంగా ఒకసారి లోపలికి వెళ్ళి మళ్ళీ ఇవతల కొచ్చి ముసిముసి నవ్వులు నవ్వుతూ "ఇంత రాత్రవుతూంది భోజనం ముందు టిఫినూ కాఫీ యేమిటండి ! నిమ్మకాయ రసం తెస్తాను" అంటూ తెచ్చిచ్చింది. ఇంతా చేసి అప్పుడు సాయంత్రం ఆరు గంటలే అయింది, చేదూ తీపి పులుపు సమ్మిళిత మయిన ఆ పానీయం రామారావు గొంతు దిగలేక దిగలేక దిగింది.

"ఏరా రామం! సూర్యం బాబాయిగారింట్లో ఛీఫ్ గెస్ట్ గా వచ్చి దిగావు. మా యింట ఒక పూటైనా భోజనం చెయ్యనేలేదు. పోనీలేగాని సినిమాకైనా వెళదాం వస్తావా! పరీక్ష పాసయావు – పట్నం వచ్చావు. ఒక్క సినిమా యైనా చూడకపోతే ఏలాగరా!" అని కదిపాడు సుబ్బారావు.

ఆ క్షణాన ఏమనిపించిందో కాని రామానికి, అవును ఎందుకు వెళ్లకూడదూ! అసలే మనస్సంతా చికాకుగా ఉంది. అనుకుని "పద పోదాం" అనేశాడు. సుబ్బారావు ఎగిరి గంతేసినంత పనిచేసి "సీతా ! సీతా ! ఒక్క నిముషంలో రెడీ అవు! సినిమాకి వెళ్లాలి" అంటూ తొందర చేశాడు. ఆవిడ ఎప్పుడూ తయారుగా ఉంటుంది కనుక వెంటనే బయలుదేరారు.

తోవలో వెంకటేశ్వర్లు యింటిముందు నుంచి వస్తూ అతనినికూడా కేకవేశాడు సుబ్బారావు. "సినిమాకా ! నేనూ అదే అనుకుంటున్నాను" అంటూ బయలుదేరే డతను కూడా.

అందరూ కలిసి హాలుదగ్గరికి వెళ్ళాక అందరూ జేబుల్లో చేతులు పెట్టారు. సుబ్బారావు "అరే పర్సు మరిచి పోయానోయ్ టైమయిపోతూందనే తొందరలో వచ్చేశాను. వేంకటేశ్వర్లూ నువ్వు తీసుకో టిక్కట్లు" అన్నాడు. వెంకటేశ్వర్లు జేబులోనుండి ఒక్కరూపాయతీసి "ఇంతే ఉంది. నేను వీధిలోకి వచ్చేదాకా మనమంతా కలిసి బయలుదేరుతామని తెలీదు కదూ" అంటూ ఆ రూపాయి మళ్ళీ జేబులో పెట్టేశాడు. రామానికి పదిరూపాయలనోటు మార్చి అందరికీ టిక్కట్లు కొనక తప్పలేదు.

సినిమా అయిపోయే లోపున సోడావాడిని పిలిచారు, కిల్లీలవాడిని సిగరెట్ల వాడిని పిలిచారు. పకోడీలు కొనితింటూ సినిమా చూశారు, అన్నిటికీ రామం మార్చిన పదిరూపాయల నోటు సరిపోయింది. పకోడీలు తింటూ సీత కళ్ళమ్మట నీరు కార్చేసింది. "అదేమిటి సీతా, కారంగా ఉన్నాయా" కంగారుగా అడిగాడు సుబ్బారావు.

"లేదండీ! అబ్బ వాళ్ళ ఎడబాటు చూడలేకుండా ఉన్నానండీ" అన్నది చివరకి కథ సుఖాంతమయింది.

"అబ్బ ! ఎంత బావుందండీ ఆ హీరోయినూ" అంది సీత ఇంటికివస్తూ తోవలో – హీరోయిన్ మాటకేంగాని "పకోడీలు మంచివి అమ్ముతాడోయ్ సినిమాలో" అన్నాడు వెంకటేశ్వర్లు. తనయింటి వేపు వెళ్లిపోతూ సుబ్బారావు "థేంక్సు రామం, మంచిసినిమా చూపించావు" అన్నాడు.

రామారావుకి తలతిరిగిపోయింది. సినిమాలో ఏంజరిగిందో తనకి తెలియదు. జరిగిన తతంగంతో అతనికి నీరసమొచ్చింది, అతను పకోడీలు తినలేదు. సోడా తాగలేదు. ఆకలి వేస్తూంది. కాళ్ళీడ్చుకుంటూ యింటికి వచ్చేసరికి అందరూ నిద్రపోతున్నారు. అరగంట బాదితే కాని తలుపెవరూ తియ్య లేదు. "పిన్నిగారూ అప్పుడే పడుకున్నారా ! వాళ్ళంతా బలవంతంచేస్తే సినిమాకి వెళ్ళాను. మీకు యింత రాత్రయాక శ్రమ" అన్నాడు.

"శ్రమ కేముందిలే నాయనా తలుపు తియ్యడానికేం కష్టపడాలి" అందావిడ. "అది కాదు. ఇంత రాత్రయాక వడ్డించడం అదీ..."

"అదేమిటి? భోజనం చేయలేదూ! మాకిష్టుడు నువ్వు శ్రీనివాసులింట్లో ఉన్నావని చెప్పాడు. అక్కడే భోజనం చేస్తావనుకున్నాను. అయ్యో పిచ్చితండ్రీ ! ఇంత మజ్జిగైనా తాగు" అంటూ సగం కళాయిపోయిన గళాసుతో వేసవికాలపు మజ్జిగ తెచ్చిచ్చింది. రామం కళ్ళుమూసుకుని గడగడా తాగేసి ఉస్సురంటూ వీధరుగుమీద పక్క పడేసుకుని కడుపులో కాళ్ళు పెట్టుకుని పడుకున్నాడు.

మర్నాడు ఉదయం పదిగంటలయినప్పటినుండి రామంకోసం ఎదురుచూస్తున్నాడు శ్రీనివాసులు. ఇద్దరూ కలిసి శేషగిరి దగ్గరకు వెళ్లాలి. రామం ఒక అరగంట లేటుగా వచ్చాడు. రావడం రావడం ఒక్కడూ రాలేదు. పెట్టి పరుపుతోసహా వచ్చాడు. కళ్ళు లోతుకుపోయాయి. ముఖంపీక్కుపోయింది. ఒక్కరోజుకి జబ్బుచేసినట్టు తయారయాడు.

"అదేమిటిరా ఆ వాలకం !" అన్నాడు శ్రీనివాసులు.

"వళ్లు బాగులేదు బావా ! ఇంటికి వెళుతున్నాను మళ్ళీ వస్తాను" అన్నాడు.

"జ్వరం వచ్చిందా ఏమిటిరా ! ఇలా ఉండి నువ్వు ప్రయాణం ఏం చేస్తావు !"

"ఫరవాలేదు – ఇక్కడింక ఉండలేను – ఇంటకి వెళ్లిపోతాను." వరలక్ష్మి వచ్చింది.

"నేను వెళుతున్నానండీ అక్కయ్యగారూ" అన్నాడు రామారావు.

"వింటున్నా ! వళ్ళు బాగులేదుటకదూ" అని "ఎప్పుడూ ఇల్లువిడిచి లేడేమోనండీ బెంగపడి నట్టున్నాడు" అంది శ్రీనివాసులువైపు తిరిగి.

రామానికి ఆవిడతో ఏదైనా మాట్లాడాలనిపించింది. "ఇల్లు విడవడంవల్ల కాదక్కయ్యగారూ ఈ వూరు మనుష్యులను చూస్తేనే జబ్బుచేస్తుంది." అన్నాడు సాహసించి. వరలక్ష్మి "ఏమిటది" అన్నట్లు చూసింది శ్రీనివాసులు వైపు.

శ్రీనివాసులు ఏమీ పట్టించుకోనట్టే "అదా జబ్బు ! అయితే మన వాడు బాగుపడతాడులే. అయినా జబ్బు మనుష్యులకు దూరంగా ఉండడం రా అబ్బాయి!. నువ్వు చేయవలసినపని. వాళ్ళను చూసి నువ్వు జబ్బుపడితే ఎలా ? అన్నాడు.

"దూరంగా ఉండడానికే బావా ఈ ప్రయత్నం" అని "వెళతానక్కయ్యగారూ ! మళ్ళీ ఈ ఊరు వస్తే మీ యింట్లోనే నా మకాం. సుశీలక్కయ్యేది? చెప్పేసి వేళతాను టైమయింది" అన్నాడు రామం. అందరితో చెప్పడాలయేక రామం రిక్షా కదిలింది.

★ ★ ★ ★

"అదేమిటిరా! ఎవరు నూరిపోశారు నీకీ బుద్ధులు? ఇంకా ఏంచదువుతావురా! నీ తలకాయ!" అంటూ విరుచుకుపడ్డాడు రామచంద్రయ్య, రామారావు ఊరికి వెళ్ళివచ్చిన ఫలితంగా ఒక కొత్త నిశ్చయాన్ని వెలిబుచ్చేసరికి.

"ఎవ్వరూ ఏమీ నూరిపొయ్యలేదు నాన్నా! నాకు అప్పడే ఉద్యోగం చెయ్యాలని లేదు. నేను చదువుకుంటాను." అన్నాడు రామారావు మళ్ళీ ఆ వేమాటలు నొక్కిచెబుతూ, "నేను ఏ వయస్సులో మేష్టరీ మొదలు పెట్టానో తెలుసునా! అప్పుడే చెయ్యనంటున్నావు. ఏడాది దాటితే నీకు మైనారిటీ వెళుతుంది తెలుసునా! ఇంకా చిన్నవాడినను కుంటున్నావురా అబ్బాయి!"

"పోనీలెండీ! వాడు చిన్నవాడు కాక పెద్దవాడటండీ! అసలు చిన్నయినా పెద్దయినా వాడొక్క డే కదుటండీ మొగ కుర్రాడు? వాడి సరదాయే తీరనివ్వకూడదూ!'అంటూ సాగదీసింది రామం తల్లి పార్వతమ్మ.

"సరి! నువ్వుకూడా బయలుదేరావు వాడిని వెనకేసుకుని. చదువుచదువంటారు. ఇంకో పదేళ్ళు చదువులకు తగలబెట్టి దివాలా తీసేకంటె ఇప్పటి నుండీ తృణమో పణమో ఆర్జించుకోవటం మేలు కాదూ! అయినా ఎవరిని ఉద్ధరించడానికీ చదువులు !"

"డబ్బు ఖర్చుకు నాన్నగారు వెనుక తీస్తే నేనే ఎలాగో ఏర్పాటు చేసుకుని చదువుకుంటాను ఆయన 'ఊ' అంటే చాలు అంటున్నాడు వాడు" అంది పార్వతమ్మ.

"అలా కూడా అన్నాడు ! వీడికి పట్నం వెళ్లేక బుర్ర తిరిగిపోయింది, పోనీలే – ఏదో అఘోరించమను. ఎక్కడ చేరుతాడో చేరమను."

అక్కడే నిల్చుంటె యింకా తండ్రి ఏమంటాడో అని వీధిలోకి జారుకుంటూన్న రామానికి తండ్రి పార్వతమ్మతో అన్న చివరిమాటలు విన్పించాయి.

మునిమాపు వేళ చెఱువుగట్టమీద కూర్చుని ఆకాశం వంకా, పారిపోయే పక్షుల వంకా చూస్తూ రామం తన గురించే ఆలోచించుకుంటున్నాడు. అక్కడ లేని నాన్నతో ఏకాంతంగా ఏదో చెబుతున్నాడు. "నాన్నా నీకు ఏమని చెప్పాలో నాకు తెలియదు, కాని నేనెవర్నీ ఉద్ధరిద్దామనీ, ఏదో ఘనకార్యం చేద్దామనీ చదువుతాననడం లేదు. నువ్వన్నట్లు పట్నం వెళ్ళాక – బురదనీటి గుంటలో కప్పల్లా ఒకళ్ళ నొకళ్ళు కరుచుకుంటూ, కబళిస్తూ బతికే ఆ మనుష్యులు ఆ వాతావరణం చూచేసరికి నా తల తిరిగిపోయింది. చదివేసి పెద్ద ఉద్యోగాలు చేస్తాననే నమ్మకంలేదు. నేనెందుకు చదువుతానంటున్నాను!

జీవితంనుండి తప్పించుకుందుకు. ఆకాశంలో పక్షిలా వీలైనన్నాళ్ళు స్వేచ్ఛగా బ్రతకడానికి-నీకు తెలియదులే నాన్నా! అక్కడ ఉన్న అద్భుతశక్తులు శ్రీనివాసులు వరలక్ష్మీ వాళ్ళ కథ; సూర్యం బాబాయి, పిల్లల పోరు, టైఫాయిడు అస్థిపంజరం; సుబ్బారావు వెంకటేశ్వర్లు దగాలు డాబులు వీళ్ళే యివే నాకళ్ళు తెరిపించాయని నీకెలా చెప్పగలను? ఇప్పుడు తెరుచుకున్న కళ్ళతో మరొక్కసారి ప్రపంచాన్ని జాగ్రత్తగా పరిశీలించి నాస్థానం ఎక్కడో నేనేం చెయ్యాలో నిర్ణయించుకోవాలి. అందుకు వ్యవధికోసమే ఈ చదువు."

# ధనదాహము యుద్ధోన్మాదము

## - రంధి సోమరాజు

(విపంచి - 1965 ఏప్రిల్ సంచికనుంచి పునర్ముద్రితం)

ఒకటి నిజం ! భీమరాజు ఒకటోరకం తెలివైనవాడు. తెలివి వేరు, మంచితనం వేరు. ఇది అందరికీ తెలిసిన సత్యమే ! అయితే ఏది సత్యం... ఏది అసత్యం అన్న తర్జన భర్జన వుండనేవుంది. దాన్ని ఆధారం చేసుకొని, అసత్యాసత్యాలను లోలోతుగ త్రవ్వి త్రవ్వి సత్యాన్ని అసత్యంగాను, అసత్యాన్ని సత్యంగాను తారుమారు చేసి చూపడంలో భీమరాజుకు మరొకరు సాటివుండరు.

ఇదీ ఆయనగారి ఘనత ! ఈ ఘనతకాధారం ఆయన తెలివి. అయితే అతని తెలివినిబట్టి అతని ఘనత పెరిగిందో ఘనతను పురస్కరించుకొని తెలివి విజృంభించిందో అప్పుడప్పుడు అతనికీ అనుమానంగానే ఉంటుంది !

ఇంతకీ మనలో మనమాట అతని దగ్గర కుప్పలు తిప్పలుగా డబ్బు మూలుగుతోంది. కొందరికి తెలివితేటలు వల్ల డబ్బు లభిస్తుంది. మరికొందరికి డబ్బుతో తెలివితేటలు పుట్టుకొస్తాయి నిజానికి భీమరాజు ఈ రెండు తరగతులకూ చెందుతాడు. అతనికే ఆలోచన కలిగినా మొదట్లో విస్తృత మానవాభ్యుదయానికే ఉపయోగపడేట్లుంటుంది. ఆ తరువాత అది పిచ్చి మతవాదంలా, ఇజంలా, ఆంతరంగిక అగాతత్వంలా రూపాంతరం చెంది, దాని తాలూకు అభ్యుదయం అంతా అతనికి కావలసిన ధన రూపంగా అవతరించి అతన్ని వరిస్తుంది.

అతను కాలేజీలో చదివేటప్పుడు పాపం కొడుకెక్కడ డబ్బులేక అవస్థపడతాడో అని, అతని తండ్రి ఎంత పిల్చినా తరగని కల్పవృక్షం సిగరెట్ల లాంటి డబ్బుకట్టల్ని మనియార్డరు పెట్టెల్లో పెట్టి వారం వారం పంపేవాడు. చెక్కుల్లో కుక్కి ఆ డబ్బు పంపితే బ్యాంకుల చుట్టూ తిరుగుతూ కొడుకు తన అమూల్యమైన టైము పాడుచేసుకోవలసి వస్తుందని, కాస్త కమీషను హెచ్చయినా, డబ్బు మనియార్డరు రూపంలో పంపి తిరిగివచ్చిన ఆ యమ్.ఓ తాలూకు రశీదుమీది కుమారుని అందమైన "అభిమాన సంతకం" కళ్ళార చూసి, భగవంతుడు ప్రత్యక్షమైనట్లు ఆ కుమార భక్తుడు సంతసించేవాడు.

డబ్బు అందుకున్న భీమరాజు తిన్నగా ఆ డబ్బు బ్యాంకులో డిపాజిట్టు చేసి, డబ్బు లేని వాడిలా మొగాన్ని కత్తిరించి దాన్ని స్నేహితులముందు నిలబెట్టేవాడు. కత్తిరించబడ్డ ఆ మొగంలోంచి నెత్తురుకన్నా ముందు లేమి జారిపడేది. కాని ఆ మిత్రులకది కలిమిగానే కనిపించేది. ఈ దొంగ మిత్రులు ఎక్కడ పసిగడతారో అని పోష్టుమేన్ రాగానే అతన్నిచాటుగా తీసుకుని పోయి గుప్ చిప్ గా "సంతకం తాళం" చెవితో ఆ డబ్బు స్వాధీనం చేసుకొనేవాడు.

ఏదైనా ఒక దేశం తన జాతి నెత్తురులోని ప్రతి నెత్తురుబొట్టునూ నెత్తురు సిపాయికింద మార్చిందనుకోండి; ఆ నెత్తురుకు ఎప్పుడూ నెత్తురు త్రాగాలనే వుంటుంది. నెత్తురు తప్ప ఇంకొకటేమీ దానికి రుచించదు. అది దాని లక్షణం. దీనికి ఎవరేం చేస్తారు ? ఈ రక్త దాహాన్ని, అది దాచేసి అది మజ్జిగ కావాలన్నట్టు ఎప్పుడూ నోరు చాస్తూ వుంటుంది. పెద్దపులి వంకాయలు కోరినట్టుగా వుంటుంది దాని తత్వం. అలాగే ఈ డబ్బున్న బుజ్జి అబ్బాయికి కూడా పాపం ఎంతో ఎంతో ధనదాహం వుంది. ఈ ధనదాహము పట్టిన బాబులకూ ఆ నెత్తురు దాహం పట్టిన ఇజంలోని నగ్నసత్యానికి తేడా ఏమీ వుండదని మీకూ నాకూ తెలిసిపోతూనే వుంటుంది. అయితే ఏం.. ఈ సత్యం ఆ ఇద్దరికీ తెలియదు ఈ బుద్ధులు రెండూ మంచికి ఉపయోగించుకుంటే మంచిది కాని మిమ్మల్నీ నన్నూ తినెయ్యడానికుపయోగిస్తే ఏం మంచిది చెప్పండి ?

భీమరాజు స్నేహితుల కందరికీ అతని దగ్గర డబ్బుందని తెలుసు. ఆ విషయంలో అతని కాలిగోటికి కూడా పనికిరాం అన్న బానిస లక్షణం. వాళ్ళను ఆ డబ్బు బాజాకు లొంగి పోమని అతని చుట్టూ భజన చేయమని “ఇజాల ప్రేమికుల్లా” తమ సర్వస్వాన్నీ ఆ వీరభీముడికి అర్పించమని పురికొల్పుతోంది.

వీళ్ళతత్వం కనిపెట్టి “మన అందరి బాగుకీ ఓ మంచి పథకం” అన్నాడు భీమరాజు. ఏమిటన్నారు మిత్రులు. మన మెస్ మనమే నడుపుకుందాం అన్నాడు. చేరని వాళ్ళను దుయ్యబట్టాడు. చేరినవాళ్ళకు సహకారం లోని ఉపయోగ శతకాన్ని అచ్చువేయించి అమ్మాడు. మెస్ నడిపి, అందరి చేతుల్లోనూ మసిని మిగిల్చి మొగాలకు పులుముకో మన్నాడు. ఎలాగైనా వాళ్ళు భక్తులు కదా... వాళ్ళల్లో ఉన్న ఇద్దరు ముగ్గురు నాయకుల్లాంటి బుల్లిరాజులకు “సినిమా ఆదర్శం” వాళ్ళకే ఖర్చూ లేకుండా చూపించి; మరునాడు వాళ్ళచేత ఆ ఆదర్శాన్ని మిగిలిన వాళ్ళకు అమ్మించాడు. అదే ఆదర్శం అనుకున్న వారికదే దొరికింది !

ఇంతటి శక్తిమంతుడైన భీమరాజుగారి వివాహం గురించిన చిన్నకథ చెప్పుకోకుండా ఉండడం ఏమంత మంచిది కాదు.

ఊళ్ళో డబ్బు ఉన్న అమ్మాయి ఎవ్వరా అని చూశాడు. నిజానికి శక్తి ఉన్నవారికి గుణం, రూపం అక్కర్లేదు. యౌవ్వనమే కావాలి. అలాగే అలాగే డబ్బు కావలసిన వారికి డబ్బే కావాలి. ఆ అమ్మాయి ఇంతకు పూర్వం ఎవ్వరినో ప్రేమించిందని తెలుసుకున్నాడు. ఆమె చుట్టూ తిరిగాడు ఆమెమనసేమీ మనసుమార్చుకోనంది. భీమరాజుకు మనసంటే ఏమిటో అర్థం కాలేదు. జరగవలసింది క్రియ అనుకున్నాడు. ఎలాగ తెలుసు కున్నాడో ఆ చిన్నారి, తను ప్రేమించిన ప్రియుణ్ణి కొత్త తెలుగు సినిమాకు మొట్టమొదటి రోజున. మొట్ట మొదటి ఆటకు టిక్కెట్లు కొనమన్నదని తెలుసుకున్నాడు. సరే అనుకున్నాడు.

ఇహ ఆ “పిల్ల ప్రియుడు” అడ్వాన్సు బుకింగ్ లో అతికష్టం మీద టిక్కెట్లు తీసుకున్నాడు. టిక్కెట్లుంటే ఏ ఇక్కట్లూ రానట్లు తను పడ్డ శ్రమ అంతా ఆ అమ్మాయికి నివేదించాడు. వేళకాగానే సినిమా హాలువద్దకు ప్రియురాలిని తీసుకెళ్ళాడు. ఒక్కరూ లోపలికి పోకుండా వేలకొద్దీ జనం హాలు గేటు ముందు నిలబడి ఉన్నారు. అందరికీ విపరీతమైన నిరాశ కలిగేట్టుగా ఆ సినిమా హాలువాడు కొన్ని అనివార్య కారణాల వల్ల ఈ ఆట రద్దు చేయబడినది ఇప్పటి టిక్కెట్లు రెండవ ఆటకు చెల్లును అని ఓ బోర్డు పెట్టాడు. అంతా తిట్టుకుంటూ ఇళ్ళకు సాగిపోయారు.

మన భీమరాజు ప్రేమించిన “డబ్బు సుందరి” తన ప్రియుడితో, “నీతో ఎప్పుడు వచ్చినా ఇంతే“ అని విసుక్కుంది. ఇది ఆడవాళ్ళకు సహజమైన ధోరణి కావొచ్చు. కాని ఆ ప్రియుడికి ఆ ధోరణి అంతగా నచ్చలేదు.

“ఇంతమంది ఇళ్ళకు తిరిగి వెళ్ళిపోతూంటే నావల్లే జరిగినట్లు మాట్లాడుతావేం...” అన్నాడు.

కుర్రతనం కదూ అచ్చంగా అలాగే అన్నాడు. ఆమెకు మండింది. అతనికీ మండింది. వాళ్ళిద్దరికీ మనసుల్లో ఒకరిమీద ఒకరికి చల్లని ప్రేమ ఉండనేవుంది. కాని వాళ్ళలా పైకి మండిపోతూన్న సమయంలో ఇలాగే జరగాలనుకుంటూ భీమరాజు వాళ్ళను ఆపుజేసి.

"ఏం ఇళ్ళకు వెళ్ళిపోతున్నారు?" అన్నాడు కారణం ఆ అబ్బాయి చెప్పాడు. ఆ అమ్మాయి మొగం ధుమధుమలాడుతోంది. అది భీమరాజుకు ఘుమఘుమ పరిమళంలా ఉంది.

"అదేమిటి... మీరు వెనక్కి వెళ్ళడమేమిటి... నేను మీకా సినిమా చూపిస్తానురండి..." అన్నాడు.

ఆమె ఆశ్చర్యపోయింది. "అదెట్లా?" అంది.

"ఎలాగైతే మీకెందుకూ...!" అన్నాడు.

"మీరా బోర్డు చూడలేదు కాబోలు" అన్నాడు ఆ అమ్మాయి ప్రియుడు.

భీమరాజు నవ్వాడు. ఆ నవ్వు ఆ అబ్బాయి ప్రాణాలను అక్కడికక్కడే తీసి, మళ్ళీ ఎక్కడా కనబడకుండా పాతాళంలో పాతేసింది.

"నేను చూపిస్తానంటున్నాగా... మీరు వెనక్కి వెళ్తే నా ప్రాణం పోతుందండీ... ఆయన రాకపోతే పోనీలెండి..." అన్నాడు. ఆ అబ్బాయి అలాగే నిలబడి పోయాడు. ఆ అమ్మాయి భీమరాజుతో కదలిపోయింది. "ఇజాల్లోని పిచ్చిలాంటిదే" ఈ సినిమా పిచ్చి కూడాను. ఆమె భీమరాజును పరీక్షచేయాలన్నట్టుగా కదలినా భీమరాజు మీద ఎంతో నమ్మకం ఏర్పడినట్లే కనబడింది. భీమరాజు హాలులోనికి ఆమెను తీసుకెళ్ళాడు. "మీరంటే నాకెంత ప్రేమో మీకు తెలియదు. మీరూ నేనూ చూస్తూ వుండగా మరొకరెవ్వరూ ఈ సినిమా చూడగూడదని ఈ హాలు వాడికి ఈ ఆటకు వచ్చే డబ్బంతా ఇచ్చేసి ఈ ఆటను కొనేశాను. మిమ్మల్ని పొందగలిగాను" అన్నాడు అంతే... ఆమె తన తండ్రి గారి తాలూకు లక్షలు లక్షలు చేసే ఆస్థి అంతా ఈ చిన్ని "మేజిక్ లౌ" ప్రదర్శనతో కరిగించేసి అతని ఇంటికి ఆ ప్రవాహంతో పాటు తరలి వెళ్ళిపోయింది.

ఇలాంటివాని తెలివితేటలు చెప్పుకుంటే "తెలివి పురాణం" ఒకటి తయారైందన్న మాటే. ఏ క్షణానికాక్షణమే ఆయనగారి "మ్యూజియమ్ తెలివి" ఎక్కడికక్కడే అపురూప ప్రదర్శనలను ప్రదర్శిస్తుంది.

అతను చేస్తూన్న వ్యాపారంలో క్షణక్షణం ఎదురయ్యే కష్టాలను "డబ్బు అనే గెరిల్లా సైన్యాన్ని" వెదజల్లి నష్టం రాకుండా కాపాడుకుంటున్నాడు ఎక్కడ ఏ కాస్త ధన నిక్షేపం కనిపించినా, ధనం, ధనంలో కలసిపోవాలనే నినాదం ప్రసారం చేస్తూ, మనిషన్నవాడుంటే తన పార్టీవాడే అయివుండాలన్న ఉత్కృష్టమైన పట్టుదలలాంటి శక్తిని మూటగట్టుకుంటున్నాడు.

అతనికి లోకం కనిపించడం లేదు. అతనికి కనిపించే లోకం ఇతరులకు కనబడకుండా, మంచి బందోబస్తు చేసుకుంటున్నాడు. ఇది కనిపెట్టిన ఓ పిచ్చివాడు నీ అంతరాత్మ శిధిలమై పోతోంది దాన్ని కాపాడుకో అన్నాడు. ఆ పిచ్చివాడి పిచ్చి కుదిరేట్టు భీమరాజు అరచాడు. "నేను పొందుతూన్న సుఖం ఈ ప్రపంచంలో ఎవ్వరూ పొందలేరు. నా ఆత్మారామం బహు సుందరమైనది. దానికి పేర్లు పెట్టేవారు ఉత్త 'లేమి' బూర్జువాలు" అన్నాడు. అనేక యుద్ధముల ఆరితేరి క్రూరమైన ముఖవర్చస్సుతో వెలిగిపోయే ఏకపక్ష పార్టీ నియంతలా మాటాడకుండా సమస్తాన్నీ కబళించ జూస్తున్నాడు కాని అతని ఆత్మ నిజంగానే శిధిలమైపోతోంది. శాంతి అనే మందు అతని దగ్గరకు చేరినప్పుడు దాన్ని దూరంగా విసిరి పారేశాడు. ఇప్పుడు దాని దగ్గరకు పరుగెత్తడానికి చెప్పరానంత సిగ్గుగా ఉంది.

ఈ బాధ భరించలేక అతను ఓ మంచి పని చేయాలనుకున్నాడు. తన ధనాన్నంతా శక్తిగా మార్చేయాలనుకున్నాడు. ఆటల పోటీలు వ్యాయామపోటీలు పెట్టి వేలకొద్దీ బహుమానాలు పెట్టి దేశంలోని యువకులనందరినీ ఆకర్షించి వారికి పెద్ద పెద్ద మొత్తాలు బహుమతులుగా పంచాలనుకున్నాడు. ఇలా చేస్తే యువకులంతా వీరులౌతారు. దేశానికి తన శక్తిని ప్రసాదించి చనిపోవడం మంచిదనుకున్నాడు. అతనికి ఆ రాత్రి పెద్ద కలవచ్చింది. ఏ వీధిని చూసినా వ్యాయామ కళాశాలలే... అంతా వీరులను తయారు చేసే యోధులే... పోటీలు పెట్టి డబ్బు ఎరగా పారేస్తే మనుషులు ఎలా ఎగబడతారు అనుకున్నాడు. సైనికశక్తితో దేశాన్ని సుభిక్షం చేసేయగలం అనుకున్నట్లు, డబ్బుతో దేశాన్ని మార్చేయవచ్చు అనుకున్నాడు.

కాని నెల తిరక్కముందే ఆ వూళ్ళో గొప్ప ఆటలపోటీలు పెట్టి ప్రజలకు వినోదాన్ని, పార్టీ సూత్రాల ఆకర్షణల్ని అమ్మినట్లు అమ్మి డబ్బు చేసుకున్నాడు.

ఇలాంటి మేధావియైన ధనతంత్రజ్ఞుడైన భీమరాజు ఒక రోజున ఉన్నట్టుండి జబ్బుపడ్డాడు. డబ్బుతో మందులు కొనుక్కోవచ్చనుకున్నాడు. కాని డబ్బుకు ప్రాణాల్ని అమ్మే షాపు ఎక్కడా కనిపించలేదు.

డాక్టర్లు పెదవి విరుస్తున్నారు. డబ్బు తక్కువని పెదవి విరుస్తున్నారేమో అని,

"నా డబ్బంతా ఇచ్చేస్తాను నన్ను కాపాడండి" అన్నాడు. తన అభిమాన ధననినాదం అదొక విధమైన పార్టీ నినాదంలాంటిది. విడిచి పెట్టడానికి అతని మనసు ససేమీ ఒప్పుకోడంలేదు. అయినా అలా అన్నాడు. కాని ఏ డాక్టరు, ప్రాణాలను కొని తీసుకరాగలడు?

"మీరు అనవసరంగా ఆందోళన పడకండి. శాంతంగా ఉండండి" అన్నారు డాక్టర్లు.

భీమరాజు "శాంతి ప్రాణం పోస్తుందా?" అన్నాడు. డాక్టర్లకు ఏమి సమాధానం చెప్పాలో తోచలేదు.

"ఔను" అనాలనుకున్నారు "కాదు" అనాలనుకున్నారు.

అప్పుడెవరో ఒక ముసలాయన వచ్చి. "బాబూ నువ్వు చేసిన మంచి పని ఒకటి తలచుకో హాయిగా ప్రాణం పోతుంది" అన్నాడు.

భీమరాజు తను చేసిన మంచిపనులేమిటో గుర్తుకు తెచ్చుకోడానికి ప్రయత్నించాడు. "ఓ నేను కావలసినంతమంది గుమస్తాలను పోషించాను. వాళ్ళకు నేనే లోపం చేయలేదు" అన్నాడు. "ఓ... మా దేశంలో కూడు గుడ్డకే లోపం లేదు" అని ఎవ్వరో నియంత అన్నట్లు ఆ మాటలు ధ్వనించాయి.

"బాబూ వారు నీ చేతికింద బితుకు బితుకుమని బతికారు వారి గుండెల్లో ఏనాడూ ప్రాణం లేదు. ఉన్నదేదో వారి చేతుల్లోను కాళ్ళలోను ఉండేది" అన్నాడు ముసలివాడు.

భీమరాజుకు ఆయాసం అధికంగా ఉంది. "అయితే తాతగారు.. వారి ప్రాణాలను నేనే తినేశానంటారా?" అన్నాడు.

"ఔను బాబూ వారిలో నిజమైన ప్రాణం ఎప్పుడో చచ్చిపోయింది" అన్నాడు.

భీమరాజు మొగం వికృతమైపోయింది. ధనం యొక్క నికృష్టరూపం అతని మొగం మీద వ్రేలాడుతోంది.

"ఎందుకిలా జరిగింది తాతగారూ?" అన్నాడు అతని కనులలో నీళ్ళు కదలుతున్నాయి.

తాత మెల్లిగా అమృతం చిలుకుతూన్నట్లు "మంచిని మరచిపోయావు నాయనా!" అన్నాడు. ఈ మాట భీమరాజుకు వినబడింది. అప్పుడు పెద్దపెట్టున గాలి వీచింది. ధనదాహాన్ని, క్రౌర్యాన్ని ఈ లోకంలో ఉండకుండా తోలేస్తూన్నట్లు ఒక్కసారి ఉప్పెనగా గాలి విజృంభించింది. ఆ తాకిడికి ఆ ఇంటిలోని విద్యుద్దీపం కూడా ఆరిపోయింది!

అంతే...

# టులెట్

అంగర వెంకట శివ ప్రసాదరావు

(విపంచి - 1974 జూలై సంచికనుంచి పునర్ముద్రితం)

“రండి... ఈ గదే ఖాళీగుంది. మేడమీద కాబట్టి గాలి బాగానే వేస్తుంది బాత్రూమ్ పక్కనే వుంది. లెట్రిన్ కి మట్టుకు కిందకి వెళ్ళాలి. ఇదుగో... ఈ కిటికీ తీసుకుంటే వెలుతురు బాగా వస్తుంది ఇంటాయన విజయనగరంలో వుంటున్నారు... ఈ మధ్యే ఈ గది ఖాళీ అయింది” గది చూపిస్తూ అన్నాడు రామారావు.

“మరి మీరు....” సుబ్బారావు

“నేను కింద... అదుగో... ఈ కిటికీలోంచి కనిపిస్తోందే.. ఆ వాటాలో అద్దెకుంటున్నాను."

"అద్దె"

"ముప్పై అయిదు రూపాయలు. అంతకన్నా తక్కువకి యివ్వొద్దని యింటాయన చెప్పారు ఈ గది ఎవరికో ఒకరికి అద్దెకిచ్చేసి వెళిపోదామనుకున్నారు కానీ నిన్ననే అర్జంటుగా వాళ్ళ వూరినుండి కబురొస్తే నాకీ విషయం చెప్పేసి వెళ్ళిపోయారు. నెలకోసారి అద్దెలు వసూలు చేసుకోడానికి వస్తూ వుంటారు. మీకీ గది నచ్చినట్టేనా....?"

గది గోడలని పరిశీలిస్తున్న సుబ్బారావు రామారావు వేపు తిరిగి "ఎవరండీ ఈ రాంబాబు?" అన్నాడు.

"ఆఁ.... ఎవరో ... ఇంతకు ముందు వుండేవాళ్ళేండి భావకవి అనుకుంటాను... ఇంతకీ మీకీ గది నచ్చినట్టేనా..?." రామారావు.

"ఆఁ..." గది నాలుగు మూలలా పరీక్షిస్తూ అన్నాడు సుబ్బారావు.

"మీరు... వుద్యోగం చేస్తున్నారా ?"

"లేదండి... బి.కాం. చదువుతున్నాను మునుపుండేగది ఖాళీ చేసెయ్యమని యింటి వాళ్ళు అంటే.."

"బ్రహ్మచార్లకి గదులు దొరకడం కష్టమే...." వ్యగ్యంగా అన్నాడు రామారావు.

"వాళ్ళు చాలా మంచివాళ్ళండీ.. వాళ్ళ పెద్దమ్మాయి పురిటికొచ్చింది ఇల్లు చాలదనీ, గది ఖాళీ చెయ్యమన్నారు."

"మీ నాన్నగారు ఏం చేస్తున్నారు?" రామారావు.

"పల్లెటూళ్ళో మాకు భూములున్నాయి అవి చూసుకుంటున్నారు. "

రామారావు కిటికీ దగ్గర నిలబడి కిందకి చూస్తున్నాడు.

"ఇదుగోండి ఎడ్వాన్సు.... రేపు వుదయం వచ్చి దిగుతాను."

"ఓ అలాగే... కాని ఒక్క షరతు" నవ్వుతూ అన్నాడు రామారావు.

"రేపు మీరు మా ఆతిధ్యం స్వీకరించాలి...."

"మీకెందుకండీ శ్రమ. హోటల్లో భోంచేస్తాలెండి"

"అలాగంటే వీల్లేదు ఒక్కపూట మా యింట్లో భోంచేస్తే అరిగిపోతారా!?"

“అదేం కాదండీ...”

“మరేం కారణాలు చెప్పకండి. రేపు వుదయమే మీ సామాన్లు, తెచ్చేసుకోండి. పది గంటలకల్లా భోంచేసేయ్యెచ్చు. రేపైతే నేను వూళ్ళోనే వుంటాను.”

“మీరు...!?”

పెద్దగా నవ్వి.... “ఇంతకూ నేనేం చేస్తున్నానో చెప్పలేదుకదండీ. నేనూ... అఁ సబ్బులకంపెనీలో పన్చేస్తున్నాను... వూళ్ళో తిరిగి ఆర్డర్లు బుక్ చేస్తాను.” మళ్ళీ నవ్వాడు రామారావు.

★ ★ ★

“అరె! అప్పుడే వచ్చేశారే... పంక్చువాలిటీ గొప్పగా మేంటేన్ చేస్తారన్నమాట” నవ్వుతూ అన్నాడు రామారావు.

“మళ్ళీ తొమ్మిది దాటితే మంచిది కాదట...”

"భలేవారే, మీకు తిథులూ నక్షత్రాలూ కూడా తెలుసన్నమాట.”

"అబ్బే నాకవన్నీ తెలీవండి. పిన్నిగారు చెప్పారు అదే నేనింతకు ముందు అద్దెకుండే యింటావిడ చెప్పారు”

“ఆఁ పైకెళ్ళి మీ సామాన్లు సర్దేసుకోండి గది కడిగించేసాను నేనిప్పుడే పది నిముషాల్లో బైటకెళ్ళి వస్తాను” అంటూ గుమ్మందిగి వెళ్ళిపోయాడు రామారావు.

పంచె కట్టుకుని పొట్టి కోటు వేసుకున్న రామారావు నలభై ఏళ్ళు దాటకపోయినా దాటినట్లే కనిపిస్తాడు. అతను నవ్వినా నుదుటి మీద ముడతలు చెరిగిపోవు. ఎప్పుడూ ఏదో ఆలోచిస్తున్నట్లు కనిపిస్తాడు చార్మినార్ సిగరెట్లు చెయిన్ లా కాల్చడు. అప్పుడప్పుడు సిగరెట్టు కాల్చినా ఎప్పుడూ వేలికి చురకంటుకునే వరకూ కాలుస్తాడు.

సుబ్బారావు చదువుకోవాలనే సదుద్దేశంతోనే పట్నం వచ్చాడు. బి.కాం.లో చేరిన ఆర్నెల్లకి గది మారే పరిస్థితి ఏర్పడింది మెదడుకి మేత దొరికితే, తెగేవరకూ ఆలోచిస్తాడు సుబ్బారావు. డబ్బున్న ప్రతి వాడికీ వున్న అలవాట్లు అతన్లో లేవు “వాళ్ళ ఫాదర్ పంపించడేమోరా... పూర్ ఫెలో” అనుకుంటారు అతని “పర్స్” తెరిచి చూడని క్లాస్మేట్స్. అతని ఖాళీ పర్సంత ఖరీదు చెయ్యని “రోగ్స్” అతన్ని ఫూల్ చెయ్యాలని చూస్తారు! ఎన్నన్నా సుబ్బారావు పర్సిప్పి చూపెట్టలేదు నోట్లు మంచి నీళ్ళలా ఖర్చు పెట్టలేదు. “సుబ్బారావ్ ది గ్రేట్” అని యితన్నెవరూ అన్లేదు.

సామాన్లు సర్దుతున్న సుబ్బారావు మళ్ళీ ఆ గోడలవేపు చూశాడు అతని నిన్నటి ఆలోచన యింకా తెగలేదు.

ఎవరీ రాంబాబు పూర్ ఫేలో తనలో తనే అనుకున్నాడు సుబ్బారావు.

కిటికీ గూట్లో అద్దం, దువ్వెన, షేవింగ్ సెట్టు పెడుతూ "ఈ రాంబాబు గది ఖాళీ చేసి వెళ్ళిపోయాడని చెప్పారాయన. ఈ లోకం వదిలేసి పోలేదు కదా !" మళ్ళ తనలో తనే అనుకున్నాడు సుబ్బారావు.

“ఏవిఁటోయ్! ఇంకా సామాను సర్దుతూనే వున్నావా ! రా..రావోయ్ అవతల మా ఆవిడ వడ్డన పూర్తయిపోవచ్చింది.”

“ఇదుగో వచ్చేస్తున్నానండీ...” అతని వెనకే మేడమెట్లు దిగాడు సుబ్బారావు.

“జాగర్తోయ్... కాస్త తలవంచుకునిరా.. లేకపోతే చూరు తగిలి చురుక్కుమంటుంది” పెద్దగా నవ్వుతూ అన్నాడు రామారావు.

ఆవిడ వంటింట్లోకి తప్పుకుంది.

“ఇదుగోనోయ్... ఇది గది. అది వంటిల్లు. వంటిల్లంటే వంటమాత్రమే చేసుకునే యిల్లు. భోజనాలు అక్కడ లాభం లేదు. ఈ గదిలోనె భోజనాలు, పడకలు... అదే గెస్టు రూము... అన్నీ యిదే” మళ్ళీ నవ్వుతాడు.

“అంతేనండీ టౌన్లో యిల్లు దొరకడం కష్టమే...”

‘ఆఁ రావోయ్ కూర్చో వంట చల్లారిపోతుంది." తను కూర్చుంటూ అన్నాడు రామారావు.

“అదేంటోయ్ ఆ కలుపుకోడం సుబ్బరంగా భోంచేయాలి.. ఇదుగో ఇలా వచ్చి ఆ కూర యిలా వెయ్.”

ఆమె వచ్చింది అతనికి వడ్డన చేస్తూంది.

"నాకు చాల్లే ఆతనిక్కాస్త వేయ్"

ఆమె సుబ్బారావు వేపు వచ్చింది.

"అబ్బె వద్దండీ యిప్పటికే ఎక్కువైపోయింది." కంచానికి చేతులు అడ్డంగా పెట్టుకు అన్నాడు సుబ్బారావు.

అసహాయంగా నిలబడిపోయింది ఆమె.

"ఆఁ చెప్పడం మర్చిపోయాను, ఈయనే మన మేడమీద గదిలో దిగారు చదువుకుంటున్నారు" కూరా అన్నం కలుపుకుంటూ అన్నాడు రామారావు.

"నమస్తే..." అందాఁమనుకున్న సుబ్బారావు భోంచేస్తున్నట్లు జ్ఞాపకం వచ్చి ఆమె వేపు వోసారి చూశాడు. ఆమె కూడా అతనివేపోసారి చూసింది.

సుబ్బారావు తలవంచుకుని భోంచేస్తూ.. రామారావు అదృష్టవంతుడనుకున్నాడు.

మంచం మీద పడుకున్న బాబు లేచి ఏడుపు మొదలుపెట్టేడు.

"వాడే మా సుపుత్రుడు... ఇదుగో వీడు లేచాడు"

భోజనాలు పూర్తి చేసి చేతులు కడుక్కున్నారిద్దరూ...

"ఇలాగొచ్చి ఈ మంచం మీద కూర్చోవోయ్.." మంచం మధ్యలో మఠం వేసుకు కూర్చుని అన్నాడు రామారావు.

మంచం చివర్న కూర్చున్నాడు సుబ్బారావు.

‘సిగరెట్ కాలుస్తావేంటోయ్...?"

పక్క గూట్లోంచి చార్మినార్ పెట్టె తీసి అన్నాడు రామారావు

“అలవాటు లేదండీ....”

పెద్దగా నవ్వి... “అదేంటోయ్ కాలేజీలో చదువుతూ సిగరెట్ అలవాటు లేకపోవడమేంటి!”

మౌనంగా తలవంచుకుని మంచం పట్టెడమీద చూపుడు వేల్తో రాస్తున్నాడు సుబ్బారావు.

"ఇదిగో అగ్గిపెట్టె యిలా అందుకో" నోట్లో సిగరెట్టు పెట్టుకుని అన్నాడు రామారావు.

ఆమె వస్తుంది. అగ్గిపెట్టె తీసుకు వస్తుంది తనలో తనే అనుకుంటూ ఆమెని చూడాలనే కోర్కెతో తలెత్తాడు సుబ్బారావు.

ఆమె అగ్గిపెట్టె తెచ్చి రామారావుకిస్తూ, సుబ్బారావు వేపు బెరుగ్గా చూసింది.

చూపు కలవగానె తడబడి కళ్ళు దించేశాడు సుబ్బారావు. మళ్ళీ కళ్ళెత్తేసరికి ఆమె అక్కడ లేదు.

రామారావు సిగరెట్ వెలిగించుకుని, పుల్ల ఆర్పేస్తూ ఎప్పటివో తన చిన్నప్పటి కబుర్లు చెప్పడం మొదలుపెట్టాడు.

ఏదో విషయం చెప్పి నవ్వుతూ, అమ్మా అంటూ చేతిలో సిగరెట్ పీక కిందికి వదిలేసాడు.

కంగారుగా చూసాడు సుబ్బారావు

"ఏం లేదోయ్... వేలు చురుక్కుమంది అంతే..." నవ్వుతూ అన్నాడు రామారావు.

ఆర్పకుండా కిందపడేసిన సిగరెట్ పీక వేపే చూస్తున్నాడు సుబ్బారావు.

“నాన్నాలూ....” నవ్వుతూ తప్పటడుగులు వేసుకుంటూ వస్తున్న బాబు పిలిచాడు.

వీణ మీటినట్లనిపించింది ఆ గొంతు సుబ్బారావుకి. రామారావు గొంతులో నవ్వుతున్న జీర కనిపిస్తుంది. బహుశా బాబు తల్లిపోలికై ఉంటాడు. తనలో తనే అనుకున్నాడు సుబ్బారావు.

చేతులు చాచి బాబుని దగ్గరకు తీసుకున్నాడు రామారావు బాబు సుబ్బారావు వేపే చూస్తున్నాడు.

“కొత్త మావయ్య బాబూ” బాబు కళ్ళలోని సందేహాన్ని తీర్చాడు రామారావు.

"మరైతే... ఈ మావయ్య బిచకత్తులూ... బిళ్ళలూ యిత్తాడా...?"

"ఓ యిస్తాను బాబూ... మరి నా దగ్గరకొస్తేనే...." చేతులు జాపుతూ అన్నాడు సుబ్బారావు.

బాబుని పది నిముషాలు ఆడించి లేచాడు సుబ్బారావు. "మరి వస్తానండీ." బాబుని రామారావుకి అందిస్తూ అన్నాడు.

"అలాగేనోయ్..."

వంటిల్లు దాటుతూ రామారావు చూడకుండా తలతిప్పి చూశాడు సుబ్బారావు. ఆమె చేటలో బియ్యం ఏరుతోంది.

★ ★ ★

సుబ్బారావు మేడమీదకొచ్చి ఏదో నవల చదువుతూ కూర్చున్నాడు. నవల చదవడం ఆపి గోడవేపు చూశాడు.

"ఆమెకేగాని పెళ్ళవకుండా వుంటే ఆమెని తప్ప మరెవ్వరినీ పెళ్ళి చేసుకోను." — రాంబాబు...

అంతవరకూ ఈ రాంబాబు ఎవరు ? ఏమయ్యాడీ రాంబాబనే ఆలోచన్లు ఆగిపోయి, ఎవరీమె...? అన్న ప్రశ్న అతన్ని వేధిస్తోంది.

పుస్తకం మూసి టేబిల్ మీద పడేసాడు. క్యాంప్ కాట్ వేసుకొని పడుకున్నాడు. ఆ రోజాదివారం. ప్రతి ఆదివారం భోజనం చేసి, పడుకోవడం అలవాటు. కళ్ళు మూసుకున్నాడు. కాని నిద్ర రావడం లేదు.

ఎవరు.... ? రాంబాబుని అంతగా కదిలించిన ఆమె ఎవరు...? ఎంతగా కదిలిపోకపోతే గోడలమీద అంత పిచ్చిగా రాస్తాడు. ఆమె... ఆమె.... ఈమె కాదు కదా!

రాంబాబుని అంతలా కదిలించినది... రామారావు భార్య కాదు కదా.

ఛ.... తన ఆలోచనకి తనే తిట్టుకున్నాడు సుబ్బారావు.

"అయినా ఎందుక్కాకూడదు...!?"

మనసు గోలపెట్టింది ఒకళ్ళ గురించి తప్పుగా అంచనావేయడం.. సుబ్బారావు ఆలోచించడం ఆపేసి గట్టిగా కళ్ళు మూసుకున్నాడు. అయినా చాలా చికాగ్గా వుంది.

లేచి గోడమీద ఆ పిచ్చి పిచ్చి రాతలు చెరిపేద్దామనుకున్నాడు కాని అతని మనసొప్పలేదు.

ఆమె... ఈమె... ఒకరే...

రాంబాబు పేరు చెరిపేసి తన పేరు రాసేసుకుందా మనుకున్నాడు సుబ్బారావు.

కాని రాయలేదు ఆ రాతలు చెరపలేదు.

★ ★ ★

మర్నాడు వుదయం షేవ్ చేసుకుందామని కిటికీ దగ్గర కొచ్చిన సుబ్బారావు చూపు అప్రయత్నంగా రామారావింటి వేపు పోయింది.

ఆమె అప్పుడే బాత్రూమ్ లోంచి యింట్లోకి వెళుతోంది.

సుబ్బారావుకి పిచ్చెక్కినట్లయింది. షేవ్ చేసుకుంటున్నా ఆమె మళ్ళీ పైకి వస్తుందేమోనని చూసాడు. గెడ్డం వొకటి రెండు చోట్ల తెగింది. స్నానం చేసి కాలేజీకి వెళిపోయాడు.

సాయంత్రం కాలేజీనించి వస్తూ బిస్కట్లు. చాక్లెట్లు పట్టుకొచ్చాడు. మేడమీదకెళ్ళి గది తాళం తీసేసరికి బాబు మెట్లెక్కి 'మావయ్యా.. మావయ్యా..' అంటూ పైకొచ్చాడు.

బాబుని ఎత్తుకున్నాడు సుబ్బారావు బిస్కట్లు కావాలని బాబు గోలపెడుతున్నాడు.

"నీకు బిస్కట్లు కావాలా...?"

"ఊఁ ఇయ్యి మావయ్యా !"

"మరైతే నన్ను 'మావయ్య' అని పిలవకూడదు"

"ఊఁ మావయ్యనే పిలుత్తాను. నాకు బిచకత్తులు కావాలి."

"అలాగైతే యివ్వను... నన్ను 'బాబాయ్' అని పిలుస్తేనే యిస్తా."

"ఊ నే పిలవను. నాకు మావయ్యంటేనే యిష్టం!

"బాబాయ్ అని పిలుస్తేనే బిస్కట్లు, చాక్లెట్లు బోల్డు బొమ్మలు కూడా ఇస్తా..."

"మలైతే నాకు యిమానం కొనిపెడతావా.."

"ఓ తప్పకుండా మరి 'బాబాయ్' అని పిలుస్తావా.

'ఓ' నవ్వుతూ అన్నాడు బాబు.

బాబుకి చాక్లెట్లు, బిస్కట్లు యిచ్చాడు సుబ్బారావు బాబు కిందకి వెళ్ళిపోయాడు.

సుబ్బారావు కిటికీ దగ్గర నిలబడ్డాడు అప్పుడే చీకటి పడింది. గదిలో లైటు వెయ్యలేదు ఆమె వాళ్ళింటి గుమ్మందగ్గర నిలబడింది.

బాబు చేతిలో బిస్కట్లు, బిళ్ళలూ చూసి తప్పన్నట్లు ముక్కు మీద వేలేసుకుంది. బాబు మారాం చేస్తూ చేతులు వెనక్కి పెట్టాడు వాడి రెక్క పుచ్చుకుని ఆమె లోపలికి లాక్కెళ్ళింది.

★ ★ ★

సుబ్బారావు ఆ యింట్లో దిగి అప్పటికే వారం రోజులైంది రోజూ సాయంత్రం పూట బాబు మేడమీదికి వచ్చి ముద్దు ముద్దుగా కబుర్లు చెప్తూ చక్రాల్లాంటి కళ్ళు గుండ్రంగా తిప్పుతాడు సుబ్బారావు బిస్కట్లు చాక్లెట్లు యిస్తే బాబక్కడే తినేస్తాడు కిందకి పట్టికెళితే అమ్మ తంతుందంటాడు.

సాయంత్రం సుబ్బారావు యింటికి రాగానే బాబు మేడమీదకు వచ్చాడు బాబు చేతిలో ఏదో కాయితం ఉంది. బాబు కాయితం యిస్తూ 'అమ్మ యిమ్మంది' అన్నాడు. సుబ్బారావు కాయితం విప్పి చదివాడు.

"వారు రెండు రోజుల క్రితం క్యాంపుకి వెళ్ళారు. పది రూపాయలుంటే ఈ కాయితంలోనే కట్టి బాబు చేతికిచ్చి పంపండి."

అడుగున సంతకంగానీ, పైన సుబ్బారావు పేరుగానీ, లేవు.

సుబ్బారావు ఆలోచించకుండానే పది రూపాయలనోటు ఆ కాయితంలోనే పెట్టి బాబుకిచ్చాడు.

రామారావు క్యాంపుకెళ్ళాడట. అవసరానికి పది రూపాయలడిగింది ఎక్కడా ఆహ్వానం లేదు.

బహుశా అదే ఆహ్వానమేమో... ఇవాళ రాత్రి వెళితే... కొంపతీసి రామారావు వచ్చేస్తే.

ఎటూ నిర్ణయంచుకోలేక గదిలో పచార్లు చేస్తున్నాడు సుబ్బారావు.

మరోసారి ఆమె వుత్తరం రాస్తే వెళ్ళవచ్చన్న నిశ్చయానికి వచ్చాడు సుబ్బారావు.

మరో పది రోజులు పోయాక మళ్ళా ఆమె బాబు చేత వుత్తరం పంపింది.

ఈ మధ్య రామారావు వూరినుండి వచ్చి మళ్ళీ వెళ్ళినట్లుంది.

సుబ్బారావులోని 'డబ్బు జాగ్రత్త మనిషి' పైకి లేచాడు. అనవసరంగా డబ్బు ఖర్చుపెట్టొద్దని హెచ్చరించాడు.

సుబ్బారావు లక్ష్య పెట్టలేదు ఉత్తరంలో మరో కొత్తవాక్యం అతన్ని వుత్సాహ పరిచింది.

"వారు మరో రెండు రోజుల్దాకా రారు..."

దీన్లో అర్ధమేంటి...? సుబ్బారావు ఆలోచిస్తున్నాడు.

వాచీ చూసుకున్నాడు పదైంది.

వద్దు... వెళ్ళు.. వద్దు... వెళ్ళు.. వద్దు... వెళ్ళు.. సుబ్బారావు వెళ్ళు లెక్క పెటడం మానేసి మెట్లు దిగాడు.

రామారావు ఇంటి తలుపు వేసుంది ఓరగా తీసుందేమోనని తోశాడు రాలేదు. గొళ్ళెం కొడితే..

ఛ... తప్పేమో ! అనుకున్నాడు సుబ్బారావు.

అవతల తలుపు తెరుస్తున్న చప్పుడు. సుబ్బారావుకి భయమేసింది. వెనక్కి తిరిగి పారిపోతేనో..

తలుపు తెరుచుకుంది ఎదురుగా ఆమె... కాదు... అమెకాదు, అతను. రామారావు... కోపంగా లేదు... నవ్వుతున్నాడు ఆ నవ్వులో ఎగతాళి.

సుబ్బారావు వెనక్కి పడిపోతానేమో అనుకున్నాడు. నిలదొక్కుకున్నాడు.

"ఏవిఁటోయ్... ఈ వేళప్పుడు వచ్చావ్...?" యింకా రామారావు మొహం మీద నవ్వు చెరగలేదు.

"అబ్బే... ఏం లేదండీ.. తల నొప్పిగా వుంటేనూ... మీ దగ్గర అమృతాంజనం గానీ ఉందా."

"అంతేనుటోయ్ తలనొప్పేగా.. జ్వరమొచ్చినట్లు బెంబేలు పడిపోతావేంటోయ్ వుండు యిస్తా."

అమృతాంజనం సీసా అందుకుంటున్న సుబ్బారావుకి రామారావు భుజంమీదుగా ఆమె మొహం కనిపించింది.

కొంపదీసి ఆమెగానీ దొరికిపోలేదుకదా! మనసులోనె అనుకుంటూ మేడ మెట్లెక్కాడు సుబ్బారావు.

ఆ రాత్రి సుబ్బారావు నిద్దరపోలేదు అమృతాంజనం రాసుకోలేదు. జుత్తు పీక్కున్నాడు గోడమీద అక్షరాలు రాక్షసుల తలకాయల్లా కనిపించాయి.

'రాంబాబు' తన గుండెల్లో రక్తాన్ని 'స్ట్రా'తో పీల్చేస్తున్నట్లనిపించింది సుబ్బారావుకి.

ఛీ పాడు బుద్ధి నాల్గోసారి అనుకున్నాడు.

ఆమెని రామారావు తంతున్నాడేమో రేపు వుదయం ఆమె శవం నూతిలో తేలుతుందేమో..

సుబ్బారావుకి పారిపోవాలనిపించింది. దుప్పటి మొహం నిండా కప్పుకుని పడుకున్నాడు క్యాంపు కాట్ కదిల్తే 'కిర్రు' మంటోంది. కిర్రుమన్నప్పుడల్లా తుళ్ళి పడుతున్నాడు సుబ్బారావు.

రాత్రి రెండు గంటలక్కామోసు నిద్రపోయాడు. బాగా తెల్లవారాక నిద్ర లేచాడు మేడదిగి కిందకి రావడానికి భయమేసింది సుబ్బారావుకి. ఆ రోజంతా పస్తు పడుకున్నాడు. బాబు కూడా మేడమీదకు రాలేదు.

రాత్రి చీకటి పడ్డాక బైటకెళ్ళాడు ఆకలి దంచేస్తుంటే, నాల్రోజుల వరకూ సుబ్బారావు పగలు పూర్తిగా గదిలో వుండడం మానుకున్నాడు ఆ తరవాత మామూలుగా తిరుగుతున్నాడు.

ఒకరోజు రాత్రి సెకండ్ షోకి వెళ్దామని బైల్దేరాడు. గుమ్మం దిగుతుంటే రామారావింట్లోంచి సన్నగా ఏడుపు వినిపిస్తోంది.

తనకెందుకులే... అనుకుంటూనే ఆగిపోయాడు సుబ్బారావు.

ఆమె ఏడుస్తోంది తలుపు సందులోంచి గదిలో దీపం వెలుతురు బైటపడుతోంది.

ఆమె ఏడుస్తూ మధ్య మధ్య మెల్లగా మాట్లాడుతోంది. శ్రుతులు కుదరని వీణ మ్రోగినట్లు అనిపిస్తోంది. మాటలర్ధమవటం లేదు సుబ్బారావుకి.

సుబ్బారావు గుమ్మానికి దగ్గరగా వచ్చాడు. అతని గుండెలు దడదడ కొట్టుకున్నాయి. తలుపు సందులోంచి చూసాడు. ఆమె కనిపించటం లేదు రామారావు వీపు కనిపిస్తోంది.

"రాయ్..." రామారావు గొంతులో మునుపుండే జీరే.

"వద్దండీ..." ఆమె ఏడుస్తోంది.

"నీ ఏడుపు కట్టిపెట్టి ముందు రాయ్..." రామారావు చెయ్యెత్తాడు.

"ఏమైనా నేను రాయనండీ..." ఆమె పెన్ను విసిరేసింది.

"రాయవూఁ.... రాయకపోతే డబ్బెలాగొస్తుందే... నీ బాబు పంపిస్తాడనుకున్నావా?" ఎడం చేత్తో ఆమె జుత్తు పట్టుకుని, కుడిచేత్తో తంతున్నాడు.

ఆమె 'లబో దిబో' మని ఏడుస్తోంది.

సుబ్బారావుకి షాక్ తగిలినట్లనిపించింది. గబగబా మేడమీదకి వెళ్ళిపోయాడు.

ఏం చెయ్యాలో అర్ధం కావటం లేదు సుబ్బారావుకి. అసలెందుకు రామారావిలా చేస్తున్నాడు...!

రామారావుకి వుద్యోగం లేదా... !

ఆమె కాదా ఈ వుత్తరాలు రాసేది.

కిటికీ లోంచి చల్లటిగాలి వీచింది. నిప్పుల సెగలా అనిపించింది భళ్ళున కిటికీ తలుపులు వేసేసాడు సుబ్బారావు.

నిద్దర రావటం లేదు. గది తలుపులు కూడా వేసేశాడు. ముసుగు తన్ని పడుకున్నాడు. ఆలోచన్లు ముసురుతున్నాయి. సుబ్బారావు ఈ గదికొచ్చి క్లాసు పుస్తకం ఒక్క మారు కూడా తీయలేదు.

తెల్లవారిపోయింది సుబ్బారావు అద్దం చూసుకున్నాడు. కళ్ళెర్రగా వున్నాయి గబగబా సామానంతా సర్దేసాడు గదికి తాళం వేయబోతూ ఏదో జ్ఞాపకం వచ్చి మళ్ళీ గదిలోకెళ్ళాడు.

మనిషి పుఱ్ఱెల్లా వికృతంగా నవ్వుతూ కనిపించాయి గోడమీద అక్షరాలు అంతకంతకీ పెద్దవైపోతున్నట్లనిపించాయి గది గోడలంతేసి అయిపోతాయేమో అని భయపడ్డాడు సుబ్బారావు.

కిందపడేసిన బ్లేడుతో సున్నం గీసేసాడు రాంబాబు పిచ్చిగా రాసుకున్న రాతలు చెరిగిపోయాయి బ్లేడక్కడే పడేసి పైకొచ్చేసాడు సుబ్బారావు.

రామారావింటి తలుపులు తీసే వున్నాయి గుమ్మంలోనే నవ్వుతూ ఎదురయ్యాడు రామారావు.

“ఏవిఁటోయ్... వూరికెళుతున్నావా...?”

‘అవునండీ.. మా నాన్నగారికి వొంట్లో బాగోలేదట. ఇదిగోనండీ అద్దె ఇవిగో తాళాలు గది ఖాళీ చేసేస్తున్నాను’ సుబ్బారావు.

"గది ఖాళీ చేసెయ్యడవేం.. ? మళ్ళీ రావేంటోయ్..". నవ్వుతూనే అన్నాడు రామారావు.

“లేదండీ... యింత త్వరగా రాలేకపోవచ్చును.” తలవంచుకునే అన్నాడు సుబ్బారావు.

ఆమె వంటింటి కిటికీలోంచి చూస్తుందని సుబ్బారావుకి తెలుసు. ధైర్యంగా ఆమె కళ్ళల్లోకి కళ్ళు పెట్టి చూడలేకపోయాడు.

సుబ్బారావు సామాను పట్టించుకు వెళ్ళిపోయాడు. సుబ్బారావెక్కడికి వెళ్ళాడన్నది అనవసరం. ఆ తరవాతేం జరిగిందన్నదే అవసరం.

★ ★ ★

“రండి... ఈ గదే ఖాళీగుంది. మేడమీద కాబట్టి గాలి బాగానే వేస్తుంది బాత్రూమ్ పక్కనే వుంది. లెట్రిన్ కి మట్టుకు కిందకి వెళ్ళాలి. ఇదుగో... ఈ కిటికీ తీసుకుంటే వెలుతురు బాగా వస్తుంది ఇంటాయన విజయనగరంలో వుంటున్నారు... ఈ మధ్యే ఈ గది ఖాళీ అయింది” గది చూపిస్తూ అన్నాడు రామారావు.

గది గోడలని పరిశీలిస్తున్న ఆ వ్యక్తి రామారావు వేపు తిరిగి ‘ఎవరండీ ఈ రాంబాబు’ అన్నాడు.

‘ఆఁ... ఎవరో... ఇంతకు ముందు వుండేవాళ్ళెండి భావకవి అనుకుంటాను... ఇంతకీ మీకీ గది నచ్చినట్టేనా...?" అన్నాడు రామారావు.

# గ్రహబలం

## టి.వి.శంకరం

### (యువ - 1963 జనవరి సంచికనుంచి పునర్ముద్రితం)




“అయిపోయింది. అయిపోయింది ! అంతా అయిపోయింది ! ఈదెబ్బతోటి అందరి కష్టాలు గట్టెక్కుతాయి.” అన్నాడు సీతప్ప వసారాలో చెప్పులు విడుస్తూనే.

రావమ్మగారు చాకలికి వేసేబట్టలు మూటగట్టబోతూ, ఒకటి రెండు బట్టలకు చినుగులుంటే కుట్టుతున్నది. సీతప్ప వచ్చినట్టూ, ఏదో అన్నట్టూ గ్రహించింది గాని ఏవన్నదీ వినలేదు. అదేదో తరువాత నింపాదిగా అడిగి తెలుసుకోవచ్చు–ముందు తానాయనకి చెప్పాలిసిన కబురొౌహటున్నది.

ఆవిడలేచి భర్తకి ఎదురొచ్చి, “విన్నారా?” అన్నది ఉపోద్ఘాతంగా. ఉపోద్ఘాతం మటుకే చదివి పుస్తకమంతా చదివాననుకుని రివ్యూ రాసేసే విమర్శకుడిలాగా సీతప్ప, “యెందుకు వినవే పిచ్చిదానా? అంతా విన్నా !” అన్నాడు. కాని ఆయన మొహాన ఆనందరేఖల్లేవు.

“ఆఫీసుక్కూడా ఉత్తరమ్మొక్కొచ్చిందాయేమిటి?” అన్నది రావమ్మ.

“నాకు రాలేదనుకో. మా ఆఫీసులో ఇద్దరి కొచ్చాయుత్తరాలు! రవణాశ్రమం నుంచి !” అంటూ కోటువిప్పి వొంకీకి తగిలించాడు సీతప్ప.

ఆయననేది రావమ్మ కొక్కముక్క బోధపళ్లేదు. “మీరనేదేవిటో నాకొక్క ముక్క బోధపళ్లేదు,” అన్నదావిడ. “రవణాశ్రవవేవిటి? ఉత్తరాలేవిటి?”

“ఎవరికీ పట్టనట్టూరుకున్నారాయిరందరూ!. ఆరవణాశ్రమం వాళ్లే లోకహితం కోరేవారు గనుక, ఏవగ్రోయ్, కొంపలంటుగుంటున్నాయి. జాగ్రత్తపడి ప్రాణాలు రక్షించుకోండవటాని ఎరిగున్నవారందరికీ పోష్టు ఖర్చులు భరించి రాస్తున్నారు! కరపత్రాలు పంపుతున్నారు! అంతకంటే వాళ్లుమాత్ర వేం చేయగల్రూ?” అన్నాడు సీతప్ప చొక్కా కూడా విప్పి జంఝుం దువ్వుకుంటూ.

రావమ్మకు జ్ఞానోదయమయింది.

“నేనొక విషయం మాట్లాడుతుంటే మీరు మరోటి మాట్లాడుతున్నార్లావుంది. మనకోడలి ప్రసవం గురించి నే మాట్లాడుతూంట!” అన్నదావిడ.

“ఏవిటేవిటీ? ఇంతసేపాయి చెప్పవేం? ఏం పిల్లవాడు పుట్టాట్ట?” అన్నాడు సీతప్ప. మిగతా విషయాలన్నీ మరిచిపోయి తాను తాత అయిన సంబరంలో మునిగితేలుతూ.

“నేనింతసేపూ ఆ మాటే చెబుతూంట. సుక్రారం నాడు – అంటే సరీహా వారం దాటి రెండు”

"కనేరోజులేనూ ! మనం మరిచే పోయాంగానీ ! పేరెట్టడం దగ్గిరే అసలు పేచీ. చంటాడికి నా పేరే పెట్టడం వోపద్ధతనుకో. అయితే కొందరికి పట్టింపు – తాత బతికుండగా అదే పేరు పెట్టారాదనీ! ఏవిటో వెఱ్రిపట్టింపులు! అదలా వుంచి మన యింటి దేవుడు శ్రీరామచంద్రమూర్తివారున్నారు. అవతల యేదు కొండలవాడుండనే వున్నాడాయిరి. ఏవన్నా తక్కువ దేవుడు గనుకనా! అబ్బో, చెప్పనలవిగాని మహత్తుమరి! _" అని సీతప్ప సోదిలోపడ్డాడు.

"మీరింకా పెరత్తారినే వున్నారు అబ్బికి"

"అయితే యేడుకొండల వాడితో అట్టే పేచీ లేదు. ముందు వెంకట అని చేర్చేస్తే అతడికి తృప్తేనూ. మాటవరసకి వెంకట శ్రీరామచంద్రమూర్తి అని పెట్టావనుకో, ఇద్దరి దేవుళ్లూ సమాధానపడి పోతారు, అంతగా అయితే వెంకట శ్రీ సీతారామచంద్రమూర్తి అంటే నా పేరు కలిసొచ్చినట్టే అవుతుంది !"

"అబ్బికి ఆడపిల్ల !" అంది రావమ్మ సందు చూసుకుని.

"ఆడ _!" సీతప్ప తెరిచిన నోరు మూయలేదు. ఆయన కట్టుకున్న ఏ గాలి యిళ్లో కుప్పన కూలిపోయాయి.

"ఎప్పుట్లా?"

"మెదటి సంతానం ఆడపిల్లవడం అదృష్టం. లక్ష్మి పుట్టింది." అన్నది రావమ్మ.

"లక్ష్మి – అప్పుడే బారసాలా, నామకరణవూ అంతా చేసేశారేవిటి?" అన్నాడు.

"అబ్బే! కానుపొచ్చి ఆ కిందటి సుక్రారవే గదూ. నిన్నటికి వారం! బారసాలా గట్రా ఎల్లుండో ఆ మర్నాడో చేస్తారు."

"అన్నట్టు నీకిదంతా ఎవరు చెప్పేరూ?" అన్నాడు సీతప్ప.

"అబ్బి ఉత్తరం రాశాడు. ఇస్తానుండండి."

సీతప్ప ఉత్తరం చూసుకుని సంగతులన్నీ గ్రహించుకున్నాడు. తొమ్మిదో తారీఖు రాత్రి పదిగంటల నలభై రెండు నిమిషాలకి సీతారత్నం ఆడపిల్లను కన్నది. దుష్టనక్షత్రం కావటం చేత పెద్ద పెట్టున శాంతీ, నవగ్రహ పూజా వగైరాలు చేయించాలి. నాలుగైదొందలు ఖర్చుంటుంది గనక సీతప్ప డబ్బు సేకరించి ఉత్తరం అందిన మూడోనాడు బయలుదేరి రావలెను. ఇంతే సంగతులు.

నాలుగైదొందలే ? ఎక్కడి డబ్బూ హరించి పోతోందిగద!

"అసలే ఆడపిల్ల. ఆపైన వచ్చే శాంతటా! ఖర్చులు మనం భరించాలట! ఎక్కడైనాకద్దా? ఎవరింట పురుడోసుకుంటే వారు ఖర్చుభరించడం సబువు. ఏవంటావు?"

"శాంతికయే ఖర్చుమనవే భరించవలిసుంటుందేవో మరి " అన్నది రావమ్మ అనుమానంగా.

"అసలు నువుండు. దీని వైనవంతా శాస్తుల్లుగార్నడిగి తెలుసుకొస్తాను. వాళ్ళ కేం దెలుసే, వెఱ్రిదానా? వొట్టి నాస్తికులు ! ఓ దేవుళ్ళేడు, ఓ దైవంలేడు ! అలానే ఈ ప్రళయం విషయంకూడా కనుక్కొస్తా! " అన్నాడు సీతప్ప. నాస్తికులే పెద్దశాంతి అవటాంటూంటే శాస్తుల్లు గారు యాగాలె చెయ్యాలంటాడేవోనని సీతప్పకు లోపల దడగానే ఉంది.

'ప్రళయవేవిటండోయ్?" అన్నది రావమ్మ.

"సారిపోయింది! నువ్వింకా వినేలేదూ? నేను రాగానే దాన్ని గురించే గదూ చెప్తా? ప్రళయం వచ్చేస్తోందిట. నవగ్రహకూటం. అంటే, తొమ్మిదిగ్రహాలున్నూ ఆ పళంగా ఒక్క చోటచేరి ఊరుకుంటాయి. ఇంక అడిగావూ, భూకంపాలేవిటి, అగ్నిపర్వతాలు బద్దలు కావడవేవిటి, పిడుగులు పడిపోడవేవిటి, అంతలేసి మేడలు గభాల్నకూలిపోడవేవిటి, నదులు సముద్రాలు పొంగేసి భూమిని ముంచెయ్యడవేవిటి _ సర్వనాశనమనుకో! ఒక్క ప్రాణి మిగల్దు! సూరీడు కనిపించట్ట! ఎటో వెళ్లిపోయి దాక్కుంటాడు. సూర్య చంద్రులు గతులు తప్పడవంటే ఇదేనూ. నవగ్రహకూటవంటే మాటలా ! అబ్బో !"

'అయితే మరి మీ ఆఫీసో?" అన్నది రావమ్మ అంతా విని.

"ఫరవాలేదు, అంతప్పురావన్నట్టు, ఓ చెంపని ప్రళయం వచ్చేసి సర్వనాశనవైపోతుంటే ఇంకా ఆఫీసేవిటే, వెఱ్రిదానా?"

"ఈ ప్రళయం ఎప్పుడొస్తుందిటా?"

"ఎప్పుడోనా? పైమాసం నాలుగైదు తేదీల్లోనే. మద్రాసుమీదికి వెయ్యి నిలువుల నీరొచ్చి ఇరవైనాలుఘ్ఘంటల సేపు తియ్యకుండా ఉండిపోతుందట!"

రావమ్మ ఆశ్చర్యంతో బుగ్గలు నొక్కుకుని, "ఈ ఉపద్రం తప్పే దారే లేదా ?" అని అడిగింది.

"ఎందుకు తప్పదూ? చాలా మంది ప్రయాణపు ఏర్పాట్లు చేసేస్తున్నారు. మా ఆఫీసులో సహంమందికి పైగా ముందుగానే సెలవు దరఖాస్తులు పెట్టేశారు. జలప్రళయం తీసిపోయాక వస్తారు. మద్రాసు పట్టణవంతా మళ్ళీకట్టుకోవాలి."

రావమ్మకు గొప్ప ఆలోచనవచ్చింది. "అప్పుడు మనంకూడా ఎక్కడో ఇంత స్థలం కొని ఇల్లుకట్టేస్తాం. అద్దెకింద ఎంతడబ్బూ నాశనవైపోతోంది." అన్నది.

"భేషుగ్గా చెప్పావు!" అన్నాడు సీతప్ప.

2

సీతప్ప భయపడినంతా అయింది. శాస్తుల్లుగారు పిల్ల జననకాలం చూస్తూనే చక్రం వేసేసి, "ఎబ్బే, చాలా పాడు నక్షత్రం. ఇటూ అటూకూడా అందరికీ చెరుపు" అన్నాడు.

సీతప్పకు దడపుట్టింది. తన కసలే రోజులు బాగులేవు. ఎందుకోమరి ఆ శ్రీరామచంద్రమూర్తివారు తన నిలా పరీక్షిస్తున్నాడు.

"శాంతీ గట్రా చేయిస్తే అశుభం తొలగదంటారా శాస్తుల్లుగారూ?" అన్నాడు సీతప్ప.

శాస్తుల్లుగారికి శషభిషలు పనికిరావు.

"అయ్యా, సీతప్పగారూ, నేనొక్కటే చెబుతాను వినండీ. మంత్రాలతో చింతకాయలు రాలవన్నప్పుడు శాంతులతో గ్రహస్థితి మారుతుందండీ? అలా మారే మాటుంటే ఇంక జ్యోతిషవెందుకూ తగలేట్టనా?" అని అడిగాడు.

"మరి శాంతులూ గట్రా చేస్తూనే ఉన్నాం గదా!" అన్నాడు సీతప్ప జిద్దుగా.

"అదంతా మనమంచికోసం. మాట వరసకి చెబుతా. ఈ పిల్ల తాతగారి గండాన పుట్టిందనుకోండి. తాతగారికి గండం తప్పటం ఎలానూ ఉండదు. కాని చచ్చాక ఆ లోకంలో తాతగారికి దశలూ, విదశలూ కలిసొస్తాయి." అన్నాడు శాస్తుల్లుగారు.

"చచ్చాక దశలూ, విదశలూ ఏవిటి శాస్తుల్లుగారు?" అన్నాడు సీతప్ప.

"అలానుకోకండి. ఒక దివ్యవైన మహాదశారంభంలో కొందరు చచ్చేపోతారు. కాని చచ్చాక అవతలి లోకంలో వారికా మహాదశ అద్భుతంగా యెగించి సుఖపడిపోతారు. చచ్చినంతమాత్రాన గ్రహాలు వదిలేస్తాయనుకున్నారు గావోసు? పొరపాటు."

"శాంతిచేసినా ఫలితం ఉండదన్నారుగా? ఆలోకంలోగాని ఫలితం ఉంటుందా ఏమిటి?"

"ఫలితవంటే ఏవిటీ? గ్రహాలు కష్టసుఖాలు తెచ్చిపెట్టగలవేగాని వాటికి తట్టుకునే శక్తి మన్లోవుంది. గ్రహశాంతి చేస్తే మనం తట్టుకోగలుగుతాం. మాట వరసకి ఈ పిల్ల తాతగారికి ధననష్టం రాసిపెట్టుందనుకోండి. గ్రహశాంతి చేసినట్టయితే ఆస్తంతా తుడిచిపెట్టుకుపోయినా ఖాతరు చెయ్యడు. ఒక్క చిటికేసి ధనార్జనకు నడుంకట్టి బయల్దేరతాడు."

"తవరు చెప్పిందిప్పుడు నాకు బోధ పడింది. అయితే గ్రహశాంతి చెయ్యటవే మంచిదని తమసలహా? అలాగేచేద్దాం." అంటూ సీతప్ప శాస్తుల్లుగారి దగ్గర సెలవు పుచ్చుకున్నాడు.

ఇంటికి తిరిగొస్తూనే ఆయన రావమ్మతో, "శాస్తుల్లుగారు పిల్లచక్రం వేసి అంతా విశదంగా చెప్పేశారు. పిల్ల పుట్టిన నక్షత్రం చెడ్డదేనూ. మనవాడి మావగారికి ఖాయంగా ప్రాణగండంట! ఆస్తంతా కరారావుడై పోతుందిట. వెర్రిబ్రాహ్మడు, నా ఖర్చుతో శాంతి జరుపమంటున్నాడు. అందువల్ల ఒక్క పిసరు లాభవుండదు. శాంతిఖర్చులు మీరేభరించండి, ఎందుకు చెప్పానో చెప్పాను, అవటాని ఉత్తరముక్క రాసేస్తాను," అన్నాడు.

అనటవేవిటి, రాయటవేవిటి అంతా క్షణంలో అయిపోయింది. "చిత్తగించవలెను" అని రాసి సీతప్ప, సంతకం పెట్టటానికిగాను కార్డుకు కొంచెంఎగువగా గాలిలో తనపేరు రాయడం రిహార్స్ చేస్తుండగా "శేషుపిన్ని" గారొచ్చారు.

“రండి, పిన్నిగారూ! విన్నారుగా? మనవరాలు కలిగింది. శాంతిట ! హోమశాంతీ, గ్రహశాంతీ అంటున్నారు. మా వారు శాస్త్రుల్లుగారినడిగొచ్చారు కూడానూ.” అని రావమ్మ గబగబా క్షణంలో అన్ని సంగతులూ చెప్పేసింది.

ఆడంగులు మాట్లాడుతుంటే విని సీతప్ప ఎప్పుడూ అసూయపడేవాడు. వాళ్ళు ఎన్నో విషయములు ముచ్చిమూడు ముక్కల్లో చెప్పేస్తారు. టెలిగ్రాం కొట్టినట్టేనూ! వాళ్ళకాట్రిక్కు తెలుసును. మనకి అంటే మగాళ్ళకి ఆ సులువు తెలీదుమరి. ఒక్క చిన్న విషయం చెప్పడానికే ఎంతోసేపవుతుంది. అప్పటికీ చెప్పేదిసరిగా చెప్పానాలేదా అన్న అనుమానం అట్టే ఉండిపోతుంది. ఆడాళ్ళా ! అమ్మో వేదవ్యాసుడాడదై ఉంటే భారతమంతా అయిదుపేజీల్లో రాసును. కాని దాన్నెవరూ చదవకేపోదురు. అదీ అసలు కిటుకు. తన భార్య శేషుపిన్నిగారికంతా చెప్పిందేగాని ఆవిడ తెలుసుకోవలిసిన అసలు విషయం చెప్పనేలేదు.

“అసలు సంగతి నేనరటిపండులా వొలిచిపెడతాను వినండి, పిన్నిగారూ! నక్షత్రవైతే చెడ్డదేనూ. చెడ్డనక్షత్రవన్నాక శాంతీ గట్రా చేసుకోకవీల్లేదాయిరి. ఏవంటారు? మీరేచెప్పండి. శాస్త్రరీత్యానున్నూ, ఈ శాంతిగట్రా మన మంచికేగాని దీని వల్ల గ్రహగతులు మారేది లేదుగదా. ఎవరో మహాపతివ్రతలు_అదైనా ఏ ద్వాపరయుగంలోమట్టుక్కాదు! సూర్యచంద్రాదుల్ని నిలవేశారు గాని, ఈ కాలంలో మన తరవా? అయితే ఈ శాంతీగట్రా ఎవరి మంచికీ అన్న ప్రశ్నొస్తుంది గదా మరి. గ్రహ వీక్షణంవల్ల ఎవరికి చెరువుంటే వారే గద శాంతి చేసుకోవాలి! ఇప్పుడీ సందర్భంలో శాంతి చేసుకునే పూచీ అంతానున్నూ మా వియ్యంకుడు గారి మీదే పడినట్లు శాస్త్రుల్లుగారు స్పష్టంగా చెబుతున్నారు.” అన్నాడు సీతప్ప.

పిన్నిగారసాధ్యురాలు! సిద్ధాంతిగారి కోడలా, మరోటా! ఠకీమని, “మాతామహస్థానానికి చెరుపని శాస్త్రుల్లుగారు చెప్పారందరూ !” అనేసింది.

సీతప్ప మొహం శీతాకాలంలో కొబ్బరి నూనెలా పేరుకు పోయింది. ఆయన ఒక్క గుటకేసి, “మాతామహ.. తానూ అంతయిదిగానున్నూ తాతత్తా” అన్నాడు.

“చెరుపు పితామహస్థానానికో, మాతామహస్థానానికో స్పష్టంగా తేల్చుకోవాలన్నగారూ” అన్నది శేషుపిన్ని.

సీతప్ప కొంచెం తెప్పరిల్లుకుని, “అదే వచ్చిపడింది. ఆ శాస్త్రుల్లుగారేదీ స్పష్టంగా చెప్పలేదు. అసలు గ్రహశాంతేవిటి పొమ్మనటాన్నాడు కాస్సేపు. మరి కాస్సేపు శాంతిచేసుకోవడం మంచిదేనూ అన్నాడు. ఇంకాస్సేపు తాతగారికి చెరుపన్నట్టే చెప్పాడు మరి. పిల్ల — అంటే మా కోడలు — పుట్టింది లగాయతూనున్నూ — నా ఉద్దేశం. పెళ్ళయాకకూడా వారింటేఉండి, అక్కడే పురుడోసుకుని, అక్కడే అంతా గనక గ్రహదోషం వారినే హెచ్చుగా బాధిస్తుంది గదా అని “ అంటూ నీళ్ళు నవిలాడు.

“నువు మాత్రం తాతవు కాదుటయ్యా, వెర్రిబ్రాహ్మడా?” అనేసింది శేషుపిన్ని. “బారసాల ఆవులెల్లుండనా అన్నారు? నిక్షేపంగావెళ్లి శాంతిచేసేసుకోండి. మెడ మీద తలున్నవాడెవడూ శాంతి వద్దండు!”

శేషుపిన్నిగారు చాలా సేపు కూచుని దుష్టనక్షత్రాల ప్రభావమూ, దుష్ట గ్రహాల ప్రభావమూ గురించి ఎన్నో ఉదాహరణలు చెప్పింది. సీతప్ప ఒక చెవితో అదంతా వింటూనే ఇంకో చెవితో కర్తవ్యం ఏవిటిగదా అని తీవ్రంగా ఆలోచిస్తున్నాడు.

“ ఆ పిల్ల సవర్తాడిన నక్షత్రం మహాచెడ్డది. వైధవ్యయోగవని మా మావగారప్పుడే చెప్పేశారు. శాంతి భారీ ఎత్తున జరిపారు. వారికేం? మహారాజులు, లక్షాధికార్లు. తరువాత గర్భాదానానికి ముహుర్తం కూడా నిర్ణయించారు. ఎల్లుండి గర్భాదానవనగా పిల్ల మొగుడు కాస్తా చచ్చి ఊరుకున్నాడు. ఆ మరుసటేడు దాని మేనమామ కూతురు అదే నక్షత్రాన రజస్వల అయింది. శాంతి చేశారు. నక్షత్ర జపం చేయించారు. గర్భాదానం కాకుండానే దాని మొగుడూ పోయాడు. ఇప్పుడు మీ మనవడు పుట్టిన నక్షత్రానే ఆ కోదండరావయ్యగారి రెండో కోడలు కూడా ప్రసవించింది. బిడ్డకు ఆరునెల్లు నిండకుండానే కోదండరావయ్యగారి ఇల్లూ, పొలాలు తుడిచి పెట్టుకుపోయాయి. మరో ఆరునెల్లకి కోదండరావయ్యగారికే కాలం తీరిపోయింది ---”

ఇలాటి దాఖలాలన్నీ వింటున్నకొద్దీ సీతప్పకూ, రావమ్మకూ కూడా గుండె బెదురు హెచ్చిపోసాగింది. శేషుపిన్ని గారు వస్తానం జెప్పి లేచి వీధి గుమ్మం కూడా దాటిందో లేదో, రావమ్మ, “ఏవవనీండి గాక, ఎంత ఖర్చవనీండి గాక, శాంతి యధావిదిగా జరిగితీరవలిసిందే !” అన్నది.

“నాకూ అలానే అనిపించింది స్మీ, నే నింకా దూరవాలోచించాను. నక్షత్రాలే ఎంత చెడ్డవో విన్నాం గదా. నక్షత్రాల కన్న గ్రహాలు బలవత్తరవైన వాయెను. చెడ్డ నక్షత్రవంటే, ఆ నక్షత్రాన సవర్తాడ్డవొ, పురుడు రావడవో జరిగితే ఆ ఒక్క మనిషికి మాత్రమే చెరుపు; తతుమ్మా మనుషులంతా సుఖంగానే

వుంటారు. గ్రహాలలాక్కాదే. అవి నక్షత్రాల్లాగా ఉన్నచోటుండక ముందుకీ ఒక్కొప్పుడు వెనక్కీ నడుస్తుంటాయిట. అవి రాగూడని చోటి కొచ్చాయో యావన్మందికీ చెరుపే. వీడూ వాడూ అన్న విచక్షణ వుండదు. ఓః, భూకంపాలేవిటి, సముద్రాలుపొంగి పడవలు మునిగిపోవడవేవిటి, పడవల్లో వాళ్ళు అలో లక్ష్మణా అంటూ తెప్పకొయ్యలూ, తెరచాపలూ పట్టుకొని సముద్రంలోపడి, దారీ తెన్నూ తెలీకుండానున్నూ కొట్టుకుపోవడవేవిటి, ఇల్లు ఉన్న పళంగా గభాల్న కూలిపోయి ఇంటిల్లిపాదీ దానడుగున నలిగి చచ్చి పోవడవేవిటి, ఎన్నయినా భయోత్పాతాలు జరుగుతాయి. వచ్చే మాసం రాబోయే నవగ్రహకూటం వుంది చూడూ. ఎన్నడూ కనీవిననిది. ఉత్తినే రైళ్ళుపడి పోవడాలూ, ఇళ్లు కూలిపోవడాలూ, తుఫానూ వచ్చి వేలాది జననష్టం కలుగుతోంది గదా, ఈ నవగ్రహ కూటవెలా వుండబోతుందో వుహించుకో! అసలే బిడ్డకలిగిన నక్షత్రం శాంతి నక్షత్రవంటున్నారాయిరి. మనం పట్నానికి నలభై మైళ్ళలోపున ఉండడం ప్రమాదం. మనం బారసాలకు పోదాం. పోయి, ఈ గ్రహకూటం దాటిపోయిందాకా అక్కడే ఉండిపోదాం. రాకరాకొచ్చావని వియ్యాలవారు సంతోషిస్తారు. సోవిదేవి సంగతి చెప్పే అక్కర్లేదు. ఒక పూట వియ్యాల వారింటా, ఓ పూట సోవిదేవింటా, ఓ పూట వారింటా, ఓ పూట వీరింటా – ! మంచి ఆలోచనే చేశానని నువ్వొప్పుకు తీరాలి !"

"మీరాలోచన చెయ్యడవూ, అది మంచిది కాకపోవడవూనా ?" అన్నది రావమ్మ ముసిముసి నవ్వులు నవ్వుతూ.

3

"వచ్చేశాం !" అన్నాడు సీతప్ప వియ్యాల వారింట అడుగు పెడుతూనే.

"ఎందుకూ ?" అన్నాడు సత్యం మావగారు సీతాపతి గారు.

"ఇవాళేగదూ బారసాలా, శాంతీగట్రా ?" అన్నాడు సీతప్ప బిత్తరపోయి.

"శాంతి వద్దన్నారుగా? ఆప్రయత్నవే మానుకున్నాం" అన్నాడు సీతాపతి.

"ప్రయత్నవే మానుకున్నారా? చెడ్డ నక్షత్రవన్నారు ?" అని సీతప్ప అడిగాడు.

"మాకు నక్షత్రాల పట్టింపులూ అవీ లేవు. మాదంతా బ్రహ్మసమాజం పద్ధతి గదూ? మీరే మూఢత్వం కొద్దీ అలాటివి జరిపించి తీరాలంటారేమోనని ఓ కార్డు ముక్క రాసి పడేశాను. మీ జవాబు చూడగా మీకవేవీ పట్టనట్టు కనబడింది. మరీ మంచిది లెమ్మనుకున్నాం."

సీతప్ప గుండెల్లో ప్రళయం ఆరంభమయింది. పరిస్థితి ఇలా విషమించి పోయిందని సీతప్ప కల్లోగూడా ఊహించలేదు. బ్రాహ్మలు చెప్పేదానికన్న దానాలూ అవీ మరోనయాపైసా హెచ్చుగానే ఇద్దావటాని బాంకిలోంచి ఆరువందలు తీసి భార్యను వెంటబెట్టుకుని చక్కావచ్చాడు. కాని ఏం ప్రయోజనం శాంతిలేదు సరేగదా, బారసాలా, నామకరణవూలేదు; గుమ్మాలకి పసుపు కుంకాల్లేవ్. అధమం ఓ మామిడిమండైనా కట్టారు గాదు! ఇది నాస్తికత్వమనుకోవాలో, పచ్చి కమ్యూనిజ మనుకోవాలో సీతప్పకి బోధపడింది కాదు. చాలా కాలంగా తనని ఏదో దుష్టగ్రహం వేపుకు తింటుందన్న అనుమానం మరింత రూఢి అయింది. ఏం చెయ్యబోయినా పొద్దెదురవుతూంటే ఎలా యాడవడం?

"పోనీ ఇప్పుడు శాంతికి ఏర్పాట్లు చేస్తేనో?" అన్నాడు సీతప్ప

"మీకు సాధ్యవయేట్టుంటే మహారాజులా చేయించండి. వ్యవధి లేకుండా ఏర్పాట్లుచూడ్డం నావల్ల అయేపని గాదు. అయినా మీరు మీ ఆలోచన మళ్ళీ ఎందుకు మార్చేసుకున్నారో నాకర్ధవవకుండా వుంది." అన్నాడు సీతాపతి.

సీతప్ప ఒక్కగుటకవేసి ఊరుకున్నాడు. ఏడవడానికీ, ఏం చెయ్యడానికీ ఆయనకు పాలుబోకుండా వచ్చికూచుంది ..

రావమ్మను చూస్తూనే ఇంటిఆడవాళ్లు, "వచ్చారా? రావనుకున్నావే?" అన్నారు. సీతారత్నం అత్తగారిని పలకరించనైనాలేదు. బాలింతరాలంటే ఎంతో కళగా, నవనవలాడుతూండాలి, ఏకళాలేదు. స్నానవయిందిగాబోలు, జుట్టుకు ధూపం వేసుకుంటోంది.

రావమ్మగారు, "మనవరాలేదీ? నాక్కూడాచూపరూ?" అన్నదాకా ఎవరూ కదల్లేదు.

"శాంతంటే మాకు నమ్మకం లేదన్నారు. నావకరణవైనా చేసుకోవడం లేదేం?" అన్నది రావమ్మ.

"అది పుట్టకముందే ఆడపిల్ల అవుతుందని నరసుచెప్పేశాడు. దానికి ఆవా అని పేరెట్టేశాడుకూడాను." అన్నారు వాళ్ళు.

"బొద్దుదనిపిల్లకి అవ్వని ఎవరేనా పేరెట్టుకుంటారా?" అన్నది రావమ్మ విస్తుపోయి, చెయ్యితిప్పి గడ్డకింద సపోర్టుపెట్టుకుంటూ.

"అవ్వకాదు. ఆవాగార్డనరు. మా అన్నకి అభిమాన హాలివుడ్ తార. చాలా అందంగా ఉంటుంది. ఎన్నో లక్షలమంది ఆవిడకి రోజూ ప్రేమలేఖలురాస్తుంటార్ట. ఉన్న మొగుణ్ణి వదిలేసి మమల్ని పెళ్ళి చేసుకోమని కోటీశ్వరులు అడుగుతూంటార్ట!" అని సీతారత్నం అత్తగారికి వివరించి చెప్పింది.

రావమ్మకు వాంతి అయినంతపని అయింది. అలాంటిమనిషి పేరా బిడ్డకి పెట్టుకునేది ? ఏ పతివ్రతపేరో, దేవుడి పేరో పెట్టుకోక !

ఆమెకక్కడ ముళ్ళమీద ఉన్నట్టుండి ఎదురుగావున్న సోవిదేవిని చూడటానికెళ్ళింది.

తల్లిని చూడగానే సోవిదేవి మొగం విప్పారింది.

"వచ్చావా, అమ్మా ? నాన్న కూడా వచ్చాడా? మీర్రావడంలేదని చెప్పారు. సరేగాని శాంతి వొద్దాన్నారటేవిటీ? ఎక్కడేనాకద్దా ? అంత పాడునక్షత్రమన్నప్పుడు శాంతిచేసుకోరూ? నాన్న ఇలాగంటాడని నేను కల్లోకూడా అనుకోలేదుస్మీ !" అన్నది సోవిదేవి.

"దానికంతా వుందిలే. ఆయన శాంతొద్దనిరాయలేదు. అలా ఒక్కనాటికీ రాయరు. శాంతిఖర్చులు అయిదొందలవుతాయి ఆచ్చుకోమంటే, అంత డబ్బు లేదు. కొంతమీరుకూడ భరించడవటాని రాసుంటారు. పోనీగాని చిత్తుగాడేడీ? అల్లుడుగారు కులాసాయేగదా ? పార్వతికి మళ్ళీ యేవైనా ?"

"ఏంలేదు. పాపం ఆవిడికి సంతానరేఖ ఉన్నట్టు కనబడదు." అంటూ సోవిదేవి నిట్టూర్చింది. అంతలోనే గొంతుమార్చి, "చిత్తుగాడు బడికెళ్ళి పోయాడు, వాడింటో క్షణంవుండడు. ఊరంతా వాడికి నేస్తాలేనూ!" అన్నది.

"వాడి దారే వేరు !" అన్నది తల్లి.

వాళ్ళు మాట్లాడుకుంటూండగానే సీతప్ప వచ్చాడు.

సీతాపతివాళ్ళింటిలో వాళ్ళంతా అదో రకం మనుషులనీ, సత్యాన్ని ఏవంత మర్యాదగా చూట్టంలేదనీ, వాడస్తమానమూ ఆ ప్రెస్సులుకాడుండి అడవాచాకిరీ చేస్తున్నాడనీ; రాత్రిబవళ్ళు విధి విరామవూ వుండడంలేదనీ సోవిదేవి తల్లిదండ్రులతో మాటసందర్భగా అన్నది.

కాని సీతప్ప అదంతా కొట్టవతల పారేశాడు.

"వాడిప్పుడు వాళ్ళలో మనిషేనూ. అలాటప్పుడు మర్యాదేవిటీ? ఆత్మీయతా, అప్యాయతా ముఖ్యంగానీ! పనంటావూ? సొంతపనేగదూ? మనపని మనం చూసుకోకపోతే మరెవరు చూస్తారూ? ఇంకో గమ్మత్తు చూశావూ? మనవాడలా అహోరాత్రులు, అన్నాహారాలులేక, ఎండనక, వాననక, చెమటోడ్చి పరిశ్రమించడంవల్ల అత్తవారికి వాడంటే వల్లమాలిన అభిమానపూ అదీ పుట్టుకొస్తుంది. వాడోపూట ఖాయిలాపడ్డాడనుకో, చెయ్యివిరిగినట్టయి పోతుంది. ఏవిటనుకున్నావేవిటోనూ!... ఆ సంగతివదిలేయ్ ! ఇప్పుడసలు ఉపద్రం పట్నానికొచ్చింది. నువ్వినేవుంటావు. పేద్ద ఉప్పెనొచ్చేసి పట్నం చుట్టూరానున్నూ ముప్పై నలభైమైళ్ళ మేర ముంచెత్తేస్తుందిట. వెయ్యినిలువుల నీరు ఇరవై నాలుఘ్గంటల పాటలా నిలిచిఉండి పోతుందిట. ఇళ్ళు కూలిపోవడవేవిటి, ఊపిరాడక మనుషులు చచ్చిపోవడవేవిటి అడక్కుమరి! దారుణం! ... వీళ్ళింకా తెలుసుకోకుండా ఉన్నారు. వెయ్యినిలువుల ఉప్పునీరొచ్చేస్తే గరిక్కూడా చచ్చూరుకుంటుంది. పట్నం చుట్టూ ముప్పైమైళ్ళమేర యెడారైపోతుందంటే నమ్ము. ఇంకో గమ్మత్తుచూశావా? ఆ యెడారి గజం పావలాకిమ్మన్నా ఇచ్చేస్తారు. ఓ రెండెకరాలు కొని ధరలు పెరిగాక ఇళ్ళస్థలాల కింద అమ్మేద్దావవటాని అమ్మ ఆలోచనచేసింది. అలాగే చేద్దాం గాని ముందు ఈ ప్రళయంనుంచి ప్రాణాలతో బయటపడనీ అన్నా, పారిపోయెచ్చేశావంటే నమ్మంతే !"

సోవిదేవికి ఒక్కటే అనుమానం వచ్చింది.

"ఈ జలప్రళయం గురించి ఇక్కడ కూడా తెగ చెప్పుకుంటున్నారు. కాని వెయ్యడుగుల నీరొస్తుందని మాత్రమే అంటున్నారే?" అన్నదామె.

"వెయ్యడుగులా? ఇంకానయం! వెయ్యడుగులయితే చెప్పుకోడందేనికీ? వెయ్యి నిలువులు!" అన్నాడు సీతప్ప కళ్ళు పెద్దవి చేసి. ఆయనకు ఎక్కడలేని కవిత్వమూ పుట్టుకొచ్చేసింది. జరిగిన సంఘటనలు కళ్లారా చూసినవాడు వర్ణించిన విధంగా ఆయన జరగబోయే జలప్రళయ భీభత్సాన్ని కూతురికి వర్ణించి చెప్పాడు.

మాటల సందడిలో సీతప్పకి కాలం ఎలాగడిచిందీ తెలియలేదు. "గనుకనున్నూ, మేంజేసిన ఆలోచన ఏవిటంటే నున్నూ, ఎలాగో ఇల్లుకదిలి రానేవచ్చేశావా, చెప్పుల్లో ప్రయాణం బెట్టుకుని వస్తే అటు వియ్యాలవారూ ఒప్పరు, మీ ఆయనా ఒప్పడు. ఇదేవిటి? ఇప్పుడొచ్చి ఇప్పుడే వెళ్ళిపోవడవా,

వల్లగాదవటంటారు తప్పవిడిచి మరొహటుండబోదు. అంచేతను మరోనాల్రోజులక్కడా, సరదాగా ఉండిపోయి, యేకంగా జల ప్రళయం తీశాక తిరిగిపోవడానికి నిశ్చయించుకు చక్కా వచ్చాం– చెప్పొద్దూ? నెల్రోజులు సెలవడిగేశాను. నే సెలవు తీసుకుని ఏళ్ళయిందంటే నమ్ము. మా ఆఫీసులో మిగిలిన వాళ్ళంతా తద్దినాలనీ, ఊరికెళ్ళాలనీ, అక్కరొచ్చిందనీ చీటికీ మాటికీ సెలవుచీట్లు పంపిస్తూంటారు. నేనలా ఎన్నడూ చెయ్యను. ఎందుకడగాలి, ఎందుకు లేదనిపించుకోవాలి? శరీరం అమ్ముకునాక పనిచెయ్యవలిసిందే. పనంటే పనేనూ ! రోట్లో తలదూర్చి రోకటి పోటుకు జంకితే ఎలా ? ఎన్నడూ సెలవడిగి యెరుగనేవో అడగ్గానే గ్రాంటు చేసి పారేశారు. చక్కావచ్చాం. రాకరాకొచ్చి నాల్రోజులైనా కళ్ళెదుటుండకుండా కట్టుదిట్టవై మరీ వచ్చావనుకో!" అని సీతప్ప అంటుండగా ఫ్యాక్టరీలు కూశాయి.

"అమ్మయ్యో! అప్పుడే పన్నెండే? ఏవేవ్, వేగిరం, వేగిరం! అవతల పెద్ద మనుషులు మనకోసం ఆపోశన పట్టకుండా కనిపెట్టుక్కూచునుంటారు. పద, పద!" అని సీతప్ప భార్యను తొందరచేశాడు.

కాని సీతాపతిగారింట్లో భోజనాలెప్పుడో అయిపోయాయి. ఆ సంగతి తెలీక సీతప్ప తన వియ్యంకుణ్ణిచూసి, "ఈ బ్రాహ్మడింకా భోజనం చేసేయత్నంలో లేడేవిటి చెప్మా?" అనుకున్నాడు.

రావమ్మని వియ్యపరాలు మాత్రం, "మీ సోవిదేవిగారింట్ ఈ పూట వంటకాలేవిటో?" అనడిగింది.

"తెలీదుస్మండీ. అడిగానుకాను." అన్నది రావమ్మగారు.

"మీరింకా భోజనాలే చెయ్యలేదూ? ఎంతకీ రాకపోతే అక్కడే భోంచేశారనుకున్నాం."

కడిగిన వంటిల్లో చితచితలాడుతోంది. వంటకాలు చప్పచల్లారిపోయాయి. సీతప్ప నాలుగు మెతుకులు నోటవేసుకున్నాననిపించాడేగాని ముద్దదిగడం చాలాకష్టవైపోయింది. రావమ్మగారు తినొచ్చేసరికి కూరమిగల్లేదు. మజ్జిగ గట్టిగా రెండి చెంచాలు మిగిలింది.

ఆ పుణ్యదంపతులు భుక్తాయాసంలేని భోజనం చేసి బయటి అరుగుమీద చేరారు "కాస్సేపు నడుం వాలుస్తారాయేవిటి?' అన్నవారుగాని, ఓ మంచంవేసి మర్యాద చేసినవారుగాని లేరు.

"తప్పుపట్టడానిక్కాదుగాని, వీరి మాటతీరూ మర్యాదతీరూ అదోమోస్తరు సుమండీ ! ఇప్పుడేం ? అబ్బిపెళ్ళినాడే ఈ సంగతి గమనించా," అన్నది రావమ్మ.

"నేనొక్కటే చెబుతున్నా చూడూ. మనం అలాటివేవీ పెట్టుకోగూడదు. మన సంగతి చంద్రమతీ హరిశ్చంద్రులవంతు అయింది. ఇల్లూవాకిలీ విడిచివచ్చేశాం. మన చూరుకింద మనం నిలబడే యోగ్యత లేకుండా చేసేశాయి నవగ్రహాలు. నవగ్రహ జపవూగట్రా అవుతుందిగదా అనుకుంటే ఇక్కడ అసలుశాంతే జరగలేదు. అంచేత మనవి ఈ గ్రహాలు ఓ పట్టాన వదిలిపెట్టవు. మనవా, ఇవాళొచ్చిరేపెళ్ళి పోతున్నవాళ్ళం కాకపోతివి. ప్రళయం జరిగిపోయి, కలియుగం ముగిసి మళ్ళా కృతయుగం ఆరంభమయే వరకూనున్నూ ఇక్కడే ఉండిపోతున్నా అలాటప్పుడు మాటలనీ, మర్యాదమనీ పెట్టుక్కూచుంటే అవుతుందా? కలిపీడితులైన నలదమయంతులను ఆ మహారణ్యంలో ఎవరు మర్యాద చేశారు? ఏవిటో! మనం వారి కన్న లక్షరెట్లునయమనుకో – లక్షరెట్లు !" అన్నాడు సీతప్ప తలకింద చెయ్యి పెట్టుకుని పడుకుంటూను.

రావమ్మ మాత్రం గోడకి చేరగిలబడి కూచుని, "ఇదేం ప్రయాణం! ఇదేం కథ కోడలు నీళ్ళాడింది. చంటిబిడ్డను చేతిలో పెట్టి ముచ్చటలు పలికినవాళ్ళులేరు. కొడుకింతవరకు కంటికే కనిపించలేదు. ఎప్పుడనగా వెళ్ళాడో, ఎక్కడ అన్నం తిన్నాడో? బారసాలలేదు, పాడూలేదు. నిన్నంటే నిన్నపుట్టిన బిడ్డకి అవ్వఅని పేరెట్టారట! చూడగా అంతా కలలా ఉందిగాని నిజంలాగాలేదు ... గోదావరి నీరు పట్నం నీరులా క్కాదు, ఆనది కరకరలాడుతుందిగాబోలు" అనుకుంటూ కూచునే కునుకులు పడింది.

# ఎదురు దెబ్బ

## తాళ్ళూరు నాగేశ్వర్రావు

## (కృష్ణాపత్రిక - 1963 మార్చి, సంచికనుంచి పునర్ముద్రితం)




సరిగ్గా మూడు గంటల పదినిముషాలకు బిట్రగుంట ప్యాసింజర్ ను విజయవాడ స్టేషన్ మెల్లగా సాగనంపింది. గాలి సమ్మె చేయగా, మధ్య వయస్సు దాటిన ఎండ తన తీక్షణత్వాన్ని చూపిస్తోంది. లేడీస్ సెకండు క్లాసు బోగీలోని ఫ్యాన్లు అంతకు వారం రోజుల క్రితమే రిపేరు చేసే మెకానిక్ కోసం దరఖాస్తు పెట్టుకుని నిశ్చలంగా నిరీక్షిస్తున్నాయి.

పాము నడకన బయలుదేరిన బిట్రగుంట ప్యాసింజరు బండి పక్షి వేగాన్ని అందుకొనకముందే, లేడీస్ సెకండు క్లాసు బోగీలో ఆలోచనల గొడుగువిప్పుకొని కూర్చున్న సుబ్బలక్ష్మి ఓ స్త్రీని పిల్లవాడ్నీ ఆ ఎదుట చూసింది. ఆ కంపార్ట్మెంట్ లో వాళ్ళిద్దరే ఉన్నారు. రెండవ పుట్టినరోజు పండుగను పక్షంరోజుల్లో జరుపుకునేందుకు ఆజీలుగా వున్న ఆ పిల్లవాడు తల్లి ఒడిలో కులాసాగా కూర్చున్నాడు. చేతిలో ఏదో బొమ్మ ఉన్నది. ట్రైన్ కృష్ణా బ్రిడ్జి మీదనుంచి చప్పుడు చేస్తోపోతుంటే ఆ పిల్లవాడు విశేషమైన ఉత్సాహంతో కేరింతలు కొడుతున్నాడు. ఆ పిల్లవాని తల్లి మటుకు నుదురుపై కుడిచేయి పెట్టుకొనిరెండు గంటల క్రితం ఆరంభమైన తలనొప్పిని తగ్గించుకొనేందుకు ప్రయత్నిస్తోంది. సీటుపై ఏటవాలుగా కూర్చుంది. ట్రైన్ స్టేషన్ కు వచ్చేముందు శారిడాన్ బిళ్ళ వేసుకొని వేడి కాఫీ సేవించింది గానీ తలనొప్పి సద్దుమణగలేదు. ప్రయాణమంటేనే ఆమెకు తలనొప్పి. అందులో ప్రయాణీకుల ఓర్పును పరీక్షించే యీ రైళ్ళలో ప్రయాణం _ పూర్వజన్మలో శిక్షగానే అగపడుతుంది.

ట్రైన్ క్రిష్ణా బ్రిడ్జి దాటింది.

ఆ కుర్రవానికేసి దృష్టి నిల్పి చూసింది సుబ్బలక్ష్మి . ఎంత బావున్నాడు? ఎంతగా ముద్దువస్తున్నాడు పాలుగారే ఆ ముఖమూ, నెలవంకను గుర్తుకు తెచ్చే ఆ బుల్లి పెదవులూ, సూర్యుని ఆఖరి కాంతి వంటి ఆ శరీరఛ్ఛాయా, నీలాకాశపు అమాయకత్వాన్ని కలిసివున్న ఆకళ్ళు, మల్లె మొగ్గలాగా వున్న ఆ ముక్కూ, మెడచుట్టూ గుండ్రటిదనమూ, దూదిపింజెలవలె వున్న ఆ కాళ్ళూ, చేతులూ ఎంతో మనోహరంగా వున్నాడు? ఇట్లాంటి పిల్లవానికి తల్లి కావటం పూర్వజన్మ సుకృతమే! తండ్రి ఎవరో? ఒరలోంచి కత్తి దూసినట్టుగా ఆమెలో ఓ అనుమానం మెరిసింది. ఆ ముఖంతీరూ, ఉంగరాల జుత్తూ, కంఠపు గుండ్రదనమూ, శరీరఛ్ఛాయా, కళ్ళూ... కృష్ణమోహన్ ను స్ఫురణకు తేవడం లేదూ! ఈ పిల్లవాడు కృష్ణమోహన్ కొడుకా! ఆమె అతని భార్యా! అట్లా ఉన్నదేం! సన్నగా, గాలికి పడిపోయేట్టుగా. ముఖంలో అందం ఆకర్షణ లేదు. పైగా అంద విహీనతను చూపుడు వేలితో చూపిస్తున్నట్టుగా పళ్ళు ఎత్తు; తలకట్టులో సొగసు లేదు. రైల్వే ప్లాట్ ఫారం లాంటి వక్షస్థలం కొండపల్లి బొమ్మలాగా వున్న ఆమెను కృష్ణమోహన్ ఎట్లా పెళ్ళి చేసికొనివుంటాడు. పదిహేనెకరాల పొలమూ, యాభైవేల రూపాయల నిల్వా, ఒక్కతే ఆడపిల్లా_కామోసు. అందుకే స్త్రీ సౌందర్యానికీ, ప్రేమకు అభిమానానికి ప్రాముఖ్యమివ్వకుండ _ ఆ చెక్కబొమ్మను తెచ్చుకున్నాడు! ఈనాటి యువకుల ప్రేమలూ, ఆదర్శాలూ మాటల్లోనేగానీ ఆచరణకు వచ్చేసరికి భయపడతారు, బెదిరిపోతారు డబ్బుపై వ్యామోహానికి లొంగి పోతారు మృగతృష్ణలాంటి వీళ్ళ ప్రేమల్ని నమ్ముకొన్న స్త్రీలను నిలువునా అగాధాల్లోకి దించుతారు.

అయిదేళ్ళక్రితం కాలేజీలో చదువుతున్నప్పుడు తను కృష్ణమోహన్ ను గాఢంగా ప్రేమించింది. అతను చాలా బావుంటాడు. కాలేజీలో చదివే వెయ్యిమంది విధ్యార్ధుల్లో అతనే అందమైన వాడు. చక్కగా మాట్లాడతాడు నాటకాల్లో డిబేట్సులో హుషారుగా పాల్గొనేవాడు తెలివైన వాడు, క్లాసులో ఫస్టుమార్కులే వొచ్చేవి. తనకి కూడా 'కాలేజీబ్యూటీ' అన్నగొప్పపేరు ఉండేది. తనని చూసేందుకూ, తన ప్రేమను పొందేందుకు, అభిమానాన్ని చూరగొనేందుకు_ విధ్యార్ధులు విరివిగా తహతహలాడేవాళ్ళు. కాని తన మనస్సు మటుకు కృష్ణమోహన్ పై లగ్నమైంది. అతను కూడా తనని ప్రేమిస్తున్నట్టు తెల్సుకున్నప్పుడు తనుపొందిన ఆనందానికి అవధులు లేకపోయినయ్. అతనే తనకి ముందుగా ప్రేమ లేఖ వ్రాశాడు. ఆ లేఖకు తను మూడుగంటలసేపు ప్రయాసపడి సంతృప్తిగా సమాధానం వ్రాసింది. ఆ లేఖలో సర్వస్వమూ అర్పించినట్టు స్పష్టంగా తెలియపరిచింది తను. తర్వాత సినిమా హాలులో కల్సికొన్నప్పుడు కూడా ఆతనిమీద తనకు గల నిజమైన ప్రేమను తెలియజేసింది. అతనూతనని గాఢాతిగాఢంగా ప్రేమిస్తూన్నట్టు చెప్పాడు. తర్వాత ఆ పైన తామిదరి మధ్య నడిచిన లేఖల్లో, సంభాషణల్లో, చూపుల్లో భావాల్లో_ వివాహం చేసికొని జీవితాల్ని స్వర్గతుల్యం చేసికుందామన్న, అభిప్రాయం గట్టిపడింది. అతనుకూడా 'నిన్ను తప్పకుండా పెళ్ళిచేసికుంటాను' అన్నాడు తనతో. కాని తనని పెళ్ళి చేసికోలేదు. తనని మోసగించాడు. తన హృదయంలో ఆశల్ని రేకెత్తించి, తనకళ్ళ ఎదుట చక్కటి సుందరలోకాన్ని కల్పించి, తన భవిష్యత్తును బంగారుభూమిగా మారుస్తానని వాగ్దానం చేసి_ చివరకు తనదారి తనని చూస్కోమన్నాడు. వాళ్ళ తల్లిదండ్రుల్ని ఎదిరించలేడట. కాలం కల్సిరాలేదట. భగవంతునికి కరుణలేదట తన అసమర్ధతను బయటపెట్టుకోలేక పిరికివాళ్ళు నేరాన్ని భగవంతుని పై వేస్తారు. వయస్సు కలిగించే మోహాన్నీ ప్రేమగా చాటుకుంటారు గానీ_ ఆత్మసాక్షిగా ప్రేమించి, ఆ ప్రేమ సాఫల్యతకు ఎట్లాంటి త్యాగానికైనా సంసిద్ధులు కారు. కృష్ణమోహన్ పిరికివాడు. పచ్చి మోసగాడు. స్త్రీ హృదయంతో ఆటలాడే విలాస పురుషుడు. పెళ్ళి చేసుకున్నాక మొసలి కన్నీళ్ళు కారుస్తూ, 'క్షమించమని' తనకు లేఖ వ్రాశాడు. ఎంత సులభంగా అర్ధించాడు 'క్షమించమని?...' తనకి ఆ సంవత్సరమే వివాహమైంది. ఆయనగారు కృష్ణమోహన్ వంటి అందమైన వాడు కాకపోవచ్చు. కాని సహృదయులు. బాగానే చదువుకొన, ఉద్యోగం చేస్తూన్నవారు. తమకూ రెండున్నర సంవత్సరాల కూతురుఉన్నది. అందమైనదే... కృష్ణమోహన్ ఇప్పుడెక్కడ ఉన్నాడో! ఎక్కడ ఉద్యోగం చేస్తున్నాడో! ఈ పిల్లవాడు అతనికొడుకే అయివుండవచ్చు. తన అనుమానం వాస్తవం కావచ్చు... సుబ్బలక్ష్మ ఆ విధమైన ఆలోచనలలో సతమతమవుతూండగా ప్యాసింజర్ ట్రైన్ క్రిష్ణా కెనాల్ స్టేషన్లో ఆగింది.

నారింజపండ్లు అమ్మే ఒకతను పెట్టెలోకి వచ్చి_ 'వద్లపూడి నారింజకావాలా అమ్మా!' అని అడిగి వెళ్ళాడు. పిల్లవాడు కాయలకేసి ఎగాదిగా చూశాడు కానీ, తలనొప్పి బాధతోవున్నతల్లి పట్టించుకోలేదు.

ఆమెను పలకరించి ఆమె భర్త పుట్టు పూర్వోత్తరాలు కనుక్కోవాలనుకుంది సుబ్బలక్షి .

"ఎంతవరకండీ ప్రయాణం?"

"తెనాలి" అన్నదామె శిరోభారం చేత కనుబొమ్మలు కదిలిస్తూ.

"మీ పుట్టిల్లు తెనాల్లో నేనా?"

"కాదండీ. కంకిపాడు, తెనాల్లో మా వారికి ఉద్యోగం."

"ఏం ఉద్యోగం?"

"ఇన్ కంటాక్సు ఇనస్పెక్టరు"

"వారి పేరు?"

"కృష్ణమోహన్"

"ఎంతవరకు చదివారు?"

"బందర్లో బి.ఏ. హైద్రాబాదులో ఎల్.ఎల్.బి"

"ఈ పిల్లవాడు మీ అబ్బాయేనా!?"

"అవునండీ!"

"మీ పేరు?"

"ఇందిర"

అన్ని ప్రశ్నలకూ ముక్తసరిగా సమాధానాలు చెప్పిందిగానీ ఇందిర ఒక్క ప్రశ్నవేయలేదు. కారణం ఆమె తలనొప్పితో బాధపడుతూండడమే.

ట్రైన్ పెద్దవడ్లపూడి స్టేషన్లో ఆగి బయల్దేరింది.

పిల్లవాడు తల్లి ఒడిలోంచి మెల్లగా దిగజారి క్రిందకు వొచ్చాడు బొమ్మతోసహా. సుబ్బలక్ష్మి ఆప్యాయంగా ఆ పిల్లవాడ్ని తన దగ్గరకు తీసికొంది. చక్కగా ముద్దాడింది. ఏవేవో మాట్లాడింది. నవ్వించింది, తను నవ్వింది, చప్పట్లు కొట్టింది. కిటికీలోంచి రైలు వేగానికి గిర గిరా తిరిగే చెట్లనూ, పొలాల్లోని పశువుల్ని, దూరంగా వున్న కొండల్ని_ వేలెత్తి చూపెట్టింది. పిల్లవాడు కొత్తదనం లేకుండానే సుబ్బలక్ష్మి సమక్షంలో కులాసాగా ఆడుకుంటున్నాడు.

తలనొప్పితో ఇందిర బర్త్ మీద మగతగా పడుకొంది.

ఓ మాదిరి వేగంతో పోతున్న ట్రైన్ పై సాయంత్రపు ఎండ పడుతోంది. అద్దాల కిటికీల్లోంచి ఎండ పొడలు బోగీల్లో దొర్లాడుతున్నాయి.

పిల్లవాడు బర్త్ మీద బొమ్మతో కుస్తీ పడుతున్నాడు.

సుబ్బలక్ష్మి కొంచెం సేపు కిటికీలోంచి బయటకు చూస్తూ కూర్చుంది. సంధ్యాకాంతికి ముఖాల్ని ఎరుపు చేసుకున్న మబ్బుల్నీ, చిరుగాలికి తలలు ఆడిస్తూన్న అరటి తోటల్నీ, రైలు చప్పుడుకు మోరలెత్తి వింతగా చూసే పశువుల్ని, నిశ్శబ్దంగా చూస్తూ కూర్చున్నప్పటికీ సుబ్బలక్ష్మి మనస్సు మురుగు కాలువ మాదిరిగా వుంది. ఆరిపోని నిప్పు రవ్వలాంటి అశాంతి హృదయంలో పొగల్ని రేపుతోంది. ఏదో తన కిష్టం లేనిది జరిగినట్టు, తనని మోసగించిన వాళ్ళు సఖపడుతున్నట్టు_ఆమెలో అసూయ ద్వేషాలు నూట ఆరు డిగ్రీల ఉష్ణోగ్రతకు చేరుకున్నాయి.

కృష్ణమోహన్ కొడుకు ఎంత అందంగా ఉన్నాడు? తనని ప్రేమించి తృణీకరించిన కృష్ణమోహన్, తనని ప్రేమించి దగా చేసిన కృష్ణమోహన్ తన మనస్సులో మల్లెతోట పూయించి మాడ్చివేసిన కృష్ణమోహన్ ఈ ముద్దుల మురిపెపు కొడుకుని చూసికొని గర్వపడతాడు కాబోలు! తన నోటి దగ్గర్నుంచి అమృతపాత్రను హరించిన యీ ఇందిర_ విశ్వసౌందర్యపు వెలుగురేఖలాంటి కొడుకును చూసుకొని మురిసిపోతుంది కాబోలు మంచి ఉద్యోగం, భర్య తరపున కావాల్సినంత ఆస్తి, అందమైన కొడుకు తనన పెళ్ళి చేసుకోని కృష్ణ మోహన్ భవిష్యత్తు సుఖజీవనం కాబోలు!!!... దుష్టాత్ములకూ, మోసగాళ్ళకూ, స్వార్థపూరితులకూ ఈ కాలం సౌఖ్యాన్ని సమకూర్చే యంత్రంలాగా పని చేస్తోంది! కాని ఏది శాశ్వతం? ఈ ఆస్తీ, అందమూ, ఆనందమూ బ్రతకులు ఎల్లకాలమూ ప్రశాంతంగా నిలుస్తాయనే గ్యారంటీ ఏముంది? మానవుని జీవితం సుఖదుఃఖాల తోరణం లాంటిది. ఏ క్షణంలో ఏం జరుగుతుందో చెప్పడం కష్టంగదా! ఊహకందని భవిష్యత్తులో జీవితం అల్లల్లాడేటప్పుడు_ అనుకోని సంఘటనలు ఏ క్షణంలోనైనా జరగవచ్చు జీవితం ఎప్పుడైనా తారుమారు కావచ్చు పట్టాలు తొలగి యీ ట్రైన్ క్రిందపడితే_ బ్రతికేవాళ్ళెంతమంది? చనిపోయేదెంతమంది?... కాని ఇట్లాంటి వేదాంతానికి జీవితాన్ని పోల్చి చూసికొని సంతృప్తి పడటం సమంజసమేనా తన కడుపులోని మంట, హృదయంలో అశాంతి, మనస్సులో కల్లోలం ఎట్లా సద్దుమణుగుతాయి? ఏం చేయాలి తనేం చేయగలదు? తనకు సహించని పరిస్థితులపై పగదీర్చుకోవటమెట్లా? ప్రతీకార ద్వేషాగ్ని గాడిపొయ్యిపగిది గుండెలో కణకణ మండుతూండగా సుబ్బలక్ష్మి తీవ్రాతి తీవ్రంగా ఆలోచించనారంభించింది. రైలు చక్రాలంత వేగంగా ఆమె మస్తిష్కపు లేబరేటరీలో ఆలోచనల గొలుసు తిరుగుతూవుంది.

మగతగా బర్తుమీద పడుకున్న ఇందిరకు అకస్మాత్తుగా నిద్రపట్టింది.

పిల్లవాడు మెల్లగా బొమ్మ చేతపట్టుకొని బర్తుమీదనుంచి క్రిందకు దిగాడు.

గదిలో దీపం ఆర్పివేయగా చీకటి ఒక్కసారి కమ్ముకున్నట్టుగా సుబ్బలక్ష్మి లో ఆలోచించగా ఆలోచించగా ఓ దురాలోచనపు చీకటి ఒక్కసారి కమ్ముకుంది. ఆ దురాలోచనపు చీకటితో శరీరంలో ప్రతిభాగమూ పాషాణ సమమైనది. మానవత్వపు లక్షణాలు మృగ్యమైనాయి, పాపభీతి ఏములనో కిక్కురుమనకుండా తల దాచుకుంది పగ, ద్వేషం, అసూయ స్త్రీలో భయంకరంగా కోరలు చాచుకున్నప్పుడు వాటిని తీర్చుకొనే ఆత్మతృప్తి కోసం, అవకాశాల కోసం, ఆమె ఎట్లా తహతహ లాడుతోందో అట్లావుంది సుబ్బలక్ష్మి .

ప్యాసింజరు ట్రైన్ బరువుగా కేకవేసి, దుగ్గిరాల స్టేషన్ను విడిచిపెట్టింది ఆ లేడీస్ సెకండ్ క్లాసు భోగీలో ఎవ్వరూ ఎక్కలేదు.

పల్చని మబ్బు సూర్యుడి మీద నైలాన్ తెరవలె కప్పగా సాయంత్రపు ఎండ శోభకొంచెంగా తగ్గింది.

పిల్లవాడు కంపార్టుమెంటులో కింద కూర్చుని బొమ్మతో ఆడుకుంటున్నాడు, తనలో తాను తెలియని తన్మయత్వాన్ని పొందుతున్నాడు ఇందిర నిద్రబోతూనే ఉంది.

ఆ సెకండు క్లాసు బోగీ పడమటి ప్రక్క తలుపు బార్లా తెరిచివుంది.

బకింగ్ హమ్ కెనాల్ బ్రిడ్జిని దాటేందుకు బిట్రగుంట ప్యాసింజరు శక్తిని కూడగట్టుకుంటోంది.

బర్తుమీదనుంచి లేచింది సుబ్బలక్ష్మి నాపరాతిలాంటి గుండెతో నిద్రబోతున్న ఇందిరకేసి కొన్ని క్షణాలపాటు చూసింది, ఆమె నిద్రనుంచి మేల్కొనే స్థితిలో లేదని నిశ్చయించుకుంది.

పిల్లవాడు ఉత్సాహంగా ఆడుకొంటూన్న బొమ్మను తీసుకుంది సుబ్బలక్ష్మి . వాడు జాలిగా ఆమెకేసి చూశాడు : 'నా బొమ్మనెందుకు తీసుకున్నావ్ ?' అన్న ప్రశ్న ధ్వనించేదు.

ఆ బొమ్మను కొన్ని క్షణాలపాటు నిమిరింది సుబ్బలక్ష్మి .

పిల్లవాడు ఆమె చీర కుచ్చిళ్ళు పట్టుకున్నాడు ఆమెకేసి తలఎత్తి చూస్తూ 'నా బొమ్మ నాకిచ్చేయ్' అన్న భావం ద్యోతకమవుతూండగా.

ట్రైన్ చప్పుడు చేసుకుంటూ బకింగ్ హామ్ కెనాల్ బ్రిడ్జి ఎక్కింది.

సూర్యుడిని కప్పిన నైలాన్ తెరలాంటి పల్చని మబ్బు తొలిగిపోగా ఎర్రని ఎండ తెరచివున్న వాకిట్లో కొట్టవచ్చినట్టుగా పడింది.

సుబ్బలక్ష్మి ఆ బొమ్మను కంపార్టుమెంటు తలుపు దగ్గరకు విసరివేసింది. పిల్లవాడు గబగబా వెళ్ళాడు ఆ బొమ్మను తీసికొనేందుకు. క్రిందకు వంగి ఆ బొమ్మను తీసికో బోతుండగా, ఆమె కాలితో బయటకు నెట్టింది. పిల్లవాడిలో కోపం, రోషం ఎక్కువై, ముఖమంతా పండిన దొండపండు కాగా, బయట పడిపోతూన్న ఆ బొమ్మను అందుకోబోతూ రబ్బరుబూటు కాలు జారి క్రిందబడ్డాడు.

అప్పుడు ట్రైన్ బ్రిడ్జి దిగుతూవుంది.

సుబ్బలక్ష్మి పెద్దగా కేకవేసి, గబుక్కుని ట్రైన్ గొలుసు లాగింది. నిద్రబోతూన్న ఇందిర ఆ కేకకు ఉలిక్కిపడి లేచింది.

"అబ్బాయి క్రిందపడి పోయాడు. నేను లెట్రిన్ లోకి వెళ్ళి వచ్చేసరికి పడిపోయాడు_ బొమ్మను అందుకోబోతూ" అన్నది సుబ్బలక్ష్మి భయంతో అంతర్లీనమైన ఆందోళనతో.

"బాబూ!" అంటూ కెవ్వున కేక వేసింది ఇందిర.

ట్రైను మెల్లగా ఆగింది. చాలామంది జనం క్రిందకు దూకారు ముఖ్యంగా పిల్లవాడు పడటాన్ని చూసినవాళ్ళు.

బ్రిడ్జి దిగువ కావటాన అది ఎత్తైన ప్రదేశం. అక్కడ చిన్న చిన్న రాళ్ళ మీద పడ్డ పిల్లవాడు క్రిందకు దొర్లుకుంటూ వెళ్ళి టెలిగ్రాఫ్ స్తంభం ప్రక్క ముళ్ళకంచెలో ఆగాడు.

ఇందిర బిగ్గరగా యేడుస్తూ అక్కడకు వెళ్ళింది.

నెత్తురు మడుగులో కుప్పగా కూలివున్నాడు పిల్లవాడు. తలక్రిందులుగా పడటం మూలాన బుర్రచిట్లి, నెత్తురు చిన్నరాళ్ళపై చిందింది. చేతులూ, కాళ్ళూ దోక్కుపోయి రక్తం ధారలు కట్టనారంభించింది. అంత ఎత్తు ప్రదేశాన్నుంచి దొర్లటం వల్ల పాలుగారే ముఖం పండిన రాంములక్కాయ చితికినట్లయింది. వొళ్ళంతా తుమ్మముళ్ళమయం. టెర్లిన్ తెల్లచొక్కా క్రీమ్ కలర్ షార్క్ స్కిన్ నిక్కరూ నెత్తురు మరకలతో భీకరంగా వున్నాయి.

నెత్తురు చిందిన గడ్డలాగా వున్న కొడుకుని చూసి ఇందిర గుండె చెదిరిపోయింది. చనిపోయిన పిల్లవాడ్ని వొళ్ళోకి తీసికొని_బావురు మన్నది.

ఆ దారుణ దృశ్యానికి అక్కడ చేరిన ప్రయాణీకుల హృదయాలు జాలితో కన్నీళ్ళు కార్చాయి.

"ఎట్లా జరిగింది ఘోరం?"

"జారి పడ్డాడా?"

"తల్లి ఏం చేస్తూన్నది?"

"నిద్రపోతున్నదా!"

"ఇంకా ఆ పెట్టెలో ఎవ్వరూ లేరా?"

అక్కడ జేరిన ప్రయాణీకులు తలా ఒక విధంగా అనుకొని సమాధానాలు చెప్పుకోసాగారు.

అప్పటికే పదినిముషాలపాటు ట్రైన్ అక్కడాగింది సూర్యుడు తాటిచెట్ల గుంపు వెనక ఎర్రగా దిగజారుతున్నాడు.

ఆలస్యానికి గార్డు గాభరాపడ్డాడు. వెంటనే చనిపోయిన పిల్లవాడ్నీ కంటికీమంటికీ ఏకధారగా యేడుస్తున్న తల్లినీ_సెకండు క్లాసులోకి ఎక్కించి విజిల్ వేశాడు ట్రైన్ సాగారేందుకు.

ట్రైన్ బయలుదేరింది. శోకోద్విగ్న చిత్తయైన ఇందిర నరాలు తెగిపోయేట్టు ఏడుస్తూంది.

మరణించిన ఆ పిల్లవాడ్నీ, మాతృమూర్తి దుఃఖాన్నీ చూస్తున్న కొద్దీ సుబ్బలక్ష్మి లో క్రమంగా అధైర్యమూ, పాపభీతి, అశాంతీ ఎక్కువ కాసాగాయి. ఆమెను ఓదార్చేపట్టు మనస్సుకు లేకపోయింది. హృదయంలో ఓ మూల ప్రతీకారవాంఛ నెరవేరిన తాలూకు సంతృప్తి చిరునవ్వు నవ్వుతూన్నా,__ ఏదో భయం, నేరం చేసిన బెదురూ 'తనని భగవంతుడు శిక్షించకుండా వుంటాడా?' అన్న అలజడీ ఆమెలో తెరలు తెరలుగా సుళ్ళు తిరుగనారంభించాయి. వాటిని అణుచుకొనేందుకు సుబ్బలక్ష్మి శాయశక్తులా ప్రయత్నిస్తోంది.

ట్రైన్ తెనాలి స్టేషన్లో ఆగింది.

వెంటనే సుబ్బలక్ష్మి ప్లాట్ ఫారం మీదకు దిగింది. హేండ్ బాగ్ తీసికొని. ఆమె మనస్సంతా మహాగంద్రగోళంగా ఉంది! హత్యచేశాక తప్పించుకొనేందుకు హంతకుడెంతగా త్వరపడతాడో_ఆమెలో అట్లాంటి వేగం పరుగులు తీస్తోంది. పెట్టెలోంచి దిగుతూ ఆ పిల్లవాడ్నీ, తల్లినీ కూడా చూడలేకపోయింది. గబగబా స్టేషనుదాటి రిక్షాలో కూర్చుని 'నాజరుపేట పోనివ్వు' అన్నది.

సూర్యుడు ఫించినీ పుచ్చుకోవటంతో_మునిమాపు తాత్కాలికంగా ఉద్యోగంలో ప్రవేశించింది.

రణరంగ చౌకు మీదుగా, మారీసు పేటలోంచి, కొత్త వంతెనలు దాటి సత్యనారాయణ టాకీసు బజారునే, ఎల్.ఆర్.ఎమ్. క్లబ్బు ప్రక్కగా సుబ్బలక్ష్మి ఎక్కిన సైకిలు రిక్షావడిగా పోతోంది. అవన్నీదాటి వచ్చిన స్పృహలేదు. తననేరం బయట పడ్డట్టూ, తననెవరో తరుముకొస్తున్నట్టూ, ఆమెలో భయపు పొగలు పెత్తనం చలాయిస్తున్నాయి.

వేపచెట్టుక్రింద పాతడాబారాగానే "ఏయ్! రిక్షా ఆపు" అన్నది సుబ్బలక్ష్మి .

రిక్షా ఆగింది.

ఒక్క ఉదటున రిక్షాదిగి వాడిచేతిలో యాభై నయాపైసల బిళ్ళపెట్టి, చిల్లర అడగకండానే ఇంట్లో ప్రవేశించింది సుబ్బలక్ష్మి .

వీధివాకిలి మొగదల్లో వుండగానే ఆమెకు ఇంట్లోంచి ఏడ్పులు వినవచ్చాయి ప్రత్యేకం తన తల్లి యేడ్పు. ఇరుగు పొరుగు వాళ్ళు పదిమంది వరకూ ఉన్నారు. డాక్టరు శాస్త్రిగారు మెడలో స్టెతోస్కోపు తగిలించుకొని బయటికొస్తున్నారు.

ఆ వాతావరణం చూడగానే సుబ్బలక్ష్మి గుండె భయాందోళనతో గొంతులోకి వచ్చింది. నిలువునా నిశ్చేష్టురాలై నిలబెట్టిన బొమ్మలాగా నిలబడింది.

"అంతా అయిపోయింది" అన్నాడు వైద్య శాస్త్రపు అనుభవంతో వేదాంతాన్ని అలవర్చుకొన్న డాక్టర్ శాస్త్రి క్రింది పెదవి విరుస్తూ.

"మీ అమ్మాయి సాయంత్రం పెరట్లో ఆడుకుంటూ ఆడుకుంటూ వరల బావిలో పడింది. పైకితీసే సరికే ప్రాణం పోయింది. దానికి ఆయుస్సు నేటితో ఆఖరు కాబోలు!" అన్నాడు ప్రక్క ఇంటి సుందర్రామయ్య.

# కరుణకము

## వేటూరి ప్రభాకరశాస్త్రిగారు

### (భారతి - 1924 ఆగస్టు, సంచికనుంచి పునర్ముద్రితం)

కృష్ణాజిల్లాలో మొవ్వ అని ఒక గ్రామమున్నది. ఆంధ్రదేశమందు వేణుగోపాల పదాలు వినని, విని ఆనందించని, రసికులు అరుదుగా ఉంటారు. సంగీత సాహిత్యములు ఆవూరి నీరు తాగితే పట్టపడునని పూర్వము పెద్దలు చెప్పుకునే వారు. ఇప్పడట్టి దేమీ తెలియరాదు. కృష్ణ కాలువ వచ్చి ఆభూమి మాగాణి కావడముచేత నీటిగుణము మారినదని ఆక్కడి వారంటారు. కాబోలును ! పూర్వకాల మక్కడ సంగీత విద్వాంసు లనేకులు ఉండేవారట.

ఆ వూరికి చేరుకునే కూచిపూడి అని ఒక గ్రామమున్నది. ఆ వూరి వారందరు భాగవతము లాడుదురు. వీధినాటకాలలో వారిది పెటిన పేరు. సిద్ధేంద్రులని యోగీంద్రు లొకరు ఆ వూరివారికి ఆ విద్య నేర్చినారట ! పారంపర్యముగా ఆ విద్యనే వారభ్యసించవలసినట్లు కూడా విధించినారట. ఇప్పటికీ అక్కడ అట్లే జరుగుతున్నది. పయి రెండు గ్రామములు చేరువగా ఉండడముచేత, ఆ వూరి వారివిద్య ఈ వూరివారికి, ఈ వూరివారి విద్య ఆ వూరివారికి అంటుతూ కూడా ఉండేదట పూర్వకాలమున. నేనిప్పుడు చెప్పబోయే కథలోనివారు హరిరామయ్యగారొక్కరు తప్ప ఈ మధ్యకాలములో మొవ్వలో సంగీత విద్వాంసులు మరెవ్వరూ లేరు. హరి రామయ్యగారని అక్కడ ఒకరున్నారన్న సంగతి, ఆయన గొప్ప సంగీత విద్వాంసుడన్న సంగతి, ఈ కథ ముగిసిన తర్వాతనే ఇప్పటి వారికయినా తెలుస్తుంది.

రామయ్యగారు 1860 ఆ ప్రాంతముల జన్మించి ఉందురు. ఆయన పసితనమునాటికి తెలుగుదేశమున త్యాగరాజకృతు లంతగా వ్యాపించలేదట. అప్పుడు అష్టపదులు, తరంగాలు, తాళ్లపాక వారి పదాలు, తంజావూరి పదాలు మొదలయి నవి హెచ్చు పాడేవారట! మనము విని యెరుగముగాని హరి రామయ్యగారు బాల్యములో బహుప్రఖ్యాతిగా వీణవాయించేవారనీ, పాడేవారనీ, ఎరిగిన వారివల్ల విన్నాను. దీనికి నమ్మకముగా ఈ క్రింది కథకూడా విన్నాను. మైసూరు నుంచి వీణసాంబన్నగారని ఆ కాలములో ఒక మహావిద్వాంసుడు ఆంధ్రదేశముకు వచ్చి బందరు మొదలయిన చోట్ల శిష్యబృందముతో కొన్ని మాసములుండి, అనేక గాన సభలు జరిపి బహుకీర్తిని బహుధనమును సంపాదించుకొని వెళ్ళినాడట! ఆయనను గూర్చి అద్భుతముగా చెప్పకొంటారిప్పటికీ కొందరు. బందరులో ఒకసారి ఆయన గానసభ జరుగుతూ వుండగా ఒక డిప్టీ కలెక్టరు మీసములు మెలుపతూ నడుమ అందుకొని "ఆయ్యా ! ఫలానిరాగము వాయించండి" అని అడిగినాడట! అమృతవర్ష మన్నట్లు నేనీ రాగము హాయిగా వాయిస్తూ ఉంటే అనుభవించి ఆనందించలేక ఇంకేదో రాగము వాయించమంటాడేమి ఆజ్ఞుడు అని కోపించుకొని వీణ శృతి తప్పించి క్రిందపెట్టి "ఈసాంబడి పాట ఆ సాంబడు వినవలెగాని నీవు వినేదేమిటి. పో..పొ"మ్మన్నాడట సాంబన్నగారు. అటువంటి సాంబన్నగారు మన హరి రామయ్యగారి వీణాగానము విని ఆనందపరవశుడై కౌగిలించుకొని "అపారమైనది నాయనా నీ పాండిత్యము" అని అభినుతించినాడట! ఆ సాంబన్నగారిప్పుడు రామయ్యగారిని మైసూరికి పిలుచుకొనిపోయి మహారాజుగారి దర్బారులో పాట కచ్చేరి పెట్టించి గొప్ప సత్కారము జరిపించినాడట ! మహరాజుగారప్పుడు మహానందము చెంది రామయ్యగారికి రెండు నూటపదహార్లు, రెండు చేతులకు రత్నాంకితములైన కడియములు, దుశ్శాలువులు, జిలుగు బంగారు సరిగె పనిగల తలగుడ్డ, అంగీ వగైరాలు ఇచ్చి సమ్మానించినారట! ఇది మన పుట్టుకకు పూర్వపు ముచ్చట.

ఇటీవల దారిద్ర్యముచేత మురుగులజత కరిగించుకొన్నారట కాని పెట్టె చీకుళ్ళయి చిమటపోట్ల తూట్లతో ఉన్న శాలువులను, అంగీ తలగుడ్డలను, అప్పుడప్పుడు రామయ్యగారు ఎండలో ఆరబెట్టుతూ చక్కపరుస్తూ ఉండడం అనేకులెరుగుదురు. ఇంత ప్రఖ్యాత విద్వాంసుడయిన రామయ్యగారికత యిర్వైయైదేండ్లనుండి తార్మారు కాజొచ్చింది.

ఆయన కొక్కర్తే కుమార్తె. మంచి గారాబముతో కూతుర్ని పెంచినాడు. తన పాండిత్య గౌరవమునకు తగినట్టు ఉండవలెనని తాహతుమించి మంచికట్నమిచ్చి గొప్ప సంబంధము కుదిర్చినాడు. పెద్ద వైభవముతో పెండ్లి చేసినాడు. పెండ్లికి చెన్నపట్టమునుంచి గొప్ప సన్నాయిపాటగాళ్ళు వచ్చినారు. ఇంకా సంగీత విద్వాంసులనేకులు వచ్చినారు. వారికి ఆయన గొప్ప సమ్మానమలు జరిపినాడు. ఇంతయెత్తుతో వివాహము జరపడముకు తగినంత ద్రవ్యము అయన చేతిలో లేదు. మూడెకరాల మాగాణే ఆయనకున్న భూవసతి. తన పాండిత్య ప్రాభవమును విశ్వసించి, అప్పుచేసి ఆయన అంత గొప్పగా పెండ్లిచేసెను. పెద్ద పెద్దచోట్ల నాల్గు కచేరీలు జరిపి అవలీలగా అప్పుతీర్చగల్గుతానన అనుకొన్నాడు. ఆయన తలపు అట్లాఉంటే దైవము తలపు అన్యథాగా ఉండెను. పెళ్ళి అయి నెల తిరగకముందే ఆ అల్లుడు అంతరించినాడు. అయ్యో! ఆయనకథ అడ్డము తిరగడానికిదే ఆరంభము! కూతురి దుఃఖము పెద్ద కడుపుకోతగా ఆయన కేర్పడ్డ ఆ కష్టముతో మనస్సు చీకాకై చెడగా ఆయన రెండుమూడేళ్ళు ఇల్లు విడిచి పదచలనము చేయలేదు. చింతతో చివికిపోయినాడు. అప్పు పెరిగినది. పొలము మీద రాబడి బువ్వకు అంటీ అంటకుండా ఉన్నది. చిక్కులలో చిక్కు– కొన్నాడు. ఆ కాలమున ఆయన ఘనత ఎరిగినవారు సంగీత స్వారస్యము బాగా తెలిసిన వారు పలువురు ఉండేవారు. ఆయనకు కలిగిన ఆపదనుగూర్చి చింతిస్తూ తగిన తోడ్పాటు జరుపుటకు యత్నిస్తూ ఉండేవారు.

ఇట్లా ఉండగా ఆ కాలమున బందరులో ఒక గొప్ప షాహుగారింట్లో వివాహము వచ్చినది. జమీందారీ యెత్తున ఆ వివాహపు యేర్పాట్లు జరిగినవి. ప్రాజ్ఞలందరు ఆలోచించి ఆ పెండ్లికి హరిరామయ్యగారి పాటకచ్చేరీ నిర్ణయించినారు. అప్పులవాళ్ళ ఒత్తిళ్ళు చేత రామయ్యగారందుకు ఒప్పుకొన్నారు. మూడు నూటపదహార్లు ఇచ్చేటట్లు ఏర్పాటు జరిగినది. అప్పటికింకా గ్యాసులైట్లు ఆ ప్రాంతముల వ్యాపించలేదు. మదరాసునుండి అప్పుడే ఆ పెండ్లికి తొలిసారి వాటిని తెప్పించినారు. ఆ పెండ్లినాటి సాయంకాలము హరి రామయ్య గారి పాట కచ్చేరికి అనేకులు వచ్చిరి, గ్యాసులైట్లను వెలిగించిరి, రామయ్యగారు వీణ శృతి దిద్ది వాయింప నారంభించినారో లేదో వెలిగించడములో ఏదో అసందర్భము జరిగి అంతలో గ్యాసులైటు ఒకటి పగిలినది. పందిరికి మంటలు అంటుకొన్నవి. పెండ్లికుమార్తెకు మరికొందరికి ఒళ్ళు కాలి అమంగళము జరిగినది. దానితో రామయ్యగారి పాట అమంగళపుపాట అని దుష్ప్రతీతి పుట్టినది. రామయ్య గారి ప్రఖ్యాతి ముందర పేరెత్తజాలని వారెవరో సంగీత విద్వాంసులు యీ దుష్ప్రతీతిని చాటించినారని కొందరంటారు. ఎవరు చాటించినా ఆ ప్రతీతి మాత్రము ఆ వైపుల బాగా అల్లుకొన్నది. నాటినుండి సంగీత కచ్చేరీలకు ఆయన మాట తలపెట్టేవారు తక్కువయినారు. ఈ దుష్ప్రతీతి చేతనే కాక కాలపు మారపాటు చేత కూడా ఆయనకు సమ్మానము సన్నగిల్లినది.

ఇప్పుడు నేను చెప్పేది పదిహేనేండ్ల క్రిందటి మాట, పారసీఖత్తు పాటలు గల నాటక రంగాలు, జావళీలు, టప్పాలు మొదలయిన క్రొత్త రకపు సంగీతము, ఫిడేలు, హార్మోనియము మొదలయిన క్రొత్త రకపు జంత్రములు వెలసినవి. వాటిమీద మోజు యెక్కువయి ప్రాచీనపు జంత్రములమీద ప్రాచీన గానఫణుతుల మీద ఆదరము బీదపడినది. 'క్రొత్త వింత, పాత రోత' అన్నమాట ఉన్నదిగదా! రామయ్యగారు అది, పిదప కాలపు సంగీతమని చాటుచేయక చాటిచెప్పుతూ ఉండేవారు. సంగీత స్వారస్య మెరిగినవారు ఆయన మిత్రులు ప్రాచీనులు పలువురు అంతరించిరి. క్రొత్తకారు కుఱ్ఱరకమునకు ఈయాన మాటలు హేయములుగా తోచుచుండెను అందుచేత కూడా ఈయన గౌరవము కొంత అంతరించినదని చెప్పవచ్చును. ఏది యెట్లున్నా ఆయన తన పాండిత్య విశ్వాసమును కోల్పోలేదు. వయసు మీరినవాడయినా తాను ప్రతి దినము సాయంప్రాతఃస్సమయములందు సంగీత సాధన మానేవాడు కాదు. ఊరిబయటికి పోయి వృక్షాలకు పక్షులకు, పుట్టలకు గట్టులకు, శిశువులకు పశువులకు, దినదినము తన పాట వినిపిస్తూ ఉండేవాడు. అప్పటికి యాభై, యాభైయయిదేండ్ల వాడయినా ఆయనకు పలు వరుస వేరువాయక గొగ్గి లేక తీరుగా ఉండేది.

దైవము ప్రతికూలముగ ఉంటే బంగారము కూడా పదడవుతుందంటారు. ఒకనాటి తెల్లవారు జామున వీణసాధనకు గౌసెన ఊడదీస్తూ ఉండగా ఆయన కుడిచేతి చూపుడు వేలికి, నడిమివ్రేలికి, మండ్రగబ్బ కుట్టెను. ఆయన వారము రోజులు దానితో అవస్థ పడ్డాడు. ఆ రెండు వేళ్ళు చివరకు బండబారి వంకర పోయినవి. ఆయన వీణావాదన శక్తి అంతటితో అంతరించినది. ఆయనకు దురదృష్ట పరంపర మిక్కిలి దుర్భరముగా సాగుచున్నది గదా! అప్పుల

క్రింద ఇల్లూ వాకిలి, భూమి పుట్ర, చెల్లిపోయినవి. ఆలు మగడు కూతురు ఈ ముగ్వురికి, మొవ్వలో బువ్వకు గడవడమే కష్టసాధ్యమైనది. దారిద్ర్య దేవత పూనినదంటే అన్ని యోగ్యతులును మన్నయి పోతవిగదా! ఆయన సంగీతమన్నా, ఆయన మాటలన్నా ఆ చుట్టుపట్టుల వారందరికి వేళాకోళము క్రిందికి వచ్చినది. ఆయన చేత మైసూరు ప్రయాణపు కథలు అప్పటి పాట కచ్చేరీ కథలు పని పాటల లేని సమయములందు యెప్పడయినా చేస్తూ వారు వారు వేళాకోళపు పొగడ్తలు పొగడుతూ ఉండేవారు. ఆత్మ వైదుష్యమందు అతివిశ్వాసముగల ఆ అమాయకుడు, నిజముగానే తనను సమ్మానిస్తున్నారని సంతోషిస్తూ ఉండేవాడు.

పదిపంద్రేండేళ్ళ క్రిందటి మాట చెప్పుతున్నాను ఆంధ్రదేశమందు నాటక సమాజములు పేట్రగినవి. నాటకులలో అభినయమును గురించి, గానమును గురించి, స్పర్థలు, పోటీ పరీక్షలు జరుగుతున్నవి. టాలాటోలీ అభినయము, టప్పాపాటలు, సంకర సంగీతములు, రూపుమాపి శాస్త్రీయ పద్ధతుల మీద సంగీత కళను నాటక కళను సాగించవలెనని కొందరు గందరగోళము చేస్తున్నారు. పత్రికలలో వారు వీరు ఈ విషయముల మీద వ్యాసములు వ్రాయ నారంభించినారు. ఈ వార్తలు మొవ్వ రీడింగు రూములో కుఱ్ఱవాళ్ళు చదువుతూ ఉండగా రామయ్యగారు వింటూ ఉండేవారు. నిజముగా అటువంటి విమర్శనము పుట్టితే తన పాండిత్యము ప్రఖ్యాతికి రాగలదని ఆయన బులపాటపడుతూ ఉండేవాడు. బెజవాడలో నూజివీటి రామారాయణంగారు క్రొత్తగా ఒక సంగీత సభ నెలకొల్పినారనిన్నీ అందులో శాస్త్రీయమైన కర్ణాటగానమే గాని పార్సీ పాటలు మొదలయిన సంకర సంగీతములు ఉండవనిన్నీ అట్టిది నేర్పడముకు తగిన సంగీత విద్వాంసులు కావలసి ఉన్నారనిన్నీ, వారు నాటకకళ కూడా పెంపొందించేటందుకు యత్నిస్తున్నారనిన్నీ, ఆ సంగీత విద్వాంసులు అభినయ విద్యకూడా ఎరిగినవారై ఉంటే మరీ మంచిదనిన్నీ అట్టివారు బెజవాడలో శ్రీ రాజాగారిని దర్శింపదగుననిన్నీ ఒకనాడు పత్రికలో ప్రకటన ఉండగా రీడింగరూములోని కుఱ్ఱలు రామయ్య గారికి తెలిపిరి. సంగీతమందు అభినయమందు తనకంటే సమర్థుడు వేరొకరు లేడనిన్నీ తాను వెళ్ళితే తప్పక గౌరవిస్తారనిన్నీ ఆయన తలచను, మర్నాడే సకుటుంబముగా బెజవాడకు ప్రయాణమయి వెళ్ళెను. సంసార సామగ్రి వారికి ఆట్టేలేదు. వండుకొనే గిన్నె, త్రాగే చెంబు మొదలయినవి నాల్గయిదు పాత్రలు, మైసరులో ఇచ్చిన తలగుడ్డ, అంగీశాలువులు. ఇదే సామాను.

ముఖమెరుకగల ఒక పేదరాలు పెద్దమ్మ యింట్లో వారు బస చేసిరి. మంచిరోజు చూచుకొనే వచ్చినారు గనుక రామయ్యగారు బెజవాడ చేరిన మర్నాడే పొద్దుటిపూట శ్రీరాజా గారి దర్శనము చేయబోవడముకు ముస్తాబు అయినారు. ఆయన కెప్పడో ఇరవై యేళ్ల ప్రాయమప్పడు మైసూరు సంస్థానమున ఇచ్చిన దుస్తులు అప్పటి ఆయన ఆకారపుష్టికి సరిపడే ఉండునుగాని అరవైయేళ్ల ప్రాయమప్పడు ధరించబోతే ఎవరివో పాతవి యెరువు తెచ్చుకొన్నాడు కాబోలును అనిపించేటట్టు ఉన్నవి. వదుల్లయి వేలాడుతున్న దస్తులలో ఆయన మునిగిపోయినాడు. అందులో బహువత్సరములనుంచి పెట్టెచీకుల్లయి చిమట పోట్లుబడి వెలిసి ఉండడము చేత మరీ వికారముగా ఉండెను. ఈ సంగతి ఆయనకు తోచలేదు. ఆయన దృష్టికి అవి ఆనాటి మైసూరి సమ్మానమును స్మరింపజేస్తూ ఉత్సాహజనకముగానే ఉండెను. మైసూరికి వెళ్లినప్పటితీరుగా ఒక నిమ్మపండు, కుంకుమాక్షతలు పుచ్చుకొని శకునపరీక్ష చేసి ఎంతసేపటికీ మంచి శకునము కుదరకపోగా, పట్నవాసాలలో శకునాల పాటింపు పని లేదనుకొని ఆలస్యమైతే వర్జ్యము వస్తుందన్న తొందర చేత సాహసించి ఆయన బైలుదేరెను. శ్రీరాజాగారి బంగళా చేరి బంట్రోతులను బతిమాలుకొని లోనికి పోయి రాజాగారిని దర్శించి తన కథ విన్న వించుకొనెను. రాజాగారు మంచి రసికులు, సరసులు; అయినా, ఆ బ్రాహ్మణుని వయస్సు వేషము ప్రథమ దర్శనమందే వారికి పరిహాస్యతను కూర్చెను ఆ పైని ఆయన చెప్పిన మాటలున్నూ ఆందుకు తగినట్టే ఉండెను. పిదపకాలపు సంగీత మని సంకర సంగీతమని ఆప్పటి గాయకుల సంగీతమ నాయన గర్హించెను. ఫిడేలు, హార్మోనియము, మొదలయిన జంత్రములను చెడనాడెను. తాను ప్రాచీనమైన శుద్ధకర్ణాటమును పాడగలననిన్నీ తన తోడ్పాటు చేత శ్రీవారు స్థాపించిన గాయక సంపుము నాటక సంఘము ప్రఖ్యాతికి రాగలవనిన్నీ అమాయకముగా చెప్పెను. రాజాగారది విని వెడనవ్వు నవ్విరి, 'సరే నేడో రేపో మీరు మా సంగీతశాలకు పోయి అక్కడ గాయకులు నటులు ఉంటారు వారిని కలుసుకొని మాటాడండి, తర్వాత మీ విషయము ఆలోచించి చెప్పుతాము' అని చెప్పిరి. వృద్ధ బ్రాహ్మణుడు వచ్చినాడుగదా అని మూడు రూపాయలు యియ్య బోయిరి దారిద్ర్యపు బరువు తలమీద ఉన్నప్పటికీ, ఒక్క పూట పస్తయినా పండుకొన్నాడు గాని ఆయన ఇంతవరకూ బిగలాపడి యెవ్వరిన యాచించి యెరుగడు. అయితే పెద్దసభ కావలెను, పెద్దసమ్మానము జరుగవలెను. అనియే ఆయన తలపోత; కాని చిలిపి యాచనల కాయన చేయి ఒగ్గేవాడు కాదు. అవసరము మాత్రము అర్థణా యిచ్చినా అదే పదివేలని పుచ్చకోదగినదిగనే ఉన్నది. ఆపూట భుక్తికి ఉన్నదో లేదో! "సంగీత శాలలోని వారిని కలుసుకొంటాను గదా ! తమరు వారితో సంప్రతించి సంగీత పండితస్థానము దయ

చేయిస్తామన్నారుగదా ! ఇంతలో ఇది యెందుకులెండి ? నేనిందుకోసం వచ్చినవాణ్ణి గాను" అని విన్నవించి లేచి వచ్చినాడు. నాడే రాజాగారు సంగీతశాలకు వచ్చి యీకథను నవ్వుతూ చెప్పి అక్కడి వారిని నవ్వించిరి.

మర్నాడు రామయ్యగారు ఆ వేషముతోనే సంగీతశాలకు వెళ్లిరి, అక్కడివారు తనకు హద్దుమీరి చేసిన ఆదరము నిశ్చయముగా తన గౌరవము గుర్తించి చేసినది గానే ఆయన తలచుకొన్నాడు.

"అయ్యా మీకు మైసూరు మహారాజుగా రిచ్చేటప్పడే ఉన్నయ్యా దుస్తులకీచిమట పోట్లని – వారు కుట్టించేటప్పుడు మీ శరీరము కొల్త తీసుకోలేదు నని – పెద్దలైనారు గనుక శరీరము కృశించినదిరా అని – అయితే అప్పటి పాటకు కూడా కృశింపే ఉంటుందేమోనని – కొంచెము పాడించి చూస్తే తెలుస్తుంద"ని. తలకొకమాట చొప్పున నలుగురూ పగలబడి మాటాడిరి. "చిత్తము మైసూరు విద్వాంసులు ! ఒక కీర్తన పాడండి బాబూ!" అంటూ హార్మోనియమ శ్రుతి సాగించెను 'ఇస్సీ ! నేను పాడను, మంచి తంబూరా శ్రుతి ఉండవలెనుగాని పాడు మోత హార్మోనియము శ్రుతి పనికిరాద'ని ఆయన గర్జించెను, వారందరు ఆయనచే పాడించి తాళం పట్టించదలచుకొన్నారు గాని తంబూరా లేకపోవడము చేత అది సాగలేదు. "తాతగారు మరొకనాడు దయచేయండి. తంబూరా తెప్పించి పెట్టుతాము" అనిరి. "మోటు శ్రుతి హార్మనీ సన్నవడి గాత్ర పాటకు పనికి రాదు నాయనలారా ! ఆ శ్రుతి మానివేయండి. మీకు దివ్యమైన కర్ణాటగానము నేర్పుతాను. మరు కుఱ్ఱవాళ్ళు, కాగల వాళ్ళు. నేను పెద్దవాణ్ణయినాను. నా విద్య మీ దగ్గర నాటిపోవలెనని ఆశ ఉన్నది. శ్రీరాజా గారితో మనవి చేస్తే మీతో ఆలోచించి సెలవిస్తామన్నారు. నావల్ల మీకు ప్రఖ్యాతి వస్తుంది. అనుకూలంగా చెప్పండి. నా సంగతి నా పాట ఒకసారి వింటే మీకే తెలుస్తుంది" అని చెప్పి రామయ్యగారు మరొక నాడు తంబురా శ్రుతిమీద పాడుటకు నిశ్చయించుకొని యింటికి వచ్చిరి. తర్వాత రెండు మూణ్ణాళ్లు రాజాగారి దగ్గరకు సంగీతశాలకు, తిరిగినారు. కాని రామలక్ష్మణులు శూర్పణఖను త్రిప్పినట్లు అక్కడినుండి యిక్కడికీ యిక్కడినుండి అక్కడికీ త్రిప్పుటే గాని పాట వినే యేర్పాటు వారు చేయలేదు.



బెజవాడ తూర్పువైపున బందరు రైలు దారి ప్రక్కనున్న పెద్ద పవ్వుల తోటలో ఒకనాడు సాయంకాలము నాలుగు గంటలవేళ పది పన్నెండేళ్ల ప్రాయము గల బాలిక లిద్దరు పూలుకోస్తూ చెళ్ళు కట్టుకొంటూ ఉండిరి. ఆ తోటలో పెద్ద సంపెంగపొద జీబుగా అల్లుకొని ఉన్నది, సన్ననితోవ ఒక్కటే దానిదగ్గరకు ఇరుకుగా ఉన్నది. దూరానికీ కూడా గమగమలాడుతూ వెలగపళ్ళవాసన గలిగి ఆ సంపెంగ పువ్వుల సుగంధము ముసురుకొని ఉన్నది. ఆ చెట్టునే కొందరు మనోరంజితమనీ, సకల ఫల సంపెంగ అని, పొద సంపెంగ అనీ పేర్కొంటారు. ఏ పండు తలపుకు వస్తుందో ఆ పండువాసన ఆ పువ్వుకు ఉంటుందంటారు. కవులు నాసికోపమానముగా వర్ణించే చంపక పష్పము అది కాదు. ఆ పువ్వు చెట్టు పెద్ద వృక్షముగా పెరుగును. విశాఖపట్టణము జిల్లాలో అది హెచ్చుగా ఉన్నది. వాల్తేరు స్టేషన్లో దాని పూవులు అనటిపొత్తులలో పెట్టి కట్టి అమ్ముతారు. ఈ పరిశీలనమిక విడుస్తాను–ఆ కన్య లిద్దరు పుష్పలోభముచేత ఆ పొదదగ్గరకు వెళ్లిరి. ఒక పూవురెమ్మ కదల్చినారో లేదో రెండు త్రాచు పాములు పొద క్రిందనుండి ఆ కన్యల కిరు ప్రక్కలా ఎదుర్కొని పడగలెత్తి బుసకొట్ట సాగించెను. వాటిని చూచి ఆ కన్యలు గగ్గోలు పడి అరచిరి. సంగీత సాధనకు రామయ్యగా రప్పుడా పక్కకే వచ్చి ఉండిరి. అరపువిని ఆయన చేరబోయి భయపడవద్దని వారికి చెప్పుతూ అట్టె కూర్చుండి పున్నాగ రాగము ఆలాపన చేయ నారంభించెను బుసకొట్టుతూ ఆ కన్యలమీదికి దుముకుతూ ఉన్న త్రాచులు రెండూ పడిగలార్చి హాయిగా ఆడుతూ రామయ్యగారిని చేరటోయెను. అపాయము తప్పి ఆ కన్య లిద్దరూ అటునుండి తొలగిపోయి దూరాన రామయ్య గారి నేర్పు తిలకిస్తూ ఉండిరి. ఆనందపరవశుడై రామయ్యగారు అరగంటసేపు నాగరాజుల యెదుట రాగాలాపన చేసిరి, ఆ కన్యలున్నూ సంగీతము నేర్చుకొంటున్నవారే గనుక ఆయన గానమాధుర్యమును ఆప్యాయముగా ఆస్వాదించిరి. రామయ్యగారు నాడు మైసూరు మహారాజుగారి దగ్గర

పాడి ఎంత ఆనందించిరో నేడు నాగరాజుల దగ్గరపాడి అంత ఆనందించిరి. అటు తర్వాత షడ్జ శ్రుతి మీద ఏదో ఆలాపన చేయ నారంభించగా సర్పములలు సరసర దూరముగా పారిపోయెను ఆ కన్యలు చేరవచ్చి "తాతగారు ! మీరు మహానుభావులు ! మీ పాట అద్భుతమైనది ! కాటు వేయనున్న పాములను పాట చేత మెప్పించి మా ఆపద తప్పించినారు" అని మెచ్చుకొని తా మంతకుముందు కట్టిన పెద్ద పూవుల చెండును ఆయనకు బహుమానముగా ఇచ్చి నమస్కరించి ఇంటికి కొనిపోవుటకు మరికొన్ని పూవులను కోసుకోబోయిరి.

"నేడు నాకు శుభదినము. జమీందారుగారు నాకీవేళా ఉద్యోగము ఏర్పాటు చేస్తారు. ఇప్పటికథ దానికి సూచకమే" అని ఆనందించి తాను బహుమానముగా పడసిన పూవులచెండును జమీందారుగారికి కానికగా అర్పించుట కాయన వడివడిగా బయలుదేరెను వారు వెళ్ళేసరికి జమీందారుగా ఎవ్వరితోనో మాట్లాడుతూ ఉండిరి. రామయ్యగారిచ్చిన పూవులచెండును పుచ్చుకొని "సరే! సంగీతశాలకు పొండి. మీ విషయము నేడు ఫయిసలవుతుంది. అక్కడి సభికులు తెలుపుతారు" అనిరి. మరి మాటాడుటకు ఎడమియ్యలేదు. "మరొక పెద్దమనిషితో మాట్లాడుతున్నారు గనుక అవకాశము లేదు అధికము ప్రస్తాపించడానికి" అనుకొని రామయ్యగారు బైటికివచ్చిరి. లేకుంటే తోటలో జరిగిన నాటికథను చెప్పే ఉండేవారు. జమీందారుగా రన్నమాటనుబట్టి తనకు జీతము వగైరాల విషయము సంగీతశాలకు వెళ్ళి తెలుసుకొమ్మన్నారని అనుకొని కాలాచకుండా ఆదరాబీదరా ఆయన అక్కడికి వెళ్ళెను. సభికులను సందర్శించెను. అక్కడి వారానాడు వ్యంగ్యపు వేళాకోళము విడిచి బాహాటపు పరిహాసములే ఆరంభించిరి. "వెఱ్ఱిబ్రాహ్మడా ! నీవు వచ్చి మా కిక్కడ గురుత్వము నెరపుతావుగా తాతవు! నీపాట ఎవరికి కావలెను! నీకు హార్మోనియము పనికిరాదుగద! ఎవళ్ళ యిళ్ళలోనయినా అటకల మీద పాత తంబురాలు వ్రేళ్ళాడగట్టి ఉంటవి. అలాగంటిదేదో ఒకటిన్నీ దానితో పాటు పెద్దది అక్షయపాత్ర ఒకటిన్ని సంపాదించుకొంటివ భేషయిన వుద్యోగమవతుంది నీది. నీకిక్కడ ఉద్యోగమేమిటికి గనుక! చక్కగా మేము చెప్పినది సాగించుకో, పో, పాపము, చాలా సార్లు తిరిగినావు." అని అందులో ఒక మొనగాడనెను. అందరు అట్టే అవహేళనము చేసిరి రామయ్యగారు ఆల్లడు అంతరించి నప్పటికంటె వేయిరెట్లు హెచ్చుగా విరిగిపోయినారు. నోరు తడబడెను. కాళ్ళు గడగడలాడెను. కన్నులనీరు క్రమ్మెను, ఆడు గానలేదు. మొగాన ముసుగు వేసుకొని కాళ్ళీడ్చుకుంటూ ఇంటికి కదలినారు. తోటనుండి జమిందారుగారింటికి, అక్కడనుండి సంగీతశాలకు, సరసర నడిచివచ్చిన రామయ్యగారిప్పుడు ఇల్లుచేరు కొనేది యేలాగో దైవమా అని తల్లడిల్లుతూ తప్పటడుగులు వేస్తూ నడుస్తున్నారు.

ఇంతకుముందు పూలతోటలో త్రాచుబాముల బారినుండి రామయ్యగారు సంగీతముపాడి సంరక్షించిన కన్యలు మన జమీందారుగారి కుమార్తెలే, ఆతోటలో వారు మరికొన్ని పూలు కోసుకొని చెళ్ళుకట్టుకొని ఇంటికి వచ్చిరి. తోటలో జరిగిన ఆపద కథను వారు తండ్రిగారితో చెప్పిరి. జమీందారుగా రాశ్చర్యము చెంది అట్టి గట్టివిద్వాంసుడు ఉంటే మన సంగీతసభలో ఉద్యోగమిత్తునుగదా! అని ఉప్పొంగిరి, ఆయనను విచారించి తప్పక సత్కరించవలసినదని ఆకన్యలు తండ్రిగారిని వేడుకొనిరి, మరిన్నీ ఆయన పున్నాగరాగపు పోకడలు అద్భుతముగా ఉన్నవని తామూ సంగీతము నేర్చుకొంటున్నవారే గనుక వివరించి చెప్పిరి. జమీందారు గారు వారినిగూర్చి విచారించి సత్కరిస్తానని చెప్పి ఆపద తప్పి వచ్చిన కుమార్తె లను ఆదరముతో ఒడిలోనికి చేరదీసుకొనిరి, చేరబోయి ఆ బాలికలు టేబిలుమీద పెట్టివున్న పూల చెండును జూచి యిది యెట్లువచ్చినదని అబ్బురముతో అడిగిరి. "ఒక వెఱ్ఱి బ్రాహ్మడు తాను పెద్ద సంగీత విద్వాంసుడనని తనకు ఉద్యోగమిప్పించ వలసినదని వారము రోజులనుండి వచ్చి చెప్పకొంటున్నాడు. నేడీపూలచెండును కొనుక్కువచ్చినాడు గాబోలును కానిక తెచ్చినాడు, సంగీతశాలకు పొమ్మన్నాను. అక్కడ సాంఘికులతో ఆశపెట్టుకోవద్దని చెప్పవలసినదని చెప్పినాను. చేదస్తపు బ్రాహ్మడు," అని జమీందారుగార నిరి. "నాన్నాగారూ! ఈచెండు మీకు తెచ్చిన వారే మమ్మీవేళ సంరక్షించినవారు, ఈచెండు మేమే యిచ్చినాము, ఆకారము అట్లా ఉన్నదిగాని ఆయన అఖండ విద్వాంసుడు," అని ఆకన్యలు సర్వము సవిస్తరముగా తెలిపిరి, జమీందారుగారు నాలుక కొరుక్కొన్నారు. "అయ్యో! వేషము చూచి వేళాకోళము చేసినాము గాని పాటతీరు ఒకతూరి అయినా పరికింపకపోతిమే" అనుకొన్నారు. కుమార్తెలు తొందరపరచగా "కోచిబండిమీద సంగీతశాలకు వెళ్ళి ఇన్నూరు రూపాయలిప్పుడు బస ఖర్చుకింద వారికి ఇచ్చి రేపటెల్లుంట పాటకచ్చేరీ పెట్టిస్తున్నామనీ నెలకు యాభై రూపాయలకు తక్కువకాని జీతము వెంటనే ఏర్పాటు చేస్తున్నామనిన్నీ చెప్పిరావలసినద"ని కుమార్తెలతోననిరి. నూరు రూపాయల నోట్లు రెండు వారి చేతికిచ్చిర. వెంటనే కోచి కట్టించి ఆ కన్యలు సంగీతశాలకు వచ్చినారు గాని అప్పటికే జరుగవలసిన మర్యాదలు జరగడము, కాళ్ళీడ్చుకొంటూ ఆయన

ఆక్కడనుండి కదలి వెళ్లడము ఆయెను. సంగీతసభికుల కాకన్యలు యావద్వృంత్తాంతము చెప్పిరి. ఎల్లరు తెల్ల మొగాలు పెట్టిరి. రామయ్య గారి బస ఎరిగిన వాడందులో ఒకడు మనసు నీరై ఆ కన్యలతో కోచి బండి మీద బయలుదేరెను. వడి వడిగా వచ్చి గడె వేసి ఉన్న రామయ్య గారి బసతలుపును వారు తట్టిరి.

గుండెదడ, దప్పి, కడుపులోమంట, నాలుక పొడారిపోవడము, కళ్ళు చీకట్లుకమ్మడము మొదలయిన వికారములతో అతికష్టపడుతూ అప్పటికి నాలుగు మూడు నిముషముల క్రిందనే ఆయన యిల్లుచేరెను. "అమ్మా! నాలుక ఈడ్చుకొని పోతున్నది. సత్తుగిన్నెడు తేట మజ్జిగ దాహానికిస్తావా!" అని గోడకు చేరగిలబడి కూర్చుండి కుమార్తెను పిలిచి రామయ్యగారడిగిరి ఆమె ఆయన అలసటను చూచి తొందరతో తేట మజ్జిగ తేబోయెను. పాపము! పండుముత్తైదువ ఆయనభార్య చింపి విసనకఱ్ఱ చేతపుచ్చుకొని చెమటలు కక్కుతూ ఉన్న ఆయన శరీరమును సేదదీరేటందుకు విసరుతూ ఉండెను. తొందరపాటతో తలుపుతట్టుతూ "రామయ్యగారు! రామయ్యగారు!" అని పిలుస్తూ ఉన్న బైటివారి పిలుపును విని ఆయనభార్య "యెవరువా"రని అడిగెను. "సంగీతసభనుండి జమీందారు గారు పంపితే వచ్చినా మండీ" అని బైటివారు చెప్పిన బదులు విని ఇస్సీ అని రామయ్యగారు విసుగుకొనిరి అంతలో, లోనుండి తేట మజ్జిగ తెచ్చి తండ్రిదగ్గర పెట్టి బైట యెవరో పిలుస్తున్నట్టు విని కుమార్తె తలుపుతెరచి వేలుపలనున్న వారిని పలుకరించెను. ఆ కన్యలతో వచ్చిన సభ్యుడు "ఆమ్మా! వీరు జమీందారువారి కుమార్తెలు. జమీందారుగారు రామయ్యగారికి ఇప్పటి ఖర్చుకింద ఇన్నూరు రూపాయలిచ్చి రమ్మన్నారు. వెంటనే ఉద్యోగము ఏర్పరుస్తామన్నారు. ఇది విన్నవించి పోవచ్చినాము!" అని చెప్పెను, పాపమామె తన తండ్రికి కష్టకాలములో భగవంతుడు కన్ను తెరిచినాడని సంతోషించి లోపలికి రండని వారిని పిలిచి తలుపు బార్లగా తెరచెను. అప్పుడు రామయ్యగారు మజ్జిగ త్రాగుటకు సత్తుగిన్నె ఎత్తి పట్టుకొని ఉన్నారు. ఇంకా త్రాగలేదు. అంతలో ఆ కన్యలు చేరబోయి నమస్కరించి



"ఆయ్యా ! పూలతోటలో మీరు రక్షించినది మమ్మే, మేము జమీందారుగారి కుమార్తెలము ఆ కథంతా విని వారు నొచ్చుకొన్నారు. మీకు ఇప్పటి ఖర్చు క్రింద ఇన్నూరు రూపాయలు ఇచ్చి రమ్మన్నారు పాటకచ్చేరీ పెట్టించి వెంటనే ఉద్యోగం ఏర్పాటు చేస్తామన్నారు." అంటూ ఆ నోట్లు, తాము తర్వాత కట్టుకు తెచ్చుకొన్న పూల చెండు రామయ్యగారి ఒడియందుంచిరి. రామయ్యగారది విన్నారో లేదో గాని "ఆ ఆ" ఆని నోరు తెరచి అట్టే తేరజూచి కన్నులు తేల వేసిరి. సత్తుగిన్నె చేతనుండి జారి నేలబడెను. గోడకు చేరగిలబడి ఉన్న శరీరము నేలకు బోరగిలబడెను. తల్లి కూతుళ్ళు తొందరపడి మళ్ళీ మజ్జిగ తెచ్చి తెరచుకొని ఉన్న నోటిలో పోసి చూసినారు గాని గుటక పడలేదు, ఒళ్ల పట్టి చూచి సంగీత సభ్యుడు కళ్ళ నీళ్ళు విడిచెను. "అయినదమ్మా రామయ్యగారి కథ అయిన" దనెను. అంతలో ఆవురుమనుచున్న రాజకన్యల నాదుకొని ఆతడు బైటికి తెచ్చెను.

ఆ యిన్నూరు రూపాయలు రామయ్యగారికి ఆపర కర్మమున కయి ఉండును.

# సమస్య

## వి.ఎస్.అవధాని

(ఆంధ్రజ్యోతి - 1952 ఆగస్టు, సంచికనుంచి పునర్ముద్రితం)


సమస్య

మానవులు రకరకాల దుస్తులు ధరిస్తు న్నారు. విభిన్నరుచులకు అలవాటు పడుతున్నారు. ఇదివరకు కనీ వినీ ఎరుగని వాహనాలను వినియోగిస్తున్నారు.

తలవని తలంపుగా అన్నయ్యకోసం నేను కోర్టుకు వెళ్ళాను. అన్నయ్య అప్పుడు యేదో పనిమీద కోర్టులో విచారణజరిగే హాలులోనే వున్నాడు. అనుకోకుండా

మానవులు రకరకాల దుస్తులు ధరిస్తున్నారు. విభిన్న రుచులకు అలవాటు పడుతున్నారు. ఇదివరకు కనీ వినీ ఎరుగని వాహనాలను వినియోగిస్తున్నారు. ఇదంతా చూచి అర్ధమయినంత వరకు వాటిని తెలుసుకొని, కాలం మారింది అంటున్నాం.

కాని, మూర్తి మాత్రం మారలేదు. ఆనాడు తప్పు చేసినప్పుడు ప్రిన్సిపాల్ యెదుట యెంత నిర్భయంగా, యెంత నిశ్చలంగా నిలబడ్డాడో ఈనాడు న్యాయస్థానంలో న్యాయమూర్తి యెదుట కూడా అలాగే నిలబడ్డాడు. అకస్మాత్తుగా బోనులో మూర్తిని ఎవరైనా చూచినట్లయితే అసలు ఆ మనిషిలో మానవునికి సహజంగా వుండాల్సిన లక్షణాలేమన్నా వున్నాయ్యా అనే అనుమానం కూడా కలుగుతుంది.

మూర్తి తరపున వాదించేందుకీనాడు న్యాయవాది లేడు. ఆనాడు కాలేజీలోనూ అంతే. ఆనాడు తప్పుచెయ్యలేదు అని చెప్పేవాళ్ళు అటు మాస్టర్లలోగానీ యిటు మాలోగానీ యెవరూ లేరు. ఆనాడు నవ్వుతూ కాలేజీకి స్వస్తి చెప్పాడు. మరి ఈనాడో...

తలవని తలంపుగా అన్నయ్యకోసం నేను కోర్టుకు వెళ్ళాను. అన్నయ్య అప్పుడు యేదో పనిమీద కోర్టులో విచారణ జరిగే హాలులోనే వున్నాడు. అనుకోకుండా న్యాయమూర్తిని చూచాను. పరధ్యానంగా మూర్తిని చూచాను. ఇద్దరూ చిన్ననాటి స్నేహితులే. న్యాయమూర్తి అడుగుతున్నాడు .. నేను ఆదుర్దాగా కాదు; కుతూహలంతో వింటున్నాను.

"ఈ విషయంలో మీరేమైనా చెప్పుకుంటారా?"

"చెప్పుకోను, చెప్పుకోనూ లేను. ఒకవేళ అలా చేద్దామని ప్రయత్నించినా, నా నేరం యింకా ధృవపడుతుందే కాని తగ్గదు"

"లాయరునెందుకు పెట్టుకోలేదు?"

"లాయరు... ఎందుకు ! అదో ఖర్చు."

"మీరు చాలా ఆస్తి సంపాదించారు కదా?"

"అవును"

"అటువంటప్పుడు న్యాయవాదిని పెట్టుకుంటే..."

న్యాయమూర్తి ముఖం చిట్లించాడు. తల పంకించాడు. కొంచెంసేపాగి

"హత్య అంటే యేమిటో మీకు తెలుసా ?"

"తెలియకనేమండీ ! చక్కగా తెలుసు తెలియకుండానే లీలను నేను చంపానంటారా ?"

"హత్య నేరమనీ, మీవంటి విద్యాసంస్కారాలు గల మనిషి చెయ్యరాదనీ మీకు తెలుసా ?"

"తెలుసు... కాదు... తెలిసీ తెలియకుండా వున్నది."

"లీల అనే యువతిని మీరు ప్రేమించే పెండ్లాడారు గదా ?"

"నేను సామాన్యఖైదీని. నేరస్థుణ్ణి... హంతకుణ్ణి. ఆ దృష్టితోనే మీరు నన్ను విచారించాలి. మర్యాదగా "మీరు" అని నన్ను అనడం యేమంత బాగాలేదు. అది అలా వుంచండి. ప్రేమించే పెండ్లి చేసుకున్నానో కామించే పెండ్లి చేసుకున్నానో నాకు తెలియదు. అది యీనాటి సంగతి కాదు. గుర్తు చేసుకుందామన్నా నాకిప్పుడు గుర్తురాదు. మా సంసార జీవితం ఫలితంగా ముగ్గురు పిల్లలు పుట్టారు. అయినప్పుడా పెండ్లి ఎలా జరిగిందో చెప్పవలసిన అవసరం ఏమీ లేదనుకుంటాను."

"సరే... ఆస్తి సంపాదనకు మీరు అదేదో దేశం వెళ్ళినప్పుడు మీ భార్య కూడా మీ వెంట వచ్చిందా ?"

"వచ్చింది"

"మీతో ఆమె అక్కడ ఎంతకాలం వున్నది?"

"రెండేళ్ళున్నది"

"ఆ తరువాత ?"

"ఈ వూళ్ళో నేను కొన్న... కాదు నా పేర ఆమె కొన్న మా యింట్లో, ఆమె పిల్లలతో కాపురముండేది."

"ఆ దేశంలో ఉండటం ఇష్టం లేదని ఆమె మీతో చెప్పిందా ?"

"చెప్పింది. నేను ఆమె సలహాలు వినలేదు. నాకు తోచిన పని చెయ్యడమే అలవాటు. నేను ఈ వూళ్ళోనే చదువుకున్నాను. నా చిన్నతనమంతా ఈ వూళ్ళోనే గడిచింది. ఈ వూళ్ళోనే లీలను నేను పెండ్లి చేసుకున్నాను. అటువంటి ఈ వూళ్ళోనే ఒకానొకప్పుడు తినటానికి తిండి లేక మేమిద్దరం కొన్నాళ్ళు వుపవాసాలున్నాం. ఆ తరువాత అక్కడికి వెళ్ళి చాలా సంపాదించాను. అక్కడ ఖర్చులు తక్కువ. జీవితంలో ఆడంబరమనేది అక్కడలేదు. నాకు నేనుగా బీడు కొట్టివేసి గింజలు చల్లాను. మొక్కలు నాటాను. ఆ నా కష్టమంతా అక్కడే ఫలితానికి వచ్చింది..."

"అదంతా అలా ఉంచండి. అక్కడికి వెళ్ళే విషయంలో మీ యిద్దరిమధ్యా అభిప్రాయభేదాలు వచ్చినయ్యా?"

"నేను లీలకు చెప్పి అక్కడకు వెళ్ళలేదు. అక్కడికి వెళ్ళిన తరువాత లీల సంగతే నేను మరచిపోయినాను. నేను అక్కడ ఉంటున్నట్లు తెలుసుకొని ఆమే నా దగ్గరకు వచ్చింది. అందుకు చాలా సంతోషించాను. నాకు చేతయినట్లు ఆమెను సంతోషపెట్టాను. ఆమెతో ఇక్కడికి వచ్చి కొంతకాలం మా అత్తవారింట్లో ఉండి తిరిగి నేనొక్కణ్ణే వెళ్ళిపోయినాను."

"ఆ విధంగా ఎన్ని సంవత్సరాలు గడిచినయ్?"

"పదిహేనేండ్లు."

"ఈ పదిహేనేండ్లలో అప్పుడప్పుడు మీరు ఇక్కడకు వచ్చి పోతూండేవారు. అప్పుడు మీ భార్య ప్రవర్తనలో మీకేమైనా అనుమానం కన్పించిందా ?"

"లేదు."

"మరి ఇంత ఘోరంగా యీ హత్యకు మీరెందుకు పూనుకున్నారు ?"

"నాకు తెలియదు. బహుశా ఈ సమస్యను ఎవ్వరూ పరిష్కరించలేరనుకుంటాను. మనం అనేక పుస్తకాలను చదువుతుంటాం. వాటిలో అనేక మంచి విషయాలుంటాయి. ముఖ్యంగా ఈ పని చెయ్యరాదు, ఈ పని చెయ్యవచ్చు అనే ధర్మసూత్రాలున్న గ్రంధాలు మనదేశంలో అనేకం వున్నాయి. ఇవన్నీ

కాకపోయినా కొన్నయినా మనలో చాలామంది చదువుతూంటారు. వాటిలోని విషయాలు మీవంటి పెద్దలు చెపుతుండగా మరి కొందరు వింటూంటారు. కాని, ఏపని చెయ్యరాదో, ఆ పనినే మనలో చాలా మంది ఎందుకు చేస్తున్నామంటారు ?"

"అది వేరే సంగతి. ఇది హత్యకదా? ఒక నిండు జీవి ప్రాణాలు తీసెయ్యడం. ఇది క్షమింపరాని నేరం. దీనికేదో పెద్ద కారణం వుండాలి కదా ?"

"చిన్న పనికి చిన్న కారణం ఉంటుంది. మీకు ఆ కారణాలు తెలుస్తున్నాయి కనుక అవి చిన్నవవుతున్నవి. కనీసం అలా అని మీరనుకుంటున్నారు. మనం చిన్నవి అనుకునే వాటిలో చాలా పెద్ద కారణాలు చాలా వుండొచ్చు. మనం చాలా పెద్ద కారణాలు అనుకునే వాటిలో అంత పెద్దతనం ఏమీ లేకపోవచ్చు కూడా."

"ఈ గొడవంతా దేనికీ?"

"నేను హత్య చేశాను. ఒక నిండు జీవి ప్రాణాలను నా యీ చేతులతోనే తీశాను. ఈ పని యితరులెవ్వరూ చూడలేదు. నాకు నేనే యీ కోర్టుకు పట్టుపడ్డాను. నా యీ నేరానికి తగిన శిక్ష విధిస్తే సరిపోతుందిగా ?"

"ఆ మాత్రం కోర్టువారికి తెలుసు ! కాని న్యాయ విచారణ సక్రమంగా జరగాలి. మీరు చేసిన నేరానికి గల కారణాలను మీరు తెలియజేస్తే మీశిక్ష కొంచెం తగ్గవచ్చు."

నేను న్యాయమూర్తి వంక చూచాను. ఆయన పడుతున్న బాధ కోర్టులో ప్రతివాడికి స్పష్టంగా కనిపిస్తూంది. బాధకాదూ, మరి మూర్తి హత్య చేశాడంటే యెవరు నమ్ముతారు ? ముఖ్యంగా వాడితో ఆడుకొని, వాడి కష్టసుఖాల్లో కొన్ని సంవత్సరాలపాటు పాల్గొన్నవాళ్ళం యెలా నమ్ముతాం ? కానీ, లీలపోయింది "నేను హత్యచేశాను." అని మూర్తి న్యాయస్థానంలో బహిరంగంగా చెప్పుతుంటే నమ్మకపోవడమెలా?

మూర్తివంక చూచాను. శిలావిగ్రహంలాగా నిలబడి వున్నాడు. ఆనాడు ఆటల్లో యెవరన్నా తప్పు చేస్తే, అన్యాయానికి పాల్పడితే వాళ్ళను చావగొట్టి యిలాగే విగ్రహంలా నిలబడేవాడు. కాలేజీలో ఫిలాసఫీ లెక్చరర్ తో పోట్లాడి బయటికి వెళ్ళినప్పటి మూర్తి రూపం యిదే. కాకపోత ఆనాడు యువకుడు. ఈనాడు వృద్ధాప్యం తొంగిచూస్తున్న మూర్తి. ఇంతే తేడా. కానీ, మూర్తిలో అన్యాయానికి పాల్పడే లక్షణం లేదని వాణ్ణి యెరుగున్న వాళ్ళందరూ అంగీకరిస్తారు. కోర్టుకు వెళ్ళిన పని మరచిపోయి, అలాగే నిర్ఘాంతపడి వింటున్నానో, చూస్తున్నానో నాకే తెలియదు.

మళ్ళీ యేవో మాటలు వినిపిస్తున్నయ్.

"సరే ముద్దాయి నేరం చేశాడని రుజువు చెయ్యడానికి ప్రాసిక్యూషన్ వారికి సాక్షులు వున్నారా ?"

ప్రాసిక్యూటర్ లేచాడు.

"ముద్దాయి మామగారు మొదటి సాక్షి."

"ఆయన్ను పిలవండి."

ఒక లావాటి శాస్తుర్లు గారు కోర్టులో హాజరయినాడు.

న్యాయమూర్తి అడుగుతున్నాడు;

"లీల, మీ కుమార్తె యెప్పుడు హత్య చెయ్యబడ్డదో మీకు తెలుసా?"

"ఆ క్రిందటి రాత్రి"

"ఎన్ని గంటలకు?"

"తెలియదు"

"భార్యా భర్తలు వొకే గదిలో పడుకున్నారా ?"

"లేదు"

"మరి హత్య చేసిందెవరంటారు ?"

"శ్రీనివాసమూర్తి అనే నా అల్లుడు."

"ఆయనే హత్యచేశాడని మీకెలా తెలుసు ? ఆయన ఆమెను చంపుతుండగా మీరు చూచారా ?"

"లేదు"

"పోనీ చూచిన వాళ్ళెవరైనా మీకు అలా చెప్పారా?"

"లేదు. మూర్తే తెల్లవారు ఝామున నా దగ్గరకు వచ్చి 'మామయ్యా నేను లీలను చంపాను' అని చెప్పాడు."

"ఆ సంగతి ముద్దాయి వాఙ్మూలంలోనే వున్నది. అంతకన్న మీరు యింకా యేమన్నా చెప్పగలరా ?"

"చెప్పలేను"

"పోనీ... ఆ రోజు రాత్రి వాళ్ళిద్దరూ యేమన్నా పోట్లాడుకున్నారా ?"

"నాకు తెలియదు"

"మీ ఇంట్లో యెవరికైనా తెలుసా?"

"ఆయన చెప్పిన తరువాతనే అందరికీ తెలిసింది."

"అంటే మీరెవరూ మూర్తి లీలను చంపుతూండగా చూడలేదు. ఆమెకు యిదివరకు యేమైనా జబ్బువున్నదా?"

"డాక్టరు పరీక్షలో అటువంటిదేమీ లేదని తేలింది"

★ ★ ★

విచారణ సెషన్సుకు పోయిందని విన్నాను. ఇంటికి వెళ్ళి ఇదే సంగతి ఆలోచించటం మొదలు పెట్టాను. ఆలోచించిన కొందికీ చిన్ననాటి సంగతులన్నీ గుర్తుకొస్తున్నయి.

మూర్తి ఇల్లు మా ఇంటిదగ్గరే వుండేది. వాళ్ళు అంత భాగ్యవంతులు కారు. వాళ్ళ నాన్నా చిన్నతనంలోనే పోయినాడు. మూర్తికి నలుగురన్నలున్నారు. వాళ్ళందరూ ఏవో చిన్న చిన్న ఉద్యోగాలు చేసుకొంటున్నారు.

మూర్తికి చదువు చెప్పించే భారం వాళ్ళు ఎట్లా నిర్వహించారో ఇప్పుడు నేను చెప్పలేను. కాని, మనకు కావలసింది ఆనాటి మూర్తి అలవాటు ఆలోచనలు. మేమిద్దరం ఫోర్తు ఫారం నుంచీ బి.య్యే దాకా కలసి చదువుకున్నాం. నేనంటే వాడికి గౌరవం లేదు. నేనంటేనే కాదు, కొంచెం కలవారంటే వాడికి అసహ్యం, కోపం. వాళ్ళమీద కత్తికట్టినట్లుండేవాడు. క్లాసులో అన్నీ ఫస్టు మార్కులు వచ్చేవి కావు.

ప్యాసుమార్కులకంటే ఎక్కువే వచ్చేవి. అటు ఉపాధ్యాయులను కానీ, ఇటు లెక్చరర్లను కానీ, ఇంట్లో తల్లిని కానీ ఏమీ లెక్కచేసేవాడు కాదు. బి.య్యే క్లాసులో ఫిలాసఫీ లెక్చరర్ ఎవరో ఒక అమ్మాయివంక అదోరకంగా చూస్తూ పాఠం దోవ తప్పించాడు.

మూర్తికాసంగతి తెలిసి లెక్చరర్ ను నానా మాటలు అన్నాడు. ఆయన అజ్ఞాపించకుండా తానే క్లాసులోనుంచి వెళ్ళి పోయినాడు.

ఆ తరువాత ఈ లీల తనను ప్రేమించి పెండ్లి చేసుకుందని ఎప్పుడో మూర్తి చెప్పాడు. ఆ తరువాత ఈ పదిహేనేండ్లలో నేను మూర్తిని చూడలేదు. అన్యాయం చేసే లక్షణం అతనిలో లేదు. అన్యాయాన్ని క్షమించే తాహతు అంతకన్నా లేదతనికి.

అంతమాత్రం చేత విపరీత ప్రవృత్తి కలవాడనడానికీ వీలు లేదు. సాధారణమయిన మనిషిగానే తయారయాడు మూర్తి. లీలతో అతని పెండ్లి కూడా చాలా సహజంగానే జరిగింది. మూర్తి బీదవాడు. లీల భాగ్యవంతురాలు. అయితే చాలా చిన్నతనంలోనే వితంతువయింది. ప్రేమకలాపాలు అవీ ఏం లేకుండానే చాలా సహజంగానే తాను లీలను చేసుకున్నట్లు మూర్తి చెప్పాడు. వాళ్ళిద్దరి మధ్య అభిప్రాయభేదాలేమున్నాయో ఏమి లేవో చెప్పగల తాహతు నాకులేదు. కాని మా అన్నయ్యకు మూర్తి సంగతంతా మొదటినుంచీ తెలుసు. వాడి మాటల ప్రకారం మాత్రం వాళ్ళ సంసారం చాలా గుట్టుమట్టుగానే; అందరనుకున్నట్లు చాలా హాయిగానే గడచిపోయేదట.

★ ★ ★

మూర్తిమీద నేరాన్ని రుజువుచెయ్యాలనే పట్టుదల వాడి మామగారికి యెక్కువైంది. అవును మరి కన్నకడుపాయెను! నిండు ప్రాణాన్ని నిలువునా తీస్తే ఎవరు మటుకు ఎలా సహిస్తారు ?

అసలు నేరం చెయ్యలేదని మూర్తి అన్నాడు కనుకనా ? కాకపోతే మూర్తి, లీలను యెందుకు చంపాడు ? యెట్లా చంపాడు ? అనే విషయాలు కొరకరాని గడ్డు సమస్యలయ్యాయి. వాటిని పరిష్కరించాలనే పట్టుదల అటు సెషన్సు జడ్జిలోను, యిటు మూర్తి మామగారిలోను యెక్కువయినవి. ఈ సంగతంతా తెలుసుకుని నేను కూడా సెషన్సుకు హాజరయ్యాను.

ఎక్కడో డిటెక్టివ్ నవలల్లో యిలాంటి విషయాలు చదవటం జరిగింది. ఇప్పుడు కళ్ళారా ఆ సంగతంతా చూస్తున్నాను. మూర్తి నేరం చెయ్యలేదని నాలోని రెండో వాడంటాడు. ఒక చెంపచేశానని స్వయంగా మూర్తే చెప్పుతూంటే, నమ్మక పోవడం యెలాగో తెలియకుండా వున్నది, కనుకనే సెషన్సు విచారణకు నేను కూడా హాజరయాను.

★ ★ ★

విచారణ ప్రారంభమైంది.

మూర్తి అన్నలందరు వచ్చారు. మూర్తి హత్య చేశాడన్న నమ్మకం వాళ్ళకు లేదు. సెషన్సు వారు క్రింది కోర్టుకన్నా అదనంగా సేకరించకలిగిన సాక్ష్యం యేమీ లేకపోయింది. ముద్దాయి తన నేరాన్ని ఒప్పుకోవటమే పెద్ద సాక్ష్యం.

వరుసగా రెండు రోజులు విచారణ జరిగింది. మూడో రోజున మూర్తి బోనులో నిలబడి చెప్పుతున్నాడు :

"హత్య అంటే మీకు తెలిసిన అర్థం తప్పు అని నా యీ నేరంవల్ల స్పష్టమయింది.

"ఒక మనిషిని కత్తితో పొడిచిగాని, విషం పెట్టిగాని, లేక మరే ఆయుధంతోనైనా చంపితేనే హత్య చేసినట్లు మీ అభిప్రాయం. ఆదృష్టితో అయితే నేను ఆమెను హత్య చెయ్యలేదు."

"ఒక మనిషితో అభిప్రాయ భేదం వచ్చినంత మాత్రాన బజారునపడి కొట్లాడుకోవాలని మీ అభిప్రాయం. అటువంటిది నేనేమీ చెయ్యలేదు. ఈ పురాతన దృష్టితో యేర్పరచుకున్న పడిరాళ్ళతో నానేరం రుజువు చెయ్యడానికి ప్రయత్నించి, పాపం అనవసరంగా మీ బుర్రల్ని పాడు చేసుకొన్నారు."

"అసలు సంగతేమిటంటే యిన్ని సంవత్సరాలు లీల నాతో సంసారం అనేది చెయ్యనే లేదు. ఏనాడయితే నేను ఆస్తి సంపాదనకు అక్కడికి వెళ్ళానో అప్పట్నుంచీ ఆమె ఇష్టం వచ్చినట్లు ఆమె వుండటం ప్రారంభించింది. నా యిష్టం వచ్చినట్లు నేనుండే వాణ్ణి. నువ్విలా చేయవద్దు అని నేనామెకు చెప్పలేదు. అప్పుడప్పుడామె నా దగ్గరకు వచ్చి యేడ్చేది. నేను మాత్రం ఏమీ అనేవాణ్ణి కాదు. ఆమెతో పాటూ యేడ్చేవాణ్ణీ కాదు. అంత మాత్రాన ఆవిడకు కావాల్సిన డబ్బు అవీ ఇవ్వక పోయే వాణ్ణీ కాదు. ఆమె సుఖపడటానికి కావలసినవన్నీ యిచ్చే వాణ్ణి. ఇలా ఎన్ని సంవత్సరాలని ఆడది బ్రతక గలదు ?"

"ఎవరైనా బ్రతగ్గలరేమో కాని నాకు తెలిసినంతమటుకు లీలవంటి మనిషి మాత్రం ఎంతోకాలం బ్రతకలేదు. అంచేత ఆమె ఈ నాటకానికి స్వస్తి చెప్పతలచుకొని ఆ రోజు రాత్రి నాకాసంగతి చెప్పింది. నేనా మాటలు నమ్మలేదు కాని అర్ధరాత్రి ఎందుకో నేనామె మంచం దగ్గరకు వెళ్ళి చూస్తే ఆమె మాటలు నిజమేనని తెలిసింది. కాని, ఆమె తన ప్రాణాలు ఏవిధంగా పోగొట్టుకొన్నదో నాకు తెలియదు. డాక్టర్లకు కూడా ఆ సంగతి తెలియకపోవటం విచిత్రం. అంతకన్నా విచిత్రమేమిటంటే ఏమీ తెలియని మీ అందరూ ఈ విషయంలో ఏమిటో తెలిసినట్లు నటించటం."

"ఇక న్యాయస్థానం ఏమన్నా శిక్ష విధించవచ్చు. ఈ హత్య చేసింది నేనే !"

తరువాత మూర్తికి ఉరిశిక్ష విధించారు.

ఈ సమస్య ఈనాటికీ పరిష్కారం కాలేదు....

# దివ్యదృష్టి

## చక్రపాణి

### (ఆనందవాణి - 1940 అక్టోబర్ సంచికనుంచి పునర్ముద్రితం)

ప్రౌఢకవి కళ్ళు మూసి ధ్యానంలో పడ్డాడు ! ఊహూఁ ధ్యానంలోపడి కళ్ళుమూశాడు ! ఊహూఁ రెండూ నిజం కాదు; కవి కళ్ళు మూసి ఆలోచనలో పడ్డాడు. ఆఁ, ఇదే కొంత వరకు నిజం.



గోచీ పెట్టినప్పటినించీ కవిత్వం చెప్పేవాడు.

కవంటే మామూలు కవి కాదాయన ఆజన్మకవి. బొడ్డూడినప్పటినించీ కవిత్వం చెప్పేవాడంటే అతిశయోక్తి కావచ్చుగాని, గోచీ పెట్టినప్పటినించీ కవిత్వం చెప్పేవాడంటే ఎవ్వరూ ఆశ్చర్యపడనక్కర్లేదు. యదార్థం కూడా అంతే! ఇరుగుపొరుగమ్మలు మొదటి సారి ముద్దుకు గోచి పెట్టితే, ముద్దుగా మొదటి పద్యం అల్లాడు

మీదు యవివేకమునకునే లెస్సగుంది
నాడనని చెప్పుటకు సిగ్గు కరము వడితి,
ఎందులకు బంధనము జెప్పుడతివలార!
దేవుడిచ్చిన యంగంబు దాచనేల ?

వెయ్యి పౌన్ల బాంబు తమముందు పడ్డాగాని అమ్మలక్కలంత దిగ్భ్రమ చెంది ఉండరు. తమకు తెలియకుండానే వాళ్ళ వ్రేళ్ళు ముక్కుల మీదికి పోయినై!

తండ్రికీ సంగతి తెలిసింది. ఆయన కొడుకు కృతిత్వానికి సంతసించక పోలేదుగాని, పద్యార్థంమీదికి దృష్టి పోవటం చేత దీర్ఘాలోచనలో పడ్డాడు. పడి, తన పుత్రుడు గొప్ప వేదాంతికాగలడనీ, ఐతే, అందుకు తగిన వాతావరణంను కల్పించవలసి ఉంటుందనీ నిశ్చయించి, బాలకవిని మఠాధిపతికి వప్పగించాడు.

కవి తల్లికి కొడుకుని వదలటం ఇష్టంలేదు. ఐనా భర్తనోటికి వెరచి ఊరుకుంది.

సరే, ఆ రోజున ఈ బాలకుడిలో పడ్డ కవితా బీజం అంకురించింది, పుష్పించింది, ఫలించింది. ఇంకోవిధంగా చెప్పాలంటే మొక్కయింది, మానయింది, వేళ్ళుదిగాయి, ఊడలు జారాయి! ఈ రోజున ఆ చెట్టునాశ్రయించుకుని ఎన్నో పక్షులు బతుకుతున్నాయి. ఎన్నో కొక్కెరలు కొక్కెరిస్తున్నాయి.

సరే, ఇక అసలు విషయానికొద్దాము.

ఇక బాలకవి అంతవరకతను ఒక్క తెలుగు పొత్తంకానీ, సంస్కృత పుస్తకంగానీ ముట్టి ఎరగడు. ఐతే ఏం ? నిషాదుణ్ణి తిట్టినతిట్టు శ్లోకమైనందుకు మొదట వాల్మీకి ఎంత ఆశ్చర్యపడ్డాడో, తర్వాత ఎంత తన్మయత్వం చెందాడో సరిగ్గా, తూచినట్టు అంత ఆనందమూ, తన్మయతా మన బాలకవి కూడా పొందాడు ! ఎందుకు పొందడూ ? మానవ హృదయాలు ఊహూం కవి హృదయాలు సమానంకావూ ? మనస్తత్వం అనేది లేదూ ?

కవి కళ్ళు మూసి ఆలోచనలో పడ్డాడని చెప్పాను కదూ! ఆఁ ఆలోచనలో పడి తన జీవితాన్నొకమాటు సింహావలోకనం చేసుకున్నాడు. అతను మఠంలోనించి తప్పించుకుని మామూలు సంసారికావటానికెన్ని తిప్పలు పడ్డాడు. సంసారి అయినాక అతనిమీదుగా ఎన్ని తుఫాన్లువీచినై ! చెట్టంత అల్లుడు పెళ్ళునరాలిపోలేదా ? సంసారసుఖం ఎరగని కూతురు శాశ్వతంగా తన మెడకి చుట్టుకోలేదా? ఐతేనేం? తను చలించాడా? తర్వాత కొన్నాళ్ళకి ప్రేయసి తనతో చేసిన ప్రతిజ్ఞలన్నీ విస్మరించి తనకంటే ముందుపోయి కూర్చోలేదా? అది అతన్ని కొంత చలింపజేసింది కూడా. ఐనా అతను నిగ్రహించుకుని, ఒక డజను విషాదగీతికలు గీకి ప్రకటించి, పునర్వివాహం చేసుకున్నాడు.

ఆఁ ఈ వివాహం గానీ కూతురు వైధవ్యంగాని అతని మనస్సుకు కష్టకారణాలు కాలేదు. పైగా కొంతకాలమతని కవిత్వంలో కరుణ శృంగార రసాలు ప్రాధాన్యత వహించాయి. అదీగాక, ఈ భార్య, అడుగుపెట్టిన వేళ ఎటువంటిదో కవికి సన్మానాలు మిక్కుటమైనై. అతని కవితాప్రకాశం రాష్ట్రీయతనే సంకర్ణ సీమను దాటి ఖండాంతరాలకి వ్యాపించింది. అతనిమీద పద్యాలు రాసే కొంతమంది కవులైనారు. అంటే కవితావస్తువు దొరకని పిల్ల కవులంతా వీరి పుస్తకాన్నో, ఏ పాత్రనో, ఏ శబ్దాన్నో తీసుకుని పంచరత్నాలు, నవరత్నాలూ రాసి పారవేసే వారు. ఇప్పుడు కవిగారి అమూల్య ఉపదేశాలు పొందటానికై ఇంటికి వచ్చేవారి సంఖ్య అధికమైంది. తలవని తలంపుగా దూరదూరాన్నించి సభలకధ్యక్షత వహించమనీ, ఉపన్యాసాలివ్వమనీ ఆహ్వానాలొస్తు ఉండేవి. వీలున్నంత వరకు ఆయనకాదని ఎరగడు, తేదీలు మార్పించేవారు కాని! ఇప్పుడు సాహిత్య రాజ్యానికి మనకవి రాజు, ఇటలీ రాజు లాంటి రాజు కాదు మన దేశ రాజులాంటి రాజు. ప్రతి గ్రామంలోనూ వీరి శిష్యులు  వీరి రచనలకర్థం చెప్పుతూ ప్రచారం చేస్తూ ఉంటారు, ఐనా దీపం క్రింద క్రీనీడ ఉండనే ఉంటుంది. ఈ మధ్య సాహిత్య యాచకులు కొంతమంది వీరి రచనల్లో సారం లేదనీ సైకాలజీ లేదనీ ఒక రకం ప్రచారం లేవదీశారు. అందులో ఒకాయన కవికి ఎకనామిక్స్ తెలియవని బాహాటంగా అన్నాడు. కవికి సైన్సూ, ఎకనమిక్సూ, జుయాలజీ, బయాలజీ కంపల్సరీగా తెలిసి ఉండాలన్నట్టు! వీటిమీద మనకవి అథారిటేటివ్ గా గ్రంథం ఈయబోతున్నాడా? సందర్భాన్ననుసరించి తనకూ తెలుసునన్నట్టు కూస్తున్నాడుగాని.

ఏమైనా గానీ కవిలో ఇప్పుడు మార్పు రావాలి. లేకపోతే ఈ కుర్ర కారుతో వెనక పడిపోతాడు. కాని, వాళ్ళదృష్టీ వీరిదృష్టీ ఒకటి ఎలా అవుతుందీ? దీనికొకటే క్రియ ఉంది. దివ్యదృష్టి అది లభిస్తే? ఇతర్ల మానసవల్మీకాల్లోనించి భావాలనే సర్పాలని బయటికి లాగవచ్చు. కాని తనకు సాధ్యమవుతుందా, అది? పూర్వం మహర్షులకు మాత్రం ఉండేది. ఒక వేళ అయితే తనకే కావాలి ఈ మధ్య తన్ను పూర్వప్రముఖులతో పోలుస్తూ ఆషాఢభూతి ఒక వ్యాసం కూడా రాశాడు!

మన కవికి గురువు అప్పయ్య దీక్షితులవారే. కావ్యాంతాన 'సరస్వతీ వరప్రసాదలబ్ధ' అని చెప్పుకున్నా వీరి కవితాశక్తి పూర్వజన్మ సంచితమే గాని ఇప్పటిది కాదు. ఇంతకాలంనించి అనవసరంగా సరస్వతీ దేవికి పబ్లిసిటీ ఇస్తూ వచ్చాడు ఒక్క మేలు కూడా ఆమె వల్ల ఇతనికి చేకూరలేదు. ఈ రోజున తను దివ్యదృష్టి కావాలని కోరితే సరస్వతి తిరస్కరిస్తుందా? చూద్దాం అదీ, ప్రయత్నించి!

నన్నయనించి తనవరకు గల సరస్వతీ స్తోత్రాలన్నీవల్లించాడు. అందులో పోతన్నవి మాత్రం రెట్టించాడు. గొంతెండి నిద్రపోయాడు కవి.

దేవి సాక్షాత్కరించింది కాటుకకంటి నీరు చనుకట్టుపయి పడుతూ కాదు ప్రసన్న వదనంతో !

"తల్లీ ! ఈ యధమునిపై దయగలిగినదా! కృతార్థుడను." అన్నాడు కవి.

"వత్స! ఎందులకింత కాతరుడవై యున్నావు ?" అన్నది దేవి జాలితో.

"మాత  నీకు దెలియని రహస్యమేమి గలదు ముజ్జగములలో! నాకు దివ్యదృష్టి నొసగుము." అని కళ్ళుతుడుచుకున్నాడు కవి, పిల్ల వాడివలె.

దేవి ఆశ్చర్యముతో – "దివ్యదృష్టి!" అని మళ్ళీ నవ్వుతూ "కవులు దివ్యదృష్టి సహించలేరు. వారి మనంబతికోమలము." అన్నది.

"తల్లీ! నన్ను బరీక్షించుచుంటివా! నేను తక్కిన కవులతో సమానుడనా ?"

"వత్స! నీ మనస్సు నొప్పించుట నాకయిష్టము. ఒక దివసము, అననెనిమిది యామములు నీకు దివ్యదృష్టి బ్రసాదించితిని. ప్రయత్నించి చూడుము. నీ కిష్టమగునెడల తిరిగి శాశ్వతముగా నొసగెదను."

"మహా ప్రసాదము, మాతరో!" అన్నాడు కవి.

కవి కళ్ళు నులుముకుంటూ లేచాడు. కాలకృత్యాలు తీర్చుకున్నాడు. చిత్రం! నిద్ర నించి లేచేవరకు ప్రపంచమంతా తల్లక్రిందులైంది. మనుష్యులందరిలో మార్పు. నోరు మెదపకపోయినా వారు మాట్లాడేమాటలు వినబడుతున్నాయి.

కవి పత్ని పూజా సామాగ్రి సిద్ధం చేసింది కవి దేవతార్చనకు కూర్చున్నాడు. "చాదస్తం" అని నవ్వుకుంటూ బావిదగ్గరికి బయలు దేరింది కవిపత్ని.

కవికి ఆశ్చర్యం వేసింది. "ఏమన్నావూ?" అని కేక వేశాడు.

"ఏమన్నా" నంటూ తిరిగి నుంచుంది కవిపత్ని. కవికి దివ్యదృష్టి సంగతి జ్ఞాపకం వచ్చింది. "ఏమి లేదు" పొమ్మన్నాడు.

కవి దేవతార్చన ముగించుకుని సరస్వతీ సేవకు పూనుకున్నాడు. దేవికూడా వారిని పూనింది. నిన్న పొగమంచులాగా ఉన్న భావాలెన్నో నేడు వారికి పరిష్కరించినట్టు స్పష్టంగా కన్పిస్తున్నాయి. పరపర కాయితాలమీద కాయితాలు రాసివేస్తున్నాడు.

శిష్యుడొచ్చి కూర్చున్నాడు, ఆషాఢభూతి! కవి తలఎత్తకుండానే గ్రహించి కొన్ని కాయితాలు అతగాడివైపుకు తోశాడు.

"ఎందుకీ చెత్త!" అనుకున్నాడు ఆషాఢభూతి వొక పేజీ చదివి.

"చెత్తా?" అని హుంకరించాడు కవి. ఎందుకు హుంకరించడూ ? తను రాసిన కవిత్వం మీద శిష్యుడెప్పుడూ ఇలాంటి రిమార్కు పాసు చెయ్యలేదు. పైగా, తను రాసిన పద్యాలమీదా, శబ్దాలమీదా, ఆఖరికి అరసున్నలమీద కూడా అనుకూలంగా విమర్శనలు రాశాడు. ఇంకా, 'నిగ్రహం' అనే శీర్షికతో వీరి ఇంద్రియ నిగ్రహం మీదా, మనో నిగ్రహం మీదా, ఇంకా దేవుడు మేలు చేస్తే రచనా నిగ్రహం మీద వ్యాసాలు రాశాడు! ఇప్పుడో?

శిష్యుడు గాభరాతిన్నాడు. తాననుకున్న మాట పైకి వినపడిందేమోనని సందేహించాడు. ఐనా గత్యంతరం లేక "చెత్తేమిటండీ గురువుగారూ?" అని ప్రశ్నించాడు.

గురువు గారికి గుర్తువచ్చింది, రాత్రిసంగతి. "ఏమీలే"దని మళ్ళీ కవితారచనలో మగ్నుడైపోయాడు.

ఆషాఢభూతి కవితాపఠన వదిలాడు. మామూలు కార్యక్రమంలో పడ్డాడు, గురువుగారింట్లో ఆడవాళ్ళు కనపడతారేమోనని చాతక పక్షిలాగా చూడటం!

శిష్యుడి ప్రవర్తన చూసేవరకు గురువుగారి కలం ముందుకు సాగలేదు. వచ్చే భావాలన్నిటికీ శిష్యుడే ఆధారమయాడు. ఇంతలో గురువుగారి కూతురు ఏదో పనిమీద తండ్రి దగ్గరకొచ్చి, ఆషాఢభూతిని చూసి నవ్వుకుంటూ తిరిగి వెళ్ళింది.

గురువుగారి మీద గొంగళి పురుగు పాకినట్లయింది. ధుమధుమలాడుతూ సరస్వతికి స్వస్తి చెప్పి లేచాడు. గురువుగారి వింత ప్రవర్తన ప్రియశిష్యుడికర్థంకాక, మనస్సులో తీవ్రంగా విమర్శించుకుంటూ చల్లగా ఇంటికి జారుకున్నాడు.

భోజనానికి కూర్చుంటే కవిపత్ని మామూలు కన్నా ఎక్కువ శ్రద్ధాభక్తులతో భోజన పదార్థాలు వడ్డించింది. భర్త సంతోషంగా ఉండగా కొత్త చీర తెచ్చిపెట్టమని అడగాలని ఆమెకోరిక. కవి ఈ సంగతి గ్రహించి వంటకాలు బాగుండలేదని విసుక్కున్నాడు. కవిపత్ని ఇక ఆ ప్రస్తావన తేలేదు. ఆమె శ్రమంతా వృధా అయింది.

భోంచేసి శ్రీమంతుడి దగ్గరికి బయలు దేరాడు కవి దోవలో వీరి మిత్రులిద్దరు దూరాన ఉన్న కవిని చూసి ఇలా అనుకుంటున్నారు

ఒకడు — వస్తున్నాడోయ్, మహాకవి.

రెండో — ఇక బోర్ చెయ్యంది వదిలి పెట్టడు.

ఒకడు — మహా చావుగా ఉందిరా ఇతనితో! బాగాలేదంటే చంపొస్తాడు; బాగా ఉందంటే జీడిలాగా పట్టుకుంటాడు, ఆపూటల్లా !

రెండో — ఏం చేస్తాం! ఈతిబాధల్లో దీన్నికూడా కలుపుదాం.

ఇంతలో కవి దగ్గరకొచ్చాడు. రెండోవాడు ప్లేటుమార్చి అన్నాడు — "గురువుగారూ మొన్న మీరిచ్చిన ఉపన్యాసం పత్రికల్లో చదివామండీ చాలా గొప్పగా ఉంది. కాని ఆ ఆదర్శాలున్నాయే మా బోటి మామూలు–"

మామూలు రోజుల్లో అయితే ఈ మాత్రం సూత్రం దొరికితే చాలు కవికి పురాణాలూ, ఉపనిషత్తులు క్రోడీకరించి ఆ ఎర్రటి ఎండలో రెండుగంటలు ఉపన్యాసం దంచేవాడు. కాని ఇవ్వాళ కవికి నోరు లేవలేదు. జాలిగా వాళ్ళవంక చూసి "ఏమంది, రేపు కనపడతా"నని వెళ్ళిపోయాడు ఆయన పోతే మాత్రం వదులుతారా ఈ మహానుభావులు? వెనకాల వెక్కరిస్తూ విమర్శనలు సాగించారు, కవికి తెలియదనుకుని.

శ్రీమంతుని యింటికి చేరుకుని కవి ఎండలో వచ్చిన శ్రమంతా మర్చిపోయాడు హాయిగా పంకాకింద కూర్చుని. తను వచ్చినట్టు నౌకరు ద్వారా కబురు చేశాడు పైకి. ఇక్కడైనా మనశ్శాంతి దొరుకుతుందని ఆశ, నౌకరు కాసేపట్లో తిరిగొచ్చి 'అయ్యగారు నిద్రపోతున్నా'రని చెప్పాడు.

కవి మనస్సు విరిగిపోయింది. "నిద్రపోతున్నారా ? శాస్త్రితో చదరంగమాడటం లేదూ ?" అన్నాడు నోరుజారి. నౌకరేంచెప్తాడు? బిత్తరపోయి "నేను చూడలేదు బాబయ్యా అమ్మగారు చెప్పారు" అన్నాడు.

"అమ్మగార ! అనవసరంగా ఆమెనెందుకిందులోకి ఈడ్వడం?" అనుకుని కవి ఇంటి ముఖం పట్టారు.

దోవలో కవిగారి భక్తుడొకాయన కనపడ్డాడు. ఈ భక్తుడు మహా పట్టుదలగలవాడు. కవిగారు కనపడితే చాలు, ఆయనచేత బలవంతంగానైనా సరే కాఫీ తాగించి గాని వదలడు. ఇవ్వాళ కూడా అతను అదే ఫక్కీగా మాట్లాడాడు. కాని, ఆ బలవంతంలో యదార్థంగా పటుత్వమెంతుందో కవి ఈనాడు గ్రహించాడు. ఇంతకాలానికి అతనిమాట తోసి పుచ్చగలిగాడు !

సాయంత్రం కవి మామూలు పురాణ పఠన చేస్తున్నాడు. కుమార్తే, ఇంకా ఇరుగు పొరుగమ్మలూ వింటున్నారు. పఠిత శ్రోతలూ రసావేశంలో ఉన్నారు.

ఆషాఢభూతి తన్మయుడై జావళీ పాడిన ఆనందం అనుభవిస్తూ వీరింటికి వచ్చారు. కవిగారు మనస్సు వాడి వైపుకు లాగింది. వాడి మనస్సును ఒక్క క్షణంలో చదివాడు. ఝుంయ్ న పాదుక విసిరాడు.

ఆషాఢభూతిని ముసలమ్మలంతా చుట్టు ముట్టారు. కవిపత్ని వాడి కేక విని లోపలినించి వచ్చింది. మంచినీళ్ళిచ్చి వాడిని పోదార్చి పంపింది.

కవి అంతా చూస్తూ ఊరుకున్నాడు అందరూ తన్ను దూషిస్తున్నారని కూడా తెలుసుకున్నాడు. అందరితో పాటు తన భార్య, కూతురుకూడా కవి ఇక వినలేక "దేవీ" అని పిచ్చి కేక వేసి మూర్ఛపోయాడు. ఎంతో శుశ్రూష చేసిన మీదట రాత్రి పన్నెండుగంటలకి వారికి మళ్ళీ స్మృతి వచ్చింది.

ఈ మాటు కవి ఇంకో కొత్తవరం కోరాడు – "నిన్న జరిగిన విషయాలన్నీ మర్చిపోయెటట్టు చేయమని"

దేవి అనుగ్రహించింది.

# డామిట్! కథ అడ్డం తిరిగింది

## - చంద్ర చిత్ర

(ఆంధ్రజనత - 1967 ఏప్రిల్ 10 సంచికనుంచి పునర్ముద్రితం)




కాలచక్రంలో పడి సుమారుగా ఐదేళ్ళు గడిచాయి. కాని నాలో ఏమార్పూ కలగలేదు. ఐదేళ్ళ క్రితం తాలూకాఫీసులో గుమాస్తాగా ప్రవేశించిన నాకు ఇంతవరకు ప్రమోషన్ లు కలుగలేదు. నా అనుభవంలో ఎంతోమంది గుమాస్తాలు వచ్చారు వెళ్ళిపోయారు.

మిత్రుడు గోపాలం దగ్గర్నించి వస్తున్న ఉత్తరాల్లో కూడా మార్పుల్లేవు. ఎంతసేపూ మేమిద్దరం ఉత్తర ప్రత్యుత్తరాల్లో క్షేమాలు తప్పితే మరేమీ వ్రాసుకొనేవాళ్ళం కాదు.

కాని నిన్న హఠాత్తుగా గోపాలం దగ్గర్నించి వచ్చిన వుత్తరం ఈ ఐదేళ్ళగా వాడి దగ్గర్నించి వచ్చిన సుమారు పాతిక పదుల వుత్తరాలకి అతి భిన్నంగా వుంది.

"స్టార్టు ఇమీడియట్లీ, యాజ్ యూ సీ దిస్ లెటర్...

యువర్స్_

_గోపాల్ "

నిజంగా నేను ఈ వుత్తరాన్ని చూచి ఎంత ఆశ్చర్యపోయానంటే ఎంత ఆశ్చర్యపోతే మీకేంగానీ.. నిజంగానే ఆశ్చర్యపోయాలెండి.

ఇంతకీ ఈ ఉత్తరం చూచి నేను బయల్దేరాననుకుంటున్నారు కదూ! ఊహూఁ... పాపం మా గోపాలం అదృష్టమా అంటూ నాకు లీవు దొరకలేదు. "ఐదు రోజులపాటు లీవు కావాలండీ" అంటూ ఆఫీసరుగారికి పంపిన కాగితం మీద ఎర్రని అక్షరాలు నన్ను మళ్ళీ మాట్లాడనీకుండా చేశాయి.

"ఐదు రోజులు కాదు... ఐదు నిమిషాలు కూడా దొరకవు. జాగ్రత్త!"

ఎలా ఉన్నాయండీ ఈ మాటలు. అదేదో తెలుగు బైస్కోపులో హీరో తండ్రి "నే చెప్పినట్టు చేయకపోతే నా ఆస్తిలో ఒక్క..ఖ... చిల్లికానీ కూడా ముట్టదు" అని బెదిరించినట్టు లేదూ! అందుకని ఆ హీరో తన తండ్రి చెప్పిందల్లా చేయటానికే ఒప్పుకున్నట్లు నేనూ గప్ చిప్ గా... ఫైల్లో మునిగిపోయాను, సముద్రంలో మునిగినవాడిలా.

చెప్పొచ్చేదేమిటంటే రెండ్రోజులు తిరక్కుండానే మా గోపాలం గాడు ఆఫీసులోకి ఊడిపడ్డాడు.

"నేను రమ్మనక.. రమ్మనక..మ్మన"(ఇదేదో అరవ పిక్చరు డైలాగులా వుంది కదూ...!) "రమ్మంటే నీకింత పొగరా!!??" అని అరిచేశాడు. ఆ అల్లరికి నలుగురూ చేరి నాలుగు అక్షింతలు (తిట్లు: "ఈ గొడవ ఏమిటండీ, ఇది ఆఫీసు అనుకున్నారా, గాడిదల కొట్టం అనుకున్నారా" ఇది మీ ఇల్లయినట్లుందే ఇత్యాదివి...) తగలేస్తారని భయపడ్డాను. కాని మా గోపాలమే చల్లబడ్డాడు, "అయినా నిన్ననేం లాభం. నా రాత ఎలా రాసి వుంటే అలా జరక్క తప్పుతుందా?" అంటూ.

ఎవరూ ఏమనక ముందరే నేను గోపాలాన్ని బరబరా బయటకు లాక్కుపోయి లాంఛన ప్రాయంగా కాంటీనులో కాఫీ ఇప్పించి, రూం తాళం చెవి యిచ్చి "వెళ్ళి పడుకో, స్నానం చేసి, నేను సాయంత్రానికల్లా వస్తాను. కావలసివస్తే టెబుల్ మీద మీల్స్ టికెట్ ఒహటి తీసుకో." అని గబ గబా చెప్పి ఆఫీసుకు బయల్దేరా. అప్పటికే చాలా ఆలీసెం అయిపోయినందుకు గోపాలానికి చాలా కోపం వచ్చినట్టుంది, వాడేమీ మాట్లాడలేదు.

నేను ఆఫీసు గదిలోకి అడుగెడుతూనే ప్రారంభదశగా మా ఆఫీసరు తన వాచీని నా కళ్ళ ముందరుంచారు. మొదటే భయపడ్డ నేను, "మా గోపాలం వచ్చాడండీ... అందుకని... కాస్త ఆలీసెం జరిగిపోయిందండీ." నసుగుతూ ఆ నాలుగు ముక్కలు అనేశాను ముందరే జాగ్రత్తపడ్డాను.

"లాస్ట్ ఛాన్స్! ఈ వాళ్టికి గంట... అంటే సాయంత్రానికి ఒక గంట ఇంటికి లేటుగా వెళ్ళు!"

ఆజ్ఞ జారీ చేశాడు.

"సరేనండీ!" విధిలేక ఒక్క ముక్కా అన్నాను.

సాయంత్రం..

"ఐదయింది" అంది గోడగడియారం. నేను ఫైళ్ళన్నీ సర్దేశాను. "అబ్బ ఇప్పటికా రిలీఫ్" అనుకున్నాను. లేచి సిగరెట్టు ముట్టించుకుని బయల్దేరా.

"ఎక్కడికీ?" పిడుగు పడిందేమోననుకున్నాను. అదిరి పడ్డాను. పడ్డానంటే క్రింద పడ్డం కాదండీ.. ఊరికే బెదిరి పోయాను. అరే, పోయానంటే బయటిగ్గానీ, ఇంటిగ్గానీ కాదండోయ్. ఏమీ అనుకోవద్దు. నేను తెనుగులో చాలా వెనకగా వున్నాను లెండి. లెండి అంటే అప్పుడే లేచేరు సుమండీ.. ఈ కథ పూర్తిగా చదివి లేవండి.

ఇంతకీ నేనెక్కడ ఆపాను. ఆఁ.. "పిడుగు" అన్నాను కదూ. అది మా ఆఫీసరు గొంతుక. చచ్చినట్టు తిరిగి వెళ్ళి నా సీట్లో కూర్చుని మళ్ళీ ఫైళ్ళన్నీ ముందరేసుకున్నాను.

"ఐదున్నర" అంది మళ్ళీ అదే గోడగడి...

"ఐతే అవనీ..." కసురుకుని మరో ఫైలు తీసుకుంటూ అద్దిరి పడేసరికి చేతనున్న ఫైలు కాస్తా క్రింద పడింది. నేను వీపు చరుచుకోబోతూ మళ్ళీ బెదిరాను.

"ఎందుకు?" అనుకుంటున్నంతలో మా గోపాలం నాకళ్ళక్కనిపించాడు. నేను మా వాణ్ణి మాట్లాడేందుకు సమయం ఇవ్వకుండానే జరిగిందంతా చెప్పి. "మరో అరగంట ఓపిక పట్టరా" అని వేడుకున్నాను. వాడు సరేనని విసుగ్గా నాకెదురుగా కూర్చున్నాడు.

ఎలాగయితేనేం మేమిద్దరం ఆరుగంటల వరకూ ఓపిగ్గా కూర్చుని తర్వాత ఆఫీసు వదిలాం.

కాంటీను కెళ్ళేంత వరకు మా గోపాలం ఏమీ మాట్లాడలేదు. నాకాశ్చర్యం వేసింది.

కాఫీకి ఆర్డరిచ్చాను.

"ఒరేయ్!...శేఖరం..." నన్ను సంబోధించాడు మా గోపాలం.

"ఊఁ" అన్నాన్నేను.

"మీకు సోమవారం నాడు సెలవు కదూ!"

"అవును"

"రేపు"

"ఆదివారం ఆఫీసు లేదు"

"మంగళవారం"

"ఆఫీసు వుంది."

కాఫీలు వచ్చాయి. మెల్లిగా చప్పరించి తాగేసి బిల్లు చెల్లించి బయల్దేరాం.

"శేఖర్! ఈ రాత్రికి మనం బండెక్కెయ్యాలి."

"ఈ రాత్రికా?"

"అవును. రేపు ఆదివారం ఎల్లుండి సెలవు. నువ్వు చేయవలసింది చాలా వుంది" అన్నాడు వాడు సిగరెట్టును ఆఖరుసారిగా పీల్చి దూరంగా గిరాటేస్తూ.

ఇక్కడ మా గోపాలం గూర్చి కొంత చెప్తా. గోపాలం నాతో పాటు బి.ఎ. వరకూ చదివాడు. వాడికి ఓ సంపన్నుల కూతురుతో వివాహం అయింది. అయితే వాడు చేసుకున్న అమ్మాయి బాగుండదు. లావు, పొట్టి, నలుపురంగుగా వుంటుంది.

మరి మా గోపాలం ఆవిడతో వివాహానికి ఎందుకు ఒప్పుకున్నాడో మీకర్థం అయి వుంటుంది. గోపాలానికి ఉద్యోగం గానీ సద్యోగం గానీ లేవు. వాడికి వాడి మామగారి ఆస్తివుంది. వాడి మామగారికి వేరే పిల్లలు లేరు. ఆస్తంతా ఆ అమ్మాయి పేరనే వుంది. మామగారు కొద్దిరోజుల క్రితమే చనిపోయారు.

"ఇంతకీ అసలు విషయం..."

"ఏమిటంటావు" పూర్తిచేశాడు మా గోపాలం

"విను. ఈ మధ్య మా ఆవిడకి జబ్బుచేసింది. చాలా రోజులు బ్రతకదన్నారు. నేను సంతోషించాను..."

"అదేం పోయే కాలంరా నీకు. సుశీల నీవు కట్టుకున్న పెళ్ళాంరా. ఆవిడ చచ్చిపోతోంటే నీకు సంతోషంగా వుందిరా వెధవాయ్" నేను వాణ్ణి కోప్పడ్డాను.

"అక్కడే వుంది అసలు కిటుకు. ఈ మధ్య ఓ అమ్మాయి పేరు శారద. మా ఇంట్లోకి అద్దెకిల్లు కావాలంటూ వచ్చింది. శారదని చూసినప్పట్నించి ఇదిగా వుందిరా. ఆమె ఇంకా "మిస్" ఆమెని "మిసెస్ గోపాలం" అని పిలవాలని వుందిరా. ఏదో ఆఫీసులో టైపిస్ట్ గా ఉందిట. నాతో చాలా సన్నిహితంగానే వుంటోంది ఈ మధ్య. నేను శారదని ప్రేమిస్తున్నాన్రా..."

నా నెత్తిన పిడుగు పడినట్లయింది, ఉలికి పడ్డాను. ఈ సారి నేను నిజంగా క్రిందపడ్డంత పనయింది. "నీ భార్య వుండగానే ఈ బుద్ధి ఏమిట్రా?" అన్నాన్నేను ఆశ్చర్యంగా.

"మరి ఏం జేయను. సుశీలకి విడాకులు ఇద్దామనుకున్నాను. కాని తగిన కారణాలు చూపించాలన్నారు. కారణాలు నాకేవీ కనిపించలేదు. ఇంకో విషయం విడాకులిస్తే ఆస్తిరాదు. అందుకని ఆ ప్రయత్నం మానుకున్నా. దైవకృపవల్ల సుశీలకి ఈ జబ్బు వచ్చింది. ఎంత త్వరగా దాటితే అంత మంచిది. మాకా పిల్లలు లేరు..."

"అయితే నీ ప్రయత్నం సుశీల త్వరగా దాటి పోవాలనా?" ఎదురు ప్రశ్న వేశాను.

"కాదు, శారదకు నా ప్రేమ విషయం..."

"తెలిపి..." నా మాట పూర్తికాకుండానే "పెళ్ళికి ఒప్పించమంటాను." అన్నాడు వాడు.

నాకు చిర్రెత్తుకొచ్చింది. "అసలీ పాడు పనికి నేనొప్పుకుంటానని ఎలా అనుకున్నావు?" దాదాపు గర్జించినంతగా మా గోపాలం మీద కేకలేశాను.

"శారద చాలా అందంగా వుం..."

"...దంటావు. నీవే మాత్రం అందంగా వున్నావురా. ఛస్తే నేనీపని చేయలేను" నిక్కచ్చిగా చెప్పేశాను.

గోపాలం నన్ను ఒప్పించడానికి శతవిధాల ప్రయత్నించి, "చూడరా, ఇప్పుడు సుశీలకి ఎలాగూ చావు తప్పదుగదా. పోనీ ఇప్పుడు నేనీ ప్రయత్నం మానుకున్నానే అనుకో సుశీల పోయింతర్వాత నేను ఇలాగే ఒంటరిగా వుండాలా? మళ్ళీ మీరందరూ నన్ను ఒప్పించి రెండో పెళ్ళి చేయించేవాళ్ళా కాదా? అందుకని శేఖరం! నీవు తప్పకుండా ఈ ఒక్క విషయంలో కాస్త సాయపడుదూ" అన్నాడు తెలుగుసినిమాల్లో హీరోయిన్ ని హీరో బుజ్జగించినట్లు.

నాకూ వీడి అయిడియా నచ్చింది. సబబుగానే తోచింది వీడి ఉద్దేశ్యం.

"సరే" నన్నాను.

"అన్నావురా. నాకు తెలుసు నీవు తప్పకుండా ఒప్పుకుంటావని" అంటూ నన్ను అమాంతం రోడ్డుమీదే కౌగిలించుకున్నాడు. "తల్లి గారింటికి వచ్చిన ఆడపడుచు కన్న తల్లిని వాటేసుకున్నట్లు". "చాలా రోజులకి కలుసుకున్న భార్యా భర్తల్లా", "ఆరాధన సినిమాలో నాగేశ్వరరావూ సావిత్రీ కౌగిలించుకున్నట్లూ (ఇక చాలనుకుంటాను ఇన్ని ఉపమానాలు).

తరవాత జరిగిన విషయం మీరు ఊహించుకోగలరనుకుంటా చెప్పడమెందుకులెండి. అప్పుడే లేవకండి. ప్లీజ్, మోర్ సమ్ మినిట్స్!

గోపాలం వూరు చేరుకోగానే మొదట "సెంట్రల్ హాస్పిటల్" కు వెళ్ళాం.

నేను ఊహించినట్లు లేదు సుశీల చాలా చిక్కిపోయి వుంది. పెండ్లినాడు చూచినంత నలుపుగా లేదు. ఇపుడంత పొట్టిగా కూడా లేదు. అంత అందంగా లేకపోయినా "ఆడది" అనేందుకు సరిపోతుంది.

నన్ను చూడగానే తోటకూర కాడల్లా వాలిపోయి వున్న తన చేతుల్తో నాకు నమస్కరించింది బెర్త్ మీద పడుకునే.

ప్రతి నమస్కారం చేశాను. కుశల ప్రశ్నలు అడిగిన తర్వాత నేనూ మా గోపాలం కాస్సేపు అక్కడే కూర్చుని లేచాము. "భయం ఏమీ లేదమ్మా త్వరలోనే తగ్గుతుంది" అన్నాన్నేను.

ఆమె ఏమీ జవాబు చెప్పలేదు. తర్వాత మేమిద్దరం గోపాలం బంగళా చేరుకున్నాము. సాయంత్రం వరకూ మేమిద్దరం పిచ్చాపాటీ సాగించాము. శారద ఆఫీసు నుండి వచ్చింది. ఆమెను నేను నఖశిఖ పర్యంతం జాగ్రత్తగా పరిశీలించాను దూరంనుండే.

"నమస్కారమండీ గోపాలం గారు! వూరునుండి ఎప్పుడు తిరిగొచ్చారు" శారద దగ్గరగా వచ్చి అంది. వీణ పలుకులా వుంది ఆమె కంఠం.

కంఠం వినగానే కరిగిపోయాను. నేనూ ప్రేమించేద్దామనుకున్నాను. కాని మధ్యని గోపాలంగాడు...!

నన్ను ఆమెకీ, ఆమెకు నన్నూ పరిచయం చేశాడు.

"ఈవిడ శారద మా యింట్లోనే అద్దెకి వుంటోంది. బి.ఎ.పాసయింది, ఒక్కర్తే వుంది. ఈమె తల్లిగారు ఇంకా ఊరినుండి రాలేదు. ఈ నెల్లోనే రావచ్చు..."

వాడు ఆమెను నాకింకా పూర్తిగా పరిచయం చెయ్యక ముందే నేను "నమస్కారం" అన్నాను.

"నమస్కారం" అంది ప్రతి నమస్కారం చేస్తూ.

"కూర్చోండి" అన్నాన్నేను సోఫా చూపుతూ. శారద కూర్చుంది.

"వీడు శేఖరం నా స్నేహితుడు తాలూకాఫీసులో గుమాస్తాగిరీ వెలగబెడుతున్నాడు బి.ఎ. వరకూ చదివి."

గోపాలం నా గూర్చి అన్న మాటలివి. నన్ను హేళన చేస్తున్నట్లు వున్నాయి కదండీ. నిజం చెప్పొద్దూ నాకు చచ్చేంత సిగ్గు... సిగ్గు కాదండోయ్ కోపం వచ్చింది కాని పాలపొంగులా చల్లబడ్డాను. నీళ్ళు చల్లినట్లు.

"కథలు రాస్తూంటాడు లెండి. ఈ మధ్యనే ఏదో నవల వెలువడింది వీడిది" నా గొప్పని కూడా చెబుతున్నందుకు ఫరవాలేదని ఏదో సినిమాలో లాగా వేరే ఫోజు కొట్టబోయాను. కాని కుదర్లా.

పై విధంగా మా పరిచయాలు ముగిసి మరో అరగంటకల్లా ఎంతోకాలం నుంచీ స్నేహమున్న వాళ్ళలా మాట్లాడుకున్నాం.

గడిపిన ఆది, సోమవారాలు ఎంతో హుషారుగా గడిచిపోయాయి. ఈ రెండ్రోజులూ శారదకి కూడా సెలవులు కాబట్టి ఆవిడ కూడా మాతోనే గడిపింది. ఓ రోజు షికారుకి ఊరి బయటకి పోయాము అక్కడ పొలం గట్టుమీద నడుస్తూంటే శారద కాలు జారింది, వెనకగా నడుస్తూన్న గోపాలం చటుక్కున చేయిపట్టుకుని వాటేసుకున్నాడు. "ప్రథమ... రంగం" అనుకున్నాను. శారద ఏమీ అనకుండానే "థ్యాంక్స్" అంది, మరోసారి సినిమాలో శారదకి రెండు సార్లు చేయి తగిలించి. కాని ఆమె ఏమీ అనకపోవడంతో నాకు రహస్యంగా చెప్పేశాడు ఆమె కూడా తనని ప్రేమిస్తున్నట్టు"

"ఇంకేం సుశీల పోవడమే తరువాయి కార్యక్రమం అనుకున్నాను.

సోమవారం సాయంత్రం నేను బయల్దేరడానికి బట్టలు సర్దుకొంటున్నప్పుడు హాస్పిటల్ నుండి నౌకరు వచ్చి. "అమ్మగారికి ప్రాణం మీద వుందండీ. అంటూ చెప్పాడు. అప్పుడు శారద ఇంట్లో లేదు.

నేనూ గోపాలం హడావుడిగా హాస్పిటల్ చేరుకున్నాము. అప్పటికి ఆపరేషన్ రూంకి తీసుకుపోయారు సుశీలని.

మేము బయట బెంచి మీద కూర్చున్నాము.

"ఇంతకీ జబ్బు ఏమిటీ?" అన్నాన్నేను నిశ్శబ్దాన్ని భంగ పరుస్తూ.

"కడుపులో ఏదో కాయ కాసిందట" వాడి గొంతుక జీరపోయింది. సుశీల చచ్చిపోవాలనుకున్న వాడే ఇలా అయిపోయాడు వాడి మొహంలో కాంతి లేదు; ఏదో పోగొట్టుకున్న వాడిలా వుంది. వాడి కళ్ళలో నీరు స్పష్టంగా నాక్కనిపించింది వాణ్ణింక ఏమీ ప్రశ్నలడగలేదు.

కాలం గడుస్తోంది

గదిలోంచి డాక్టరు వచ్చాడు చెమటని తుడుచుకొంటూ.

"ఎలా వుందండీ?" ఆతృతగా అడిగాడు గోపాలం.

"ఈ రోజు గడిస్తేగాని చెప్పలేం, ఈ రోజు కాదుగానీ ఇంకో మూడు గంటలాగాలి" అన్నాడు డాక్టరు. తర్వాత ఆయన మళ్ళీ లోపలికి వెళ్ళిపోయాడు.

నేను నిశ్శబ్దంగా వుండిపోయాను.

"ఒరేయ్ శేఖరం నీవు యింటికెళ్ళు. నేను తర్వాత వస్తాగానీ" అన్నాడు.

నేను "సరే"నని ఇల్లు చేరుకున్నాను. అప్పటికే శారద వచ్చింది. శారదని చూడగానే నేను వచ్చిన పని జ్ఞాపకానికి వచ్చింది.

ఆమె ప్రవర్తన అలా వుంది కానీ ఆమె అభిప్రాయం కూడా కనుక్కోవటం ముఖ్యమనిపించింది నాకు. ఏమైనా కానీ ఆమెని అడిగి తెలుసుకోవాలనిపించింది.

గోపాలం యింటికి రావడానికి యింక అరగంటే వుంది. శారదని అడగాలని నాలో ఉత్సుకత ఎలా ప్రారంభించాలో తికమక పడి ధైర్యంగా ఆమె గది లోకి వెళ్ళా.

"రండి! రండి!" శారద నన్ను చూసి ఆహ్వానించింది. ఆమె చేతిలో ఏదో ఇంగ్లీషు నవల వుంది.

"గోపాలం ఇంట్లో లేడాండీ" నేను ఎలా పలుకరించాలీ అన్న సంధిగ్ధావస్థలో వుంటంతో ఆమె పలుకరించింది.

"లేడండి ! సుశీలకి ప్రమాదంగా వుందిట. మరో అరగంటకి ఏ విషయం తెలుస్తుంది." ధైర్యం కూడగట్టుకుని మాట్లాడేను.

"అరే! నేను యింట్లో లేనండీ. పాపం మంచి ఇల్లాలు. ఆమె బ్రతకాలని వెయ్యి దేవుళ్ళకి మొక్కుకుంటున్నా"నంది.

నేను ఉలిక్కిపడ్డాను. 'ఏమిటీ' అనుకున్నాన్నేను. ఈమె అన్నట్లే సుశీల బతికి బయటపడితే?

"శారదగారూ ! (మొట్టమొదటిసారిగా నేను ఆమెను పేరుతో పలుకరించాను) మా గోపాలం... మా గోపాలం..." తర్వాత నసిగాను.

"అవును, కట్టుకున్న భార్య బాధ పడుతూంటే బాధ కలగదూ" అంది శారద.

"అది కాదండీ, మా గోపాలం మిమ్మల్ని మనసారా ప్రేమిం..." నా మాట పూర్తి కాకుండానే ప్రజ్వరిల్లింది శారద.

నేనూహించినదానికి వ్యతిరిక్తంగా జరిగింది.

"మీ గోపాలం మనిషేనా? అని కట్టుకున్న భార్య కళ్ళెదుట ఉండగానే నన్ను ప్రేమించారా చదువుకున్న మగాడు బుద్ధివుందా."

నేను కుర్చీకి అంటుకుపోయి మాట్లాడకుండా నోరు తెరిచా...

"అందుకేనా మొదట అద్దెకి గది లేదంటూ తర్వాత స్వయంగా పిలిచి గది ఇచ్చారు... అయినా మీకేనా బుద్ధిలేదాండీ మీరు కూడా మందలించక పోయారు నాకు ఆయన మీద ఇలాంటి అభిప్రాయం ఏనాడూ, ఏకోశానా లేదు. మీరింక వెళ్ళవచ్చు. ఆయన వచ్చిన తర్వాత గది గూర్చి అడుగుతాలేండి" ఆమె రుసరుస లాడుతూ మాటలని పూర్తి చేయక ముందే నేను గబుక్కుని బయటకు గెంతి, వెళ్ళి గ్లాసెడు నీళ్ళు త్రాగి "బ్రతుకు జీవుడా" అనుకుని సోఫాలో కూలబడ్డాను. జరుగబోయేదాన్ని గురించి ఆలోచిస్తూ.

వాడొచ్చాక జరిగినదంతా చెప్పేస్తే "ఇలాగేనట్రా అడిగేదని" తనూ నన్నే కోప్పడితే "అబ్బాయ్! నేను రానంటే బలవంతంగా నువ్వే తీసుకొచ్చావ్, అందుకు నాది కాదు తప్పు" అంటా అనుకున్నాను.

ఇలా ఆలోచిస్తూండంగానే ఎదురుగా గోపాలం కన్పించాడు. వాడు కన్పించిన రీతి నాకు భయం కల్గించింది. వాడు చాలా ఉత్సాహంగా వున్నాడు వాడి మొహాన చిరునవ్వు తొణికిసలాడుతోంది. నాకు ఈ విషయం చెబ్దామా? వద్దా?? అన్న ప్రశ్నలు ఎదురుగా నిలిచాయి.

"ఒరేయ్! శేఖరం నా సుశీల... సుశీల.. అవునుగానీ శారద ఒప్పుకుందిరా.. ఒక వేళ ఒప్పుకుంటే క్షమించమని చెప్పు! నేనిప్పుడు ఆవిణ్ణి ప్రేమించను పెండ్లి చేసుకోను, అయినా నా సుశీల వుందికదా" అన్నాడు అతి సంతోషంగా నాకు అనుమానం కలిగింది "పిచ్చి పట్టిందేమో"నని.

"అసలు విషయం తెలుసా నా సుశీల బ్రతికింది. ఇక ఈ జబ్బువల్ల ముసలితనం వరకూ ఏ ప్రమాదం రాదట. నా సుశీల నాకు వుంది అయినా యిపుడు సుశీల అందంగా లేదూ" అన్నాడు వాడు.

"డామిట్! కథ అడ్డం తిరిగింది. అయినా ఇదీ మన మంచికేరా" అంటూ అసలు విషయాన్ని ఇదే సందని వాడికి చెప్పాను.

వాడు "నిజం?" అంటూ శారద గదిలోకి వెళ్ళాడు.

మరో పదినిముషాలకి నా దగ్గరకి వచ్చి "శారద నిన్ను ప్రేమించిందటరా!" అన్నాడు.

# రోజులు మారిపోయేయి

## - దేశిరాజు

### (ఆంధ్రవాణి - 1950 జనవరి 29 సంచికనుంచి పునర్ముద్రితం)

నేను యిక్కడకు వచ్చేక ఓ పెద్ద జాబు వ్రాద్దాం అనుకుంటూ అశ్రద్ధ చేసేను. ఇలా వుత్తరాలు రాయడం నాకు అలవాటు. అలా అంటే అనుమానం పడుతావు. అంతగా ప్రేమించే నా హృదయాన్ని 'విధి' నిరాశ చేసింది. ఎట్లాగో ఆటంకాన్ని కలిగించింది. ఆ ఆశ మటుకు నాలో నాటుకు పోయింది.

వసంతకాలంలో చిగిర్చిన ప్రతీ ఆకూ ఆమె సందేశం యిస్తూనే వుంటాయి. లేచిన అల విరిగి బీచిమీద పడ్డప్పుడల్లా ఏదో జ్ఞాపకం వస్తుంది. ఏదైనా అంటే ఎత్తిపొడుపుగా 'పెళ్ళి చేసుకున్నావుగా' అంటావు. ఈ చాకిరి, పడకగది, తలచుకుంటే ఏడ్పు. ముక్తిలేని సాధనాలు కదా అని తలపుకు వస్తుంది.. ఊరికే కారణం లేకుండా జరిగిన సంగతులు, తెలిసిన మధ్య తటాలున జ్ఞాపకానికి వచ్చి, ఎండలో మబ్బులో చెట్లగాలిలో ఆ పోలిక గలిగి సిగ్గుపెట్టి, బాధిస్తాయి. ప్రేమలో ఈ అసాధారణ సంఘటనలు కలగటం, ప్రజాలోకాన్ని బాధ పెట్టదానికే కాబోలు.

ఆ దినాలు ఒక పెద్దపేజీలా తిప్పి వేశాం. యివి కొత్తదినాలు. ఆ విస్మృతులు మాత్రం ఆ రోజా దినాలు వెళ్ళిపోయాయి– మనం తలుచుకొన్న కొద్దీ యీ గడుస్తున్న గడ్డుదినాలు కూడా కొన్ని ఏళ్ళ తరువాత మధురంగా కనిపిస్తాయి అందుకని కలలుకంటూ వుండకూడదు.

నాకు ఒంటరితనం అలవాటు. ఒక్కడ్నీ ఎంత దూరమైనా వెళ్ళిపోగలను అంచేత తోచని సందేహాలు, సందేశాలు కనబడుతాయి. ఒంటరిగా గడపడం స్త్రీ సౌందర్యం వృధాపోనిచ్చినట్టే అని నవ్వుతూ ఓమారు మధ్య అన్నావు, నిజమేనేమో?

మన నేస్తం అదోరకమయింది – అణా పైసలు లెక్కపెట్టుకున్నాం. యిక ఆ రోజులుండకూడదు. ఆలోచిస్తే చాలా 'సిల్లీ'గా కనబడుతుంది కదూ!

ఆ గోదావరిలో చిన్న చిన్న నావలు బేడకో అర్థకో తీసుకొని నదిలో ప్రయాణం చేసిన దినాలు, కొవ్వూరులోకి పోయి నావొద్దున పడేసి పొద్దున్న మళ్ళీ నావోడు తిడుతుంటే వింటూంటే ఆదో హాయి.

అన్నీ తలచుకుంటే జీరోపాయింట్ కే వస్తాం. నిద్రలో రాజుకీ జోగికీ బేధం లేనట్టే. జమిందారు అయినా కింద్రా మీదా పడాలి పిల్లలకోసం. కాని సామాన్య మానవులకు 'కామన్ మెన్' కి ఈ భ్రమలు చాలా అనవసరం కదూ.

మన జీవితపు విలువ, మనం దినం ఆచరించే పనుల 'క్వాలిటీ' మీద ఆధారపడి వుంటుంది. ఒక్క నిముషం నిశ్చింతగా ఈ చాకిరీ వదిలి, పిల్లలూ, చెట్లూ, ఆకాశాన్నీ, సముద్రాన్నీ, చూసేందుకు అవకాశం యిస్తే, మనస్సుకు ఎంతో హాయినిచ్చేవాళ్ళం అవుతాం.

ప్రాతఃకాలం శాస్త్రుల్లు యింట్లో పనస తొనలు దొంగలించి ముఖం కడగటం మాని తిన్న రోజులు, అట్లతదియకు ఆడపిల్లల ఆ పరికిణీ జాకట్టు అందం చూస్తూ తెలియని రోజుల్లో గడిపిన దినాలు, మచ్చుకయినా రావు మరి– నూనుగు మీసం మొగ అందంకి, పరికిణీ బాడీ అమ్మాయికి అందాన్ని పురికొల్పుతాయి, ఉసి కొల్పుతాయి మనకేం తెలుస్తుంది. ఆ స్వప్న దినాల్లో ప్రపంచం అందాన్ని వాళ్ళు దాచేస్తారని. మారు పేర్లు పిల్చే దినాలు ఓ త్రిల్ యిచ్చేవి కూడా.

స్వతంత్రప్రాప్తి అయ్యాక ప్రతీవారు సంతోషాన్ని పొందలేక పోవడం మన దురదృష్టమేమో కాని నమ్మకాల విషయంలో మనం చాలా ఆరితేరేమని చెప్పచ్చు – 'మధుర' లో ఎంతో చక్కగా గత స్వతంత్ర దినం జరిగిందని చదివేను – మీనాక్షి దేవాలయ ఆవరణలో నూటొక్క దీపాలతో అమర్చబడి లక్ష అర్చనలు జరిగేయి. అవన్నీ ఆ పురాతన గ్రామంలో ప్రజలు ఆనందంగా నిశ్చింతగా వుత్సవం చేసుకున్నారంటే ఎంతో సరదా వేసింది.

గుళ్ళో నాగస్వరం, చల్లని గాలి, తోటలో మిడుతలు, సంపూర్ణమయిన తృప్తి జాబిల్లి చల్లన కిరణాలతో పూర్తికదూ మనకి.

ఆ రోజుల్లో కన్నమ్మ అమ్మని కన్నమ్మమ్మమ్మ అనడం, ఏకాశికి చిలిమిడికి కొబ్బరికాయలు కోయమంటే చెట్టునుండి పద్దరోజు జ్ఞాపకం తగని కడుపునొప్పి – నాన్న అడిగితే నూతి దగ్గర పడ్డానని చెప్పాల్సి వచ్చింది – అది విని నువ్వు విరగబడి నవ్వడం యిప్పటికీ జ్ఞాపకం.

నేను ఎన్నో సార్లు వ్రాసేను నువ్వు చాలా హాయిగా బ్రతుకుతున్నావని విశాఖలో. కాని నువ్వు వప్పుకోవు – ఆ కొండలూ, సముద్రం, పాతపడని అందము, కొబ్బరినీడ, సాయంత్రం నీరెండ, వెన్నెట్లో మెరిసే యిసిక కెరటాల మీదుగా నీటి అలల తుంపరలు, హృదయాన్ని ఆకర్షించవు – స్టేషన్ లో నీలి – ఎర్ర దీపాలు, ఏదో భావన అందివ్వడం, సెర్చిలైటులా లైటు హౌసు దీపం, కాంతి చారలూ, మనస్సంతా బాధచేత ఆ తాత్కాలికంగా (మరచి పోయిన) తమ క్షణాల్ని జ్ఞాపకం చేస్తూ మాధుర్యంతో ప్రతిఫలించదూ?

నేనంటే నీకెందుకో ఆ అభిమానం తెలియదు కారణాలు తెలియకుండా కలిసాయి మనసులు– జరిగి పోయిన ఘడియలు వెనక్కి చూసుకుంటే చాలా హాయిగా వుంటాయి. అలాగే మీతో గడిపిన దినాలూనూ.

ఆ తేనెలలో తడిసిన ఆమె పెదాలు, పెదవుల నీడల్లో ఆమె చూపులు జ్ఞాపకానికి వచ్చినప్పుడల్లా, ఇంకా నాకోసం ఫీల్ అవుతుందా, అడ్వైస్ చేస్తుందా, అనిపిస్తుంది. ఆమె మెడ, ఆ జారే ఉంగరాల జుత్తు, మనుపుగా ప్రవాహపు నునుపులా జాకట్టుకింద అందం; మెత్తని ఆమె బుగ్గలు, రెఫ్లెక్ట్ అయే ఆ శరీర కాంతి, కాంతిచానల్లా అగుపడేవి– ఎంతని నా ఆరాటం నీకు రాయను.

ఇదంతా నీకుందా? ఆలోచిస్తావు గాని నీ ఆలోచనకి అర్థం లేదేమో! 'నేను' అని నువ్వు అనుకున్నప్పుడే ఆ విలువ విలువకట్టేధర మనయిద్దరికీ ఒకటే అనితోస్తే సమస్యే లేదేమో ?

అప్పటి స్నేహాలు వేరుగా అగుపిస్తున్నాయి ఈ రోజుల్లో – నిస్పృహ – నిరాశ సూచించే ఈ దినాలు, సువర్ణాక్షరాలతో లిఖింపబడ్డ ఆ దినాలలో ఓ దీపపు సెమ్మెలా అగుపడుతాయి కదూ.

అస్తమించే శుక్రుడు, గడ్డిమీద మబ్బుబొట్లు, దూరంగా పోయేబళ్ళు, వీచే చలిగాలి, కొండపక్కగా పారే సెలఏరు, తెలియని పిట్టల భాష, ఆమె గడ్డం కిందపడే చిన్న లొత్త, ఎంత అందాన్ని, హాయిని ఇస్తాయి చెప్పు ఆలోచిస్తే –

మనం పొలాల మీదుగా, కాలువ నీటి పక్కగా, నీడల్లోంచి, పోతూ ఒకప్పుడు 'ల–' ని వెక్కిరించడం జ్ఞాపకంఉందా– పాపం ఎంత బాధ పడి ఉంటుందో – కాని ఆమెకు అలా అనిపించుకోడం సరదాలేదేమో?

అప్పుడప్పుడు కొండల చాటున, యిసికలో చుట్టూ చల్లని వెన్నెల, పొదల చాటుగ రాత్రి ముద్దుల మ్యూజిక్ లో, కెరటాల డాన్సు చూస్తూ నక్షత్రాల విజిటర్స్ కళ్ళు కప్పుతూ ఓ డ్రై జిన్ తో గడిపిన జీవితంలో అమరసుఖం లేదూ?

'మీ–' వదిలిన చోటు బాధిస్తుంది– చిన్న చినుకు, తములపాకులు, పోక చెక్కలు, దోసెట్లే వచ్చిన మల్లె చప్పున మనస్సుకు స్ఫురించి నాలో నేను కుమిలిపోవడం సముదాయించు కోవడమవుతుంది. ఆమె ఒంపుల్ని నవ్వుల్ని నావిగా ఆ రోజుల్లో భావించాను – ఇంక ఆమెను చూసే భాగ్యంలేక విచారించాలి. అందుకే ఆ జ్ఞాపకాలు నీకు వ్రాయడం, రోజులు మారేయి కనుక.

# చెప్పు తెగింది

– కె.గోదావరి శర్మ

(అనామిక – 1978 జనవరి సంచికనుంచి పునర్ముద్రితం)

"ఒరేయ్ ప్రపంచంలో అతివిచిత్ర వస్తువుల్లో ఓ దాని పేరు చెప్పు ?"

"నువ్వే చెప్పు"

"చెప్పు చెప్పుర్రా నాయనా! లోకములో చెప్పులంత విచిత్ర వస్తువు నాకింకేదీ కనిపించలేదు... హైహీల్డ్ చెప్పులూ ప్రేమా ఒకేలాంటివంటే నమ్ముతావా నువ్వు!? హైహీల్డ్ చెప్పులు మనిషినీ ప్రేమ మనసునీ ఎత్తుగా నించో పెడతాయి. అలాంటి గొప్ప చెప్పులని... అరిగిపోతేనో తెగిపోతేనో మూలపడేస్తాం. చెప్పులమీద నిన్నో చిన్న కవిత్వపు ముక్క రాయబోయాను. వింటావా?"

శ్రోత తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతున్నవాడిలా మొహం పెట్టాడు.

"తప్పదంటావా?"

"నాలుగు లైన్లేన్రా బాబ్బాబు. నీకు పుణ్యం ఉంటుంది. విను సాయంత్రం కాఫీ బిల్లు నాదేలే.

జరిగిపోయిన కాలం
అరిగిపోయిన చెప్పు;
నిన్నటి పేపర్లో కాలం
నేడు పనికొస్తుందా చెప్పు?"

"ఇంతేనా?! ఒరే, ఇకముందు ఇలాంటి చినచిన్న ముక్కలే రాయిరా. బ్రీఫ్ గా రాస్తే ఆముదంలా ఉన్నా అరిగించుకోగలం, కాఫీల్లేకపోయినా సర్దుకోగలం. నువ్వు మరీ ఇతిహాసాలూ ప్రభంధాలూ రాసేసి అమాయకుణ్ణి నేనొక్కడినే దొరికేనని నన్ను కుర్చీకి కాఫీ టిఫిన్లతో కట్టిపడేసి నా నవరంధ్రాల్లోంచి నీ కవితారసం ఇంజెక్ట్ చెయ్య బూనడం మహా పాపం. నిన్ను ఆ దేవుడు కూడా క్షమించడు." ఆఖరి వాక్యం అక్కినేని నాగేశ్వరావుని అనుకరిస్తూ.

"పర్లేదురోయ్, నా ప్రభావం నీమీద కూడా పన్జేస్తున్నట్టుంది. నువ్వు కూడా పొయిటిక్ గా మాట్లాడడం నేర్చుసుకుంటున్నావే!"

"మరేఁ! బాధలోంచే కవిత్వం పుడుతుందటగా? నా బాధముందు ఆ వాల్మీకి బాధ ఓ బాధా?" తనని కవిమిత్రుడి సాయంకాలనికి ఎరగా వేసి సినిమాహాల్లో దాక్కున్న మిత్రుల్ని తిట్టుకుంటూ.

"సరేగాని నా కవితా ఖండిక ఎలాగుందో చెప్పనే లేదు." ఆశగా చూస్తూ కడుపునొప్పి మరింత తీవ్రమైనట్టుంది. మొహం మీద మాత్రం మొహమాటంలా చిరునవ్వు.

"బాగుందిలే, నువ్వు రాయడం, బాగుండకపోవడమూఁనా?"

"కాఫీ ఇస్తానన్నది కవిత్వం వినడానికే. ఆ మాత్రానికే మెచ్చుకోనక్కర్లేదు. బాగులేకపోతే మొహమాట పడకు."

గదిలో మూల చల్లటి నీళ్ళకుండ. లేచి ఒక్కటిచ్చుకుని, "చాలా బావుంది." ఆశ్చర్యం, రెండ్రూపాయల కోసం చన్నీళ్ళలా గదంతా ప్రవహించాయి.

"నీ యిలస్ట్రేషన్ మండిపోనూ. నోటితో చెపితే చాలదూ? కుండ బద్దలు గొట్టి మరీ చెప్పాలా ?" అభిషిక్తమైన వస్తుజాలాన్ని ఎత్తైన సురక్షిత ప్రాంతానికి తరలిస్తూ.

"అబ్బే, కాస్త ఎంఫటిక్ గా ఉంటుందనీ!"

కాఫీ వచ్చింది. ఇద్దరూ త్రాగారు. మూడో జీవం ఈదుకుంటూ ప్రవేశించింది. "హేమిటి! మనవాడి కవితా ప్రవాహమా? కవిత విని కారిన కన్నీటి ప్రవాహమా ?"

"ఊహూఁ. మన కవి కుమారుడేదో చెప్పుగురించి కవిత చెప్పబోతే సహృదయ రసికులు మెచ్చి వెలువరించిన అభినందనా ప్రవాహం."

"సరే సరే. ధామ్మనే వార్తాహుటి తెచ్చాను. దానితో ఈ ప్రవాహాలకి ఆనకట్ట పడుతుంది. ఆనక ఏం జరుగుతుందో సినిమా ప్రోమిస్ వల్లనే చెప్ప బడుతుంది. ఇప్పుడే వెధవలిద్దరూ కాఫీల్తాగేసినట్టు కనిపిస్తుంది."

"ఏడవకు. నీకు నచ్చిన సినిమా గ్రాంటయింది. వార్త చెప్పి చావు. దశ దిశలకీ పరిగెత్తిన నా కవితాబాణాలకి ఏ ఎడిటరైనా విహతుడయ్యాడా ? అడ్రసులు దొరికిన అమ్మాయిలందరికీ పంపబడ్డ లౌలెటర్ తాలూకు సైక్లోస్టయిల్డ్ కాపీల్లో దేనికైనా రెస్పాన్సు వచ్చిందా? హఠాత్తుగా మన నాన్నల్లో ఎవరైనా పుత్రప్రేమ పెల్లుబికి నెలలో రెండో సారి ఎం.వో పంపించాడా? మన ప్రిన్సిపాలుడు ఈ అభినవ గోపాల కృష్ణుడి నూట ఒకటో తప్పుని క్షమించలేక సస్పెన్షన్ మెమో పంపించాడా? ఏం జరిగిందో వివరంగా విశదంగా చెప్పు" హలిసిపోయి, గ్లాసుడు నీళ్ళు త్రాగుదామనుకుని, లేక, ఆయాస పడుతూ కూర్చుండిపోయాడు.

"చెప్పు"

"చెప్పు?!"

"చెప్పు ?!"

"సరిగ్గా చెప్పు."

"నీ ప్రేమ పత్రపు కాపీ ఒకటి అందుకున్న ఓ భామామణి నీకు తన ఎడమకాలి చెప్పు బహూకరిస్తానంది. 'రెండోది కూడా ఇచ్చి పుణ్యం కట్టుకో తల్లీ, భరతుడిలాగా మావాడు వాటినే పూజించుకుంటా'డని చెప్పేను. ఇవ్వకుండా 'హూఁ' అనేసి వెళ్ళిపోయింది. అలా వెళ్ళినది వాళ్ళ నాన్న దగ్గరికి వెళ్ళింది. ఆయన మీ నాన్నకి బాల్యస్నేహితుడు కావడం వల్ల విషయం మీ నాన్నవరకూ వెళ్ళింది. నీ ఆతృతని సహృదయతతో అర్థం చేసుకున్న మీ నాన్న ఈ సమ్మందం ఖాయం చేసుకోవడానికి వస్తూ ప్రిపరేషన్ కోసం నీకో రెండువందలు మనియార్డర్ కూడా చేసేడు. అంచేత నువ్వనుమానించిన వాట్లో చాలా నిజమే, నేనిప్పుడు... అదుగో పోస్టుమాన్ వచ్చేస్తున్నాడు. లేవండ్రా. అప్సరాకి ప్రస్థానం ప్రారంభించండి. ఏవీ సినిమా పక్షులు రెండూ గూటికి చేరుకోలేదా ?"

"ఊహూఁ ! ఔరా ! మనవాడు జరగబోయే సన్మానాన్ని ముందే ఊహించి కాబోలు అప్పుడే చెప్పులమీద కవిత్వం రాసేశాడే! హాశ్చర్యం !"

"రండి పోస్టుమాన్ గారూ, రండి." చిరునవ్వుతో వచ్చే పోస్టుమాన్ కెప్పుడూ గౌరవ సంభోదనమే నెలకొకసారి.

రెండువందలు. 'చి.కుమారునకు ఆశీస్సులు. మీ ఊళ్ళో నల్లమందు నాగరాజు గారమ్మాయితో నీ సంబంధం విషయం మాట్లాడడానికి ఆదివారం బయలుదేరి వస్తున్నాను. ఈ డబ్బుతో మంచివి ఓ జత బట్టలు కుట్టించుకోవలెను. చదువు, ఆరోగ్యం జాగ్రత్త --నీ తండ్రి" రెండువందలు జేబులోకీ, ఎం.వో.కూపన్ ముక్కలు కిటికీ లోంచి బయటికి.

“పదండి, పదండి”

“సరేగానీ రేపాదివారం నిజంగానే మా నాన్న దిగిపోతే ! నాక్కట్టుకోడానికి సరైన గుడ్డముక్కైనా లేని సంగతి మీకు తెలుసుకదా! పెళ్ళి చూపుల కెలా వెళ్ళడం?” ఆందోళనావేదనాతృతలు.

"పోవోయ్, మేం లేమూ?” చిరునవ్వుతూ.

★ ★ ★ ★ ★

ఆదివారం వచ్చింది. ముసలాయనని భుజాన వేసుకుని దగ్గు ముందొచ్చి దాని వెనక తండ్రి వచ్చాడు. అంతకి రెండురోజుల ముందు పెళ్ళి చూపుల కుమారుడికి అమ్మాయి దగ్గర్నుంచి గౌరవకరమైన జవాబు వచ్చింది. కవికుమారుడితల మబ్బుల్లో (బంగారు కిరీటం ధరించి) విహరించింది. ముందుచూపు గల కుర్రాళ్ళు గది స్వరూపాన్ని మార్చేశారు. జ్యోతిలక్షి శ్రీకృష్ణుడి వెనక దాక్కుంది. ఖాళీ బీరు సీసాలు మంచినీటితో నింపబడ్డాయి, లేబుల్స్ చింపేసి. పేకలూ సిగరెట్టు పీకలూ పక్క రూములకి వలస వెళ్ళేయి.

"ఊఁ ! ఇంతకీ చదువెలా ఉంది ? డబ్బు పంపమనే గానీ చదువు సంగతీ, ఆరోగ్యం సంగతీ ఉత్తరాలు రాయరు కదా !” కుర్రాళ్ళ వినయం తలొంచుకుంది. భూతదయగల కుర్రాళ్ళు, సాలీళ్ళు తమ పుస్తకాలే గోడలుగా ఇళ్ళు కట్టుకుంటూంటే వాటిని డిస్టర్బ్ చేయ్యదలుచుకోలేదు.” ఈ పుస్తకాలన్నీ పనికొచ్చేవేనా లేక...” అని అనుమానిస్తూ వాటి మీద చెయ్యి వేసేటంతలో ఝుమ్మంటూ దోమలూ ధూళీ ఆ ప్రయత్నానికి అంతరాయం కలిగించేయి.

“ఊ ! సరే బయల్దేరు టైమవుతోంది. ఏవోయ్, మీరెవరైనా కూడా వస్తున్నారా మాతో?”

“అబ్బే, ఎందుకులెండి. ఇందర్ని చూసి ఆ అమ్మాయి బెదిరిపోవచ్చు!” అసలు రహస్యం, రోజూ పార్కుదగ్గర ఈలలు వేసే గ్రూపే ఈ రోజు హఠాత్తుగా ఇంట్లో ప్రవేసిస్తే కుర్రాళ్లతో బాటు పొరపాటున ముసలాయనక్కూడా దేహశుద్ధి జరిగే ప్రమాదం లేకపోలేదు.

“అంచేత, మీరు వెళ్ళిరండి.”

“ఊఁ ఇవేనేమిటోయ్ కొత్తబట్టలు ?" అనుమానం. సరిపోయే బట్టలే ఇస్తానని చెప్పి ఇపుడు ప్రతి కొలతా మూడంగుళాలు ఎక్కువ గల బట్టలిచ్చి ఎటో చూస్తూ నిలబడ్డ మిత్రుడివైపు నిస్సహాయంగా చూసి,

"అదే! ఆ టైలరు... పొరపాటున నా బట్టలు ఇంకెవరి కొలతలతోనో కుట్టేశాడట... ఈరోజుకిలా కానీండి. సాయంత్రం మళ్ళీ వాడికే యిచ్చి రిపేరు చేయిస్తాను."

‘సర్లే ! ఏపని సవ్యంగా చేసి ఏడిసేవు గనక ! పద పద నేనలా ముందువెళ్ళి ఓ కిళ్ళీ కట్టించుకుంటాను. త్వరగా తెమలిరా!’

‘ఏవీ నా చెప్పులేవీ? ఓహో తెగేయి కదూ! ఒరే నీ చెప్పులేవిరా ?’

"ఒరే నా బూట్లు వేసుకు వెళ్ళరా"

"ఊహూఁ ఎందుకూ దీనికోసం ప్రత్యేకంగా మేకప్ అయి వెళ్ళినట్టు వెళ్ళడం? సహజంగా ఉండాలి." పోజుగా అంటూ మంచం కోడుక్రింద ఇరుక్కుని డొప్పలా అయిపోయిన చెప్పుని అటూ ఇటూ వంచి బాగుచేశాడు.

"జాగ్రత్తరోయ్ దార్లో అవి నిన్ను అన్యాయం చెయ్యవుగదా? పాపం అప్పుడే రెండు మూడు కుట్లు పడ్డట్టున్నాయి. ఈసారి ఆపరేషన్ అయితే ప్రాణానికే ముప్పు."

‘ఫర్లేదులేవోయ్’ స్వంతదారు హామీ. ‘ఈ చెప్పులు చాలా విశ్వాసంగా నన్ను సేవిస్తున్నాయి. ఏదో మొన్న సినిమాకి వెళ్ళినప్పుడు... ఓ స్త్రీ నా అడుగులో అడుగు వేసి నడిచింది. దాంతో నా చెప్పులకి ఒళ్ళూపై తెలియలేదు. అంతేగాని మామూలు పరిస్థితుల్లో అవెప్పుడూ కాలికింద చెప్పులాగే ఉంటాయి.’

‘వెధవ్వీట్టు’ చెప్పులు వేసుకుని ఇరుకు గదిలోనే ఇటూ అటూ పచారు చేసి, ‘ఒరే ఏడడుగులు వేసినా అనుబంధం కుదరలేదురా!’ ఆఖరి క్షణంలో నిస్సహాయత.

'మరేం బెంగ పెట్టుకోకు, మొదట్లో అలాగే ఉంటుంది. కొత్తచెప్పులూ కొత్త పెళ్ళాం కొంతకాలం కరుస్తారు. మరి కొంతకాలం అరుస్తారు. ఆ తర్వాత అణిగిమణిగి ఉంటారు.'

ప్రస్థానం ప్రారంభమైంది. తండ్రి వెనక కొడుకులా, సిన్సియారిటీ ముఖం మీద ధరించి, తనవికాని బట్టల్లోఇబ్బందిగా కదులుతూ, రోడ్డుమీద వాళ్ళంతా ముళ్ళలాంటి చూపులతో తననే గుచ్చుతున్నట్టు అనుభూతి, 'ఊళ్ళోకి కొత్త సర్కస్ ఏదీ రాలేదు. నేను అందులో బఫూన్ ని కాను' అని అందరికీ చెప్పాలనిపించింది. అప్పుడప్పుడు వెనక్కి తిరిగి త్వరపడమనే రిమైండర్ చూపులు. ఇష్టమైనట్లల్లా నడిస్తే పాదరక్షలు ప్రతఘటిస్తాయి.

వాళ్ళిల్లొచ్చింది. 'హమ్మయ్య' పెళ్ళి వారిని గుమ్మం దగ్గరే అలా ఆపి పాఠకులకు కొన్ని విషయాలు చెప్పాలి, అంటే మనియార్డరు రావడానికీ ముసలాయన రావడానికీ మధ్య వ్యవధిలో జరిగినవన్నమాట. పంపబడ్డ అనేక ప్రేమ పత్రాలలో ఒక్కదానికే జవాబు వచ్చినందుకు హీరో బాధపడలేదు. నాటినుండి ఆ స్త్రీనే సీతాదేవిగా, తననే రాముడిగా ఊహించుకుని ఏక ప్రేయసీవ్రతం ప్రారంభించాడు. అయితే ఈ జవాబు రావడంలో 'థియరీ ఆఫ్ కో–ఇన్సిడెన్స్' అన్నది ఒకటి పనిచేసిందని అతనికి తెలీదు. ఆ అమ్మాయి అడ్రసు 'సంపాదించడం' తన ఘనకార్యం కాదనీ, ప్రేమలేఖలు రాసే ఉద్దేశ్యంతో అతను అడ్రసులు సేకరిస్తున్న సమయంలో ఈ అడ్రసు కూడా అతనికి 'అందించబడిందనీ' వీళ్ళ పెళ్ళిని చాలా కాలమై ప్లాన్ చేస్తున్న వాళ్ళ తల్లిదండ్రుల ప్రయత్న ఫలితమే ఇదనీ, తను రాసిన ప్రేమలేఖకి జవాబు ఆ తండ్రే అమ్మాయిచేత జాగ్రత్తగా డ్రాఫ్ట్ చేయించి పంపించాడనీ, ఇతని ప్రేమ పిచ్చి వ్యవహారం గమనిస్తున్న ఆ అమ్మాయి త్వరపడమని తండ్రికి సలహా ఇచ్చిందని పాపం ఇవేవీ అతనికి తెలియవు. హీరోకి తెలియక పోయినా కథకుడికి తెలుస్తాయి కదా! పోనీలే పాఠకులని మీక్కూడా రహస్యాలన్నీ చెప్పేస్తున్నానన్నమాట. ఇవన్నీ మీరు వెళ్ళి ఆ కుర్రాడికి చెప్పెయ్యకండి. పెళ్ళయ్యాక శోభనం గదిలో ఆ అమ్మాయి చేతే చెప్పిద్దాం అవన్నీ.

ఏం? ఇంతకీ ఇప్పుడు పెళ్ళివారు పెళ్ళి చూపుల కొచ్చేరు కదా! ఆహ్వానాన్నీ నమస్కారాల్నీ అందుకుని లోపలికి ప్రవేశిస్తున్నారు. అసలే అబ్బాయికి ఆతృతగా ఇంకేదోగా ఉంటుందా? చూపులు లైట్ హౌస్ కిరణాల్లా ఆ అమ్మాయిల కోసం చుట్టూ గాలిస్తున్నాయా అలాంటప్పుడు ఎవరూ నేల చూపులు చూడరు కదా! ఆ సమయంలో విశ్వాసంగా ఉండవలసిన చెప్పులు ద్వారబంధాన్ని ముద్దు పెట్టుకుని, బద్ధకంగా ఒళ్ళు విరుచుకుని, బంధాలన్నీ సడలించుకుని, యజమానిని అమాంతం ముందుకి బోర్లా పడేటట్టు చెయ్యడం ఏం న్యాయం చెప్పండి ? కాని ఈ చెప్పులకి చిలిపితనం యెక్కువ. సరిగ్గా అలాగే చేశాయి. సాష్టాంగ ప్రమాణం చేస్తున్న అల్లుడిని చూసి మురిసిపోయాడు మావగారు. ఆహా ఏం వినయం ! ఏం వందనం.!!

"లే నాయనా ఇంకా ఈ రోజులలో ఇంత చాదస్తమేమిటి?" అన్నాడు.

ప్రక్క గదిలో అమ్మాయి మాత్రం పెళ్ళి కొడుక్కి మంచి చెప్పులజత కానుకగా ఎవరైనా చదివిస్తే బాగుండును అనుకుంది.

# కదిలే నీడలు

## - బాలగంగాధర తిలక్

### (ఆంధ్రపత్రిక – ఆదివారం సంచిక మే 7, 1944 నుంచి పునర్ముద్రితం)

'చీకటి' అన్నాడతను.

'అవును' అంది ఆమె.

ఇద్దరూ రోడ్డు మలుపు తిరిగారు. ఇప్పుడు వచ్చిన రోడ్డు మరీ పెద్దదిగా వుంది. ఈ వైపూ ఆ వైపూ మేడల వరుస ఆ నిశ్శబ్దంలోనూ, చీకటిలోనూ, ఆలోచన లేని మనస్సులలా బారులు తీర్చివున్నాయి. మధ్యమధ్య వలయంగా నీడలు కల్పిస్తూ, మెల్లకన్నులలా వున్నాయి. బ్లాకౌట్ చేయబడిన విద్యుద్దీపాలు. ఒక్కొక్కచోటా షెల్టర్లూ, సగం తీయబడిన గోతులూ, కంకరగుట్టలూ కూడా వున్నాయి.


ఆంధ్రపత్రిక . ఆదివారం, మే 7, 1944

కదిలే నీడలు

[కథ]

శ్రీ బాలగంగాధర తిలక్

'ఇలా ఎక్కడికి?' అంది ఆమె. తల పైకి ఎత్తినపుడు చెవిలోలకు మెరిసింది.

'ఎక్కడి కేమిటి?' అన్నాడతను. అతని చేయి జేబులోనికి పోయింది. కాని తిరిగీ తీసివేశాడు.

'ఒక్కొక్కసారి చీకటి బాగానే వుంటుంది.'

'అవును' అంది ఆమె.

'మీకు యింగ్లీషు వచ్చునా?'

'ఆc!' అంది ఆమె.

'మీ ఆయన ఏం చదివాడు?' అన్నాడతను, మరొకవైపు చూస్తూ.

'బి.యే.'

'మిమ్మల్ని వదలి యెలా వెళ్ళాడు?'

'లేకపోతే ఏం చెయ్యమంటారు?'

'మీకు బాధగా లేదూ?'

'ఎందుకు వుండాలీ?' అంది ఆమె.

'అంతే..అంతే..' అన్నాడతను. దేనికోసమో, తిరిగీ అతని చెయ్యి జేబులోనికి పోనిచ్చి తిరిగీ తీసివేశాడు.

'ఈరోడ్డు చాలా పొడుగు' ఏం తోచక, యిలా అన్నాడు.

'అవును.'

ఇంతలోకే మెరిసే టార్చితో ఒక కారు వచ్చి వాళ్ళ పక్కనుంచే పోయింది. ఆమె తప్పుకోవటంలో అతనికి తగిలింది. అతను తెలీకుండానే అప్రయత్నంగా ఆమెకు తగలబోయాడు. కాని ఆమె యింతలో దూరంగా తొలగింది.

'ఏమిటిది?' అని ఆమె కారుని ప్రశ్నిస్తూ అడిగింది.

'లారీ __ మిలటరీ వాళ్ళది.'

'యుద్ధం వస్తుందా?'

'ఏమో' అన్నాడతను.

ఒక మిణుగురు ఆమె ముంగురులకి తగిలి వెళ్ళిపోయింది. గేటు వెనకాల కుక్క వీళ్ళని చూసి మొరగబోయి మానివేసింది. ప్రక్కనే రోడ్డు మీద పడుకున్న ముసలిది కలవచ్చి కాబోలు కలవరించింది.

'మీరేమిటీ ఆలోచిస్తున్నారు?' అన్నాడతను.

'ఏమీ లేదు'

'ఏమీ లేదూ?'

'ఏమీ లేదు.' ఆమె స్ఫుటంగా అంది.

అతనికాశ్చర్యం వేసింది. ఏమీ లేకపోవటం అంటే? లారీలూ, షెల్టర్లూ, విమానాలూ, పత్రికలూ, హిట్లరూ, ఎ.ఆర్.పి, ఆమె, తానూ-అన్నీ అందరూ వుంటే ఏమీ లేకపోవటం యేమిటి? తెలివిగా తనంతట తనే కనురెప్పలమధ్య నవ్వుకొన్నాడు. ఒకసారి జేబులోనికి చెయ్యి పోనిచ్చి, తీసివేశాడు.

'మీ ఆయన ఎక్కడున్నాడు?'

'యీజిప్టులో.'

'పాపం!'

'ఏం?' అంది ఆమె,

'ఎందుకు సైన్యంలో చేరాడు?'

'ఎందుకా .. మీరెందుకు చేరారూ?'

'నేను యీదేశంలో వుంటానుగా.'

'అయితే నేం?'

'ఎందుకు చేరానా!' అతను ఆలోచిస్తూ ట్రాము బద్దీలకేసి చూశాడు. అవి పొడుగ్గా సాగి ఎక్కడో చీకట్లో కలసిపోయాయి. 'ఎందుకేమిటీ? యమ్మే ప్యాసయాను. ఉద్యోగమూ లేదు, డబ్బూ లేదు. నా భార్య కూడా చనిపోయింది. ఏం తోచలేదు. అందుకే సైన్యంలో చేరాను.' ఏదో ఆలోచిస్తూ అలాగే అతను నుంచునిపోయాడు.

ఆమె నాలుగడుగులు ముందుకు వేసి, వెనక్కి తిరిగి 'ఆగిపోయారేం?' అంది.

'మర్చిపొయ్యాను.' అని క్రాపు సవరించుకొని బయల్దేరాడు.

'మీ భార్య ఎందుకు పోయిందీ?' ఆమె అడిగింది.

'నన్ను ప్రేమించీ'

ఆమె వింతగా చూసింది. అతను కంగారుగా తల తిప్పుకున్నాడు.

'ఎప్పుడయింది మీ పెళ్ళి?' అంది ఆమె.

'మేం పెళ్ళి చేసుకోలేదు.' అన్నాడతను.

'అంటే?'

'ఆమె చదువుకుంటూ నాతో వచ్చేసింది. నాగపూరు వెళ్ళిపోయాం. అక్కడ సత్యాగ్రహంలో పాల్గొన్నాము. మమ్మల్ని జైలులో పెట్టారు.'

'తర్వాత?'

'జైలులో మలేరియా వచ్చింది ఇద్దరికీ. మమ్మల్ని వదిలి పెట్టారు. నాకు మలేరియా దానంతటదే కుదిరింది. ఆమెకు కుదరలేదు మందులేక.'

'మందు ఎందుకు లేదు?'

'డబ్బు లేక ' అతను గుండెమీద చెయ్యి పెట్టి రాచుకొన్నాడు. ఆమె అవ్యక్తంగా వచ్చే ఒక ఆలోచనని తల్చుకుని భయపడి 'అబ్బా!' అంది.

'ఏం?' అన్నాడతను.

'ఏమీ లేదు.' అంది ఆమె

అతనికి తిరిగీ ఆశ్చర్యం వేసింది. తెలీని బాధా, వొంటరితనమూ, యుద్ధమూ, యీజిప్టూ, మలేరియా– ఇన్ని వుంటే లేకపోవటం ఏమిటి?

ఆకాశం మీద ఆర్ద్రా నక్షత్రం మీద ఒక లేత మబ్బు కప్పుకొని వుంది. ప్రక్క సందులో ఒక ఆంగ్లో యిండియన్ యువతీ యువకుడూ బూట్సులు చప్పుడు చేసుకుంటూ వెళ్ళుతున్నారు.

'మీరు వేల్సు ' Things to come' చదివారా?'

'నాకు వేల్సు అంటే అయిష్టం.'

'అందులో Walking dicease వచ్చిందిట యుద్ధం మూలాన్ని. మనకీ ఆ జబ్బు వచ్చిందేమో?' అతను నవ్వుదామని ప్రయత్నించి దానికి బదులుగా దగ్గాడు.

'మా మేనమామ క్షయమూలాన్ని చనిపోయాడు.' అంది ఆమె.

'మంచి పని చేశాడు.' అన్నాడతను. తిరిగీ యిలా అన్నాడు.

'మీరెందుకు నర్సుగా చేరారు?'

'ఆయన యుద్ధంలోకి వెళ్ళారా, మరి నేనేం చెయ్యను? ట్యూషన్లు చెప్పమన్నారు'

'బాగానే వుంది.'

'కాని చెప్పలేదు.'

'ఏం?'

'నాకసహ్యం.'

'తర్వాత?'

'నర్సుగా చేరాను ఒక హాస్పిటల్లో.'

'మరి.'

'ఒక రోగి వచ్చాడు.'

'ఎవరూ?'

'ఒకరూ, అతనంటే యిష్టం కలిగింది.'

'అంటే?'

'బాధపడుతూన్న అతనికీ బాధపడే రోజులున్నాయని తెలిసిన నాకూ ఒక వాత్సల్యం ఏర్పడింది.'

'మీకు తెలుగు బాగా వచ్చునే!'

'అవును పరీక్షల్లో పోయేది ఎప్పుడూ.'

'నర్సుపని ఎందుకు మానేశారు?'

'ఆ రోగి పోయాడు. తిరిగీ ఆ హాస్పిటలులో వుండలేకపోయాను.'

'మరి ఎందుకు సైన్యానికి నర్సుగా చేరారూ?'

'కొన్నాళ్ళు యీజిప్టు దగ్గర నుంచి ఉత్తరాలు వచ్చాయి. ఆ తర్వాత రాలేదు. '

'ఆహాఁ!'

'తర్వాత అతని భుజంలోంచి గుండు దూసుకు పోయిందని వార్తవచ్చింది.'

'పాపం!' అతను అప్రయత్నంగా ఆమె చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు.

'బ్రతికి వున్నాడో లేదో తెలియదు.'

ఆమె నుదుటి మీద పడే ముంగురుల్ని వణికే చేతితో సవరించుకుంది. 'అప్పటినుంచీ సంక్షోభంగా వుండేది మనస్సు. నేనూ కలకత్తా వచ్చి యీ సైన్యదళాలకి నర్సుగా చేరాను.'

'ఇక్కడ శాంతిగా వుందా?'

'లోని కంగారుని అణచివేస్తోంది ఈ యుద్ధ సంక్షోభం. ఒక్కొక్కసారి యీ సోల్జర్లలోనూ ఆయన ఉన్నాడా అనిపిస్తుంది.' అతనికేమనాలో తోచలేదు. 'చీకటి బావుంటుంది.' అన్నాడు. జేబులో చెయ్యిపెట్టి తీసివేశాడు. ఇద్దరూ రోడ్డు చివరకి వచ్చారు. దూరంగా పెద్ద మైదానంలో చిరుకాంతిలో డేరాలు కనపడ్డాయి. ఒక సన్నని గొంతుక పాడుతూన్నట్టు వినబడుతోంది. మైదానంలో యిక్కడా అక్కడా ఒకరిద్దరు కూర్చున్నారు.

'ఏమిటిదీ?' అంది ఆమె.

'బర్మా నుంచి వచ్చిన వాళ్ళ క్యాంపు.'

'వెళుదామా?'

'ఊఁ!'

ఇద్దరూ ఆ డేరాల వైపు నడవసాగారు. అంత రాత్రివేళ కొందరు డేరాలకి దూరంగా కూర్చుని ఉన్నారు. కొన్ని చోట్ల ఒక స్త్రీ పురుషుడూన్నూ. మెల్లగా వీచే గాలిలో వాళ్ళ గుసగుసలు వినబడుతున్నాయి డేరా సందులలోంచి వెలుగు సన్నగా పాకి యిసుక మీద పడి మెరుస్తోంది.

'వీళ్ళు భార్యా భర్తలా!' అంది ఆమె.

'అవచ్చును. ఏం చెప్పగలం?' అన్నాడతను.

డేరాలు సమీపించారు. కొందరు పోలీసులు కనులు సగం తెరచి నిద్రపోతున్నారు. డేరాలకు కొలది దూరంలో షెల్టర్లు వున్నాయి. డేరాలలో పెట్టెలూ, సామానులూ, పేర్చబడి వున్నాయి. క్రింద చాపలమీద అనేకులు వృద్ధులూ, స్త్రీలూ, బాలురూ పడుకొని వున్నారు.

'ఎంతమందో!' అంది ఆమె.

'ప్రతి పట్టణంలోనూ వున్నారు.' అన్నాడతను.

ఒక చంటిపిల్ల 'కేరు' మంది. ఏడుస్తూ ప్రక్కకి దొర్లి మరొకరి వొళ్ళోకి వెళ్ళింది అతను విసుక్కుంటూ ఆ పిల్లని తోసివేశాడు. ఆ పిల్ల గట్టిగా ఏడవటం మొదలు పెట్టింది. ఇంతలోకే ఒక వృద్ధుడు లేచి, ఆ పిల్లను ఎత్తుకొని, ఓదారుస్తున్నాడు. ఆమె అడిగింది. 'తల్లి లేదూ?' ఆ వృద్ధుడికి అర్థమవలేదు తిరిగీ ఆమె యింగ్లీషులో అడిగింది. ఆ వృద్ధుడు అతి కష్టం మీద మాటలు పోగు చేసుకుంటూ యిలా చెప్పాడు. ఆపిల్ల తన కూతురు కూతురనీ, తన కూతురు అస్సాము సరిహద్దు దగ్గర ప్రసవించి చనిపోయిందనీన్నీ! తిరిగీ ఆగి యిలా అన్నాడు 'దీనికి పాలు లేవు. ఏం చెయ్యను! ఇది చచ్చిపోయినా బావుండును.'

ఆమె జాలిగా చూసింది. ఇద్దరూ తిరిగీ డేరాలు దాటి బయలుదేరారు.

'నాకు జాలివేసింది.' అంది ఆమె.

'ఏం' అన్నాడతను.

'ఆ పిల్ల నెత్తుకోవాలనిపించింది. కాని అసహ్యంగా వుంది, ఎముకలూ నాడులూ పైకి వచ్చి' ఆమె వెనక్కి తిరిగి చూసింది.

ఆమెకి యామయ్యాడో తెలియని భర్త యీజిప్టులో యిలాగే యిసుకలో సైనిక సమూహంతో నడుస్తూన్నాడు గదా అని భావించుకుంది. ఒకసారి పమిట చేత్తో సవరించుకుంది. ఎదురుగా ఒక యిరవై ఏళ్ళ యువకుడూ, యిరవై నాలుగేళ్ళ యువతీ వస్తున్నారు ; మసక నిదురలో నడుస్తూన్నట్లు. ఆ యువతి వీళ్ళని నిదానించి చూసి 'భామా' అని ఒక్క పరుగున వచ్చి వీళ్ళని చూసి, హఠాత్తుగా ఆగి, పకపకా నవ్వటం ప్రారంభించింది.

ఆ యువకుడు బర్మావాళ్ళ ఏదో భాషలో ఏదో అన్నాడు.

'ఎందుకు నవ్వుతావు?' అన్నాడు యింగ్లీషులో అతను.

'మిమ్మల్ని 'భామా' అనుకుంది. కాని మీరు 'కారు' అన్నాడు ఆ యువకుడు. ఆ యువతి ఏదో అంది. ఆమె నిద్రలేని కళ్ళు బరువుగా నవ్వాయి.

'ఆమె ఎవరని. ఈమె అడుగుతోంది.' అన్నాడాయువకుడు తనతో ఉన్న స్త్రీని చూపి.

'ఎవరేమిటీ ఎవరూ కాదు.' అన్నాడతను. ఆగి 'నీ పేరు?' అన్నాడు.

'లిన్ టంగ్.' అన్నాడు యువకుడు.

'ఈ రాత్రి యిలా ఎందుకు వచ్చారు. మీరు క్యాంపులో వుంటారా?'

'కాదు. మా దేశం యిది. మిలిటరీలో పని చేస్తున్నాం.' అన్నాడతను.

ఆ మాటలు ఆ భాషలోకి అనువదించి యువతితో చెప్పాడు లీన్ టంగ్.

'ఈమె పేరు ఆమా' అని తనతో ఉన్న స్త్రీని పరిచయం చేశాడు.

అమా వాళ్ళ భాషలో అంది. 'ఈ రాత్రి వీళ్ళెందుకు తిరుగుతున్నారు మనలాగా ?'

లీన్ టంగ్ చిరునవ్వుని లావుపాటి పెదవుల మధ్య నొక్కిపెట్టి 'కూర్చుందామా' అన్నాడు. కొద్దిగా ప్రక్కకి వెళ్ళి నలుగురూ కూర్చున్నారు. ఆ యువతి ఏదో మాట్లాడుతూ పకాలున నవ్వుతూంది. అతను అన్నాడు. 'ఆమె మీ అక్కయ్యా యేమిటి' లీన్ టంగ్ పళ్ళికిలించి 'కాదు కాదు. నాకన్న అమా నాలుగేళ్ళు పెద్ద అయినా యిప్పుడు భార్యలాంటిది.'

అతను అప్రయత్నంగా ఆమెకేసి చూశాడు. ఆమె లీన్ టంగ్ వైపు చూసింది. అతను జేబులో చెయ్యి పెట్టి తీసివేశాడు. ఆమె అడిగింది. 'మీరు' 'అమాని వివాహమాడలేదూ.'

'ఊహూఁ!; అది కాదన్నట్టుగా తలవూపాడు లీన్ టంగ్. 'ఈమె నా స్నేహితుని భార్య. ఒక పిల్లవాడు కూడా వుండేవాడు. యుద్ధంలో ఎవరిమట్టుకు వాళ్ళు చెల్లాచెదరై పోయారు. కలకత్తాలో మేం యిద్దరమూ కలుసుకొన్నాము. ఎప్పుడూ విచారిస్తూ దిగులుగా వుండేవాళ్ళం. మా యిద్దరికీ యిష్టమయింది. కష్టాలన్నీ మరచిపోగలుగుతాం యీ కాస్తసేపూ!'

'ఏం చేస్తూ ఉంటారు మీరు?' అన్నాడతను.

'ఉద్యోగం చేసేవాణ్ణి వోవర్ శీర్ గా.' అన్నాడు లీన్ టంగ్.

అమా అక్కణ్ణుంచి లేచి అల్లరిగా గాలిలో యెగిరే మిణుగురుల్ని పట్టుకునేందుకు ప్రయత్నం చేస్తూంది. ఆమె నిట్టూర్చింది. అతను చేతిలోకి యిసుక తీసుకుని కొద్ది కొద్దిగా కింద పోస్తూ యిలా అన్నాడు. 'నువ్వు ఆమా కంటే చిన్నవాడివి.'

'అవచ్చును.' అన్నాడు లీన్ టంగ్ క్రాఫు లోనికి చతులు పోనిచ్చి. అతను ఆమెకేసి చూశాడు. ఆమె కునుకు పాట్లు పడుతూంది. అతను వీపుమీద తట్టి ఆమెను లేపాడు. ఆమె కళ్ళు తెరచి, చనువుగా నవ్వి 'నిద్ర వచ్చింది–చిత్రంగా!' అంది.

'ఏదేనా ఉద్యోగం చేయరాదు?' అన్నాడతను లిన్ టంగ్ తో.

'అదే ఆలోచిస్తున్నాను. నేనూ మిలటరీలో చేరుదామనుకుంటున్నాను.' అన్నాడు లిన్ టంగు.

'మరి అమా?' అంది ఆమె.

లీన్ టంగ్ ప్రేమగా అమా వైపు చూశాడు. 'అవును, యేడుస్తుంది, అయితేనేం, యీ దేరాలలో సరీగ్గా తిండి లేకుండా ఎన్నాళ్ళు వుండగలం? నేను లేకపోతే యింకొక మంచి వాణ్ణి స్నేహం చేసుకుంటుంది. యుద్ధం వచ్చాక ఏం చేస్తాము. ఒకరిమీద ఒకరు ఆధార పడకపోతే బ్రతకటమే కష్టమవుతుంది. ఎప్పుడేమయిాదీ తెలియదు. అందుకనే కష్టాలన్నీ మరచిపోయే స్నేహం కావాలి.' లీన్ టంగ్ గొంతుకలో కందిరీగ దూరినట్లు స్వరం విషాదంగా పలికింది 'ఏదీ నా అమా? అల్లరి పిల్ల' దూరంగా వెళ్ళిపోయింది. నేనూ వెళ్తాను' అంటూ లీన్ టంగ్ లేచాడు. అతను లేచాడు. ఆమె లేచింది.

నిశ్శబ్దంగా యిద్దరూ ముందుకు నడిచి వెళుతున్నారు. పోలీసు యీల దూరంగా వినబడింది. తూర్పున నక్షత్రం మీద కప్పుకున్న మబ్బు పింజెలు పింజెలుగా విడిపోయింది. ఇద్దరూ వెనక్కి తిరిగి చూశారు, దూరంగా అమా లిన్ టంగ్ కౌగిళ్ళలో వున్నారు. ఇద్దరూ యిసుక ప్రదేశం దాటి, ఎత్తుగా వున్న ఒక దిబ్బవద్దకు వచ్చారు. కొన్ని తాడిచెట్లు యిక్కడా అక్కడా వున్నాయి.

'ఇలా కూర్చుందాం.' అతను అన్నాడు.

'ఊఁ!' అంది ఆమె.

ఆ దిబ్బమీద యిద్దరూ కూర్చున్నారు. ఆకాశం మీద చంద్రుడు వదలిన పువ్వురేకులా వున్నాడు. ఇద్దరి నీడలూ వెనక్కి పొడుగ్గా సాచుకొని వున్నాయి.

'లిన్ టంగ్ చిత్రమైనవాడు.'

'ఔను!'

'అవును' అంది ఆమె.

'మరీ...'

'ఏమిటి?' అందామె.

'ఏదో చెప్పబోయి మరిచిపోయాను?' అన్నాడతను. జేబులోనికి చెయ్యి పోనిచ్చి తిరిగీ తీసివేశాడు.

ఆమె వింతగా చూసింది అతనికేసి. అతను నిశ్చలంగా శూన్యంకేసి చూస్తున్నాడు తాటి చెట్టుపక్కనుంచి ఒక ముంగిస పరుగెత్తుకు వెళ్ళింది. గుడ్డి వెన్నెలలో పట్టణపు మేడల కొసలు మెరుస్తున్నాయి. దూరంగా దేరాల నీడలు యిసుకలో మెత్తగా పరచుకుంది. గాలి కదులో నిశ్శబ్దం కదులుతూంది. అతను నవ్వాడు. ఆమె ముంగురులు సవరించుకుంటూ 'ఏం' అంది.

'ఏముందీ, ఎందుకొవచ్చింది, ఏడుపులాంటి నవ్వు.' అన్నాడాతను చెయ్యి జేబులోనికి పోనిచ్చి తిరిగీ తీసివేశాడు. గంభీరంగా మారిపోయాడు. పళ్ళు పటపట కొరుకుతూ 'యుద్ధం, యుద్ధం' అన్నాడు.

ఆమె మాట్లాడలేదు. అతను ఆమెకేసి చూశాడు. ఆమె కళ్ళమ్మట నీటి చుక్కలు రాలుతున్నాయి. అతను తెల్లబోయాడు. జాలి అతని మొహంలో ప్రసరించింది. 'ఎందుకు, ఎందుకు ఏడుస్తున్నావూ?' అన్నాడు. ఆమె జవాబు యివ్వలేదు. అతను ఆమె దగ్గరగా జరిగి ఆమె తలనీ, చెక్కిళ్ళనీ నిమిరాడు. ఆమె వొరిగి, అతని వక్షం మీద శిరస్సుని ఆన్చింది. అతను ఆమె పెదవుల్ని ముద్దు పెట్టుకున్నాడు. ఇద్దరూ ఒకరి ప్రక్కగా ఒకరు ఒరిగి పడుకున్నారు.

'రేపు ఆఫీసరు వస్తాడు పరీక్షచేసేందుకు.'

'అవును' అంది ఆమె.

'ఇక్కడ బావుంది కదూ, పీడకలలు వచ్చే నిద్రకన్న' అన్నాడతను. అతను తిరిగీ చెయ్యి జేబులోనికి పోనిచ్చి తిసివేశాడు.

'ఎందుకూ యిందాకటి నుంచీ జేబు తడుము కుంటున్నారూ!' అంది ఆమె. ఆతని జుట్టులోనికి వేళ్ళని పోనిస్తూ.

అతను నవ్వాడు. 'సిగరెట్ల కోసం. లేవన్న మాట మరిచిపోతూంటాను!'

మధ్య మధ్య ఏవో చప్పుళ్ళకి తప్ప ఆ పట్టణం అంతా నిశ్శబ్దంలో ముడుచుకుని వుంది. ఆ గుడ్డి వెన్నెలలో ఆ నగరమూ, జనమూ పెద్ద నీడలులా పరచుకొని వున్నాయి.